Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 293 మేడ్చల్ మల్కాజ్‌గిరి 11 నవంబర్ 2023 శనివారం

## 4 నుంచి పార్లమెంటు శీతాకాల సమావేశాలు

న్యూఢిల్లీ : డిసెంబరు 4 నుంచి 22 వరకు పార్లమెంటు శీతాకాల సమావేశాలు నిర్వహించనున్నట్లు పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి వెల్లడించారు. మొత్తం 19 రోజుల్లో సెలవులు మినహాయించి 15 రోజుల పాటు ఉభయ సభలు సమావేశమవుతాయని ఆయన ఎక్స్ (ట్విటర్)లో పేర్కొన్నారు. టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రాపై ఆరోపణలకు సంబంధించి ఎథిక్స్ కమిటీ నివేదిక ఈ సమావేశాల్లో ప్రవేశపెట్టవచ్చు. ఐపీసీ, సీఆర్‌పీసీ, ఎవిడెన్స్ యాక్ట్‌ల స్థానంలో కేంద్రం తీసుకొచ్చిన కొత్త బిల్లుల గురించి ఈ సమావేశాల్లో చర్చించే అవకాశముంది. వీటితోపాటు ప్రధాన ఎన్నికల కమిషనర్, ఎన్నికల కమిషనర్ నియామకాలకు సంబంధించిన బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి.



# సమరానికి సై అంటున్న వారసులు

## తాడోపేడో తేల్చుకునేందుకు సిద్ధం!!

హైదరాబాద్ : రాజకీయాల్లో వారసత్వం అనేది కామన్. ఒక్కసారిగా రాజకీయ నాయకుడిగా ఎదిగిన ఎవరైనా, పదవులు అనుభవించిన వాళ్లు అయినా తమ వారసులను రాజకీయాల్లోకి దింపాలనే చూస్తారనడంలో సందేహం లేదు. ఇక ఎన్నికలు వచ్చాయంటే రాజకీయ నాయకుల వారసుల హడావుడి అంతా ఇంతా కాదు. ఎన్నికల్లో పోటీలో నిలబడి.. విజయం కోసం వ్యూహాలు పన్నుతున్నారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లోనూ వారసులు తమదైన ముద్ర వేసేందుకు సిద్ధమయ్యారు. వీళ్లలో అత్యధిక మంది తొలిసారి ఎన్నికల సమరంలో తాడోపేడో తేల్చుకునేందుకు సై అంటున్న వాళ్లే. కంటోన్మెంట్ నియోజకవర్గంలో వారసుల మధ్యే ప్రధాన పోటీ ఉందని చెప్పొచ్చు. తన చివరి రోజుల్లో దివంగత ప్రజా గాయకుడు గద్దర్ కాంగ్రెస్ కు మద్దతుగా నిలిచిన సంగతి తెలిసిందే. ఆయన ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసేలా కనిపించారు కూడా. కానీ గద్దర్ మరణించారు. ఆయనకు మద్దతుగా నిలిచిన కాంగ్రెస్ ఈ ఎన్నికల్లో గద్దర్ కుమార్తె వెన్నెలకు టికెట్ కేటాయించింది. మరోవైపు దివంగత ఎమ్మెల్యే తనయ లాస్య బీఆర్ఎస్ నుంచి ఓట్ల వేటలో సాగుతున్నారు. మరి ఈ నియోజకవర్గంలో గెలుపు ఎవరిదో చూడాలి. మరోవైపు కోరుట్ల నుంచి ఈ సారి విద్యాసాగర్ తనయుడు సంజయ్ కు కేసీఆర్ అవకాశం కల్పించారు. కొడుకు కోసం ఇక్కడి సిట్టింగ్ ఎమ్మెల్యే విద్యాసాగర్ తన సీటును త్యాగం చేశారు. మరోవైపు ఈ సారి ఎన్నికలకు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జానారెడ్డి దూరంగా ఉన్నారు. దీంతో ఆయన చిన్న కొడుకు జై వీర్ రెడ్డికి కు నాగార్జున సాగర్ టికెట్ కేటాయిస్తూ కాంగ్రెస్ నిర్ణయం తీసుకుంది. ఇప్పుడీ నియోజకవర్గంలో తనయుడి గెలుపు కోసం జానారెడ్డి ప్రచారంలో మునిగిపోయారు. దివంగత కాంగ్రెస్ నేత పి.జానార్ధన్ రెడ్డి తనయ విజయారెడ్డి ఈ సారి ఖైరతాబాద్ లో నిలబడ్డారు. ఇక పి.జనార్ధన్ రెడ్డి కొడుకు, మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్ రెడ్డికి కాంగ్రెస్ టికెట్ ఇవ్వకపోవడంతో ఆయన బీఆర్ఎస్ లో చేరిన సంగతి తెలిసింది. మరోవైపు మైనంపల్లి హన్మంతరావు కొడుకు రోహిత్ మెదక్ నుంచి కాంగ్రెస్ తరపున పోటీ చేస్తున్నారు. బీఆర్ఎస్ లో తనకు టికెట్ వచ్చినా తన కొడుక్కి అవకాశం ఇవ్వకపోవడంతో మైనంపల్లి హన్మంతరావు పార్టీ మారి కాంగ్రెస్ లోకి వెళ్లి రెండు టికెట్లు దక్కించుకున్న సంగతి తెలిసిందే. మహబూబ్ నగర్లొ జితేందర్ రెడ్డి తనయుడు మిథున్ బీజేపీ నుంచి, నాగర్ కర్నూల్ లో ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి కొడుకు రాజేశ్ కాంగ్రెస్ నుంచి బరిలో ఉన్నారు. మరి వీళ్లలో గెలిచి అసెంబ్లీ వెళ్లేదెవరో చూడాలి.

## ఆ ముగ్గురు ప్రముఖులు పోటీ చేసే రెండేసి స్థానాలు ఇవే



హైదరాబాద్ : తెలంగాణ అసెంబ్లీకి జరుగుతున్న ఎన్నికల్లో కీలక ఘట్టం శుక్రవారంతో ముగిసింది. ప్రముఖులు పలువురు ఇప్పటికే తమ నామినేషన్లను దాఖలు చేశారు. దీంతో.. పోటీకి సంబంధించిన క్లారిటీ వచ్చేసిందనే చెప్పాలి. ఈ నెల 30 జరిగే పోలింగ్ తో అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన కీలక కార్యక్రమం ముగుస్తుంది. అనంతరం జరిగే ఓట్ల లెక్కింపుతో కొత్త ప్రభుత్వం ఎవరిదన్న దానిపై క్లారిటీతో పాటు.. ఎవరి చేతికి అధికారం దక్కనుందన్న విషయంపై క్లారిటీ రానుంది. నామినేషన్ల విషయానికి వస్తే.. తాజా ఎన్నికల్లో ముగ్గురు కీలక నాయకులు (ఒకవిధంగా చెప్పాలంటే ఈ ముగ్గురు ముఖ్యమంత్రి రేసులో ఉన్న వారే) కేసీఆర్.. రేవంత్ రెడ్డి.. ఈటల రాజేందర్ ముగ్గురు కూడా రెండేసి స్థానాల్లో పోటీ చేయటం గమనార్హం. బీఆర్ఎస్ అధ్యక్షుడు కమ్ ముఖ్యమంత్రి కేసీఆర్ "గజ్వేల్ .. కామారెడ్డి" నుంచి పోటీ చేస్తుండగా.. టీపీసీసీ చీఫ్ గా వ్యవహరిస్తున్న రేవంత్ రెడ్డి "కొడంగల్.. కామారెడ్డి" స్థానాల్లో పోటీ చేయనున్నారు. ఇక.. బీజేపీ ఎమ్మెల్యే కం కమలం పార్టీ చేరికల కమిటీ ఛైర్మన్ గా వ్యవహరిస్తున్న ఈటల రాజేందర్ "హుజూరాబాద్.. గజ్వేల్" నుంచి పోటీ చేస్తున్నారు. గతంలో ఈ తరహా కాంబినేషన్ లో ఎన్నికలు జరిగింది లేదు. తాజా నామినేషన్లను చూస్తే.. ముఖ్యమంత్రి కేసీఆర్ పోటీ చేస్తున్న రెండు స్థానాల్లోనూ గట్టి పోటీ ఏర్పడటమే కాదు.. తుది ఫలితం మీద ఆసక్తి వ్యక్తమయ్యేలా ఉండటం గమనార్హం. తాజా ఎన్నికల్లో ఏడుగురు ఎంపీలు అసెంబ్లీ ఎన్నికల్లో తమ లక్ ను చెక్ చేసుకోనున్నారు. ప్రస్తుతం ఎంపీలుగా వ్యవహరిస్తున్న వారు తాజా అసెంబ్లీ బరిలో నిలిచారు. ఈ ఏడుగురు మూడు ప్రధాన పార్టీలకు చెందిన వారు ఉండటం విశేషం. అధికార బీఆర్ఎస్ నుంచి ఒకరు..కాంగ్రెస్ నుంచి ముగ్గురు.. బీజేపీ నుంచి ముగ్గురు ఎంపీలు అసెంబ్లీ ఎన్నికల బరిలో నిలవటం కనిపిస్తుంది. - మెదక్ ఎంపీగా వ్యవహరిస్తున్న కొత్త ప్రభాకర్ దుబ్బాక అసెంబ్లీ బరిలో నిలిచారు. - మేడ్చల్ ఎంపీగా వ్యవహరిస్తున్న రేవంత్ రెడ్డి.. కొడంగల్, కామారెడ్డి నుంచి బరిలో ఉన్నారు. - నల్గొండ ఎంపీగా ఉన్న ఉత్తమ్ కుమార్ రెడ్డి.. హుజూర్ నగర్ అసెంబ్లీ బరిలో ఉన్నారు- భువనగిరి ఎంపీగా ఉన్న కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి.. నల్గొండ అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేస్తున్నారు. - కరీంనగర్ ఎంపీగా ఉన్న బండి సంజయ్ కరీంనగర్ నుంచి పోటీ చేస్తున్నారు. - నిజామాబాద్ ఎంపీగా ఉన్న ధర్మపురి అర్వింద్.. కోరుట్ల నుంచి అసెంబ్లీ రేసులో ఉన్నారు. - ఆదిలాబాద్ ఎంపీగా వ్యవహరిస్తున్న సోయం బాపురావు బోథ్ నుంచి బరిలో దిగారు. ఈ ఎన్నికల్లో ఐదుగురు ఎమ్మెల్సీలు పోటీ చేస్తున్నారు. అధికార బీఆర్ఎస్ నుంచి ముగ్గురు ఉండగా.. కాంగ్రెస్ నుంచి ఒకరు.. బీఆర్ఎస్ కు రాజీనామా చేసిన ఎమ్మెల్సీ కసిరెడ్డి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో ఉన్నారు. అసెంబ్లీ బరిలోకి దిగిన ఎమ్మెల్సీల్ని చూస్తే.. - కడియం శ్రీహరి బీఆర్ఎస్ అభ్యర్థిగా స్టేషన్ ఘన్ పూర్ నుంచి పోటీ చేస్తుంటే.. అధికార పార్టీకి చెందిన మరో ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి జనగామ నుంచి పోటీ చేస్తున్నారు. ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డి హుజూరాబాద్ నుంచి పోటీ చేస్తున్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్సీగా వ్యవహరిస్తున్న జీవన్ రెడ్డి జగిత్యాల నుంచి పోటీ చేస్తున్నారు. ఇక.. బీఆర్ఎస్ కు రాజీనామా చేసిన ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణ రెడ్డి కల్వకుర్తి నుంచి రేసులో నిలిచారు. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో ఐదుగురు డాక్టర్లు పోటీలో ఉన్నారు. జగిత్యాల బరిలో నుంచి ఎం సంజయ్.. కోరుట్ల నుంచి కె. సంజయ్.. వికారాబాద్ నుంచి మెతుకు ఆనంద్.. నారాయణపేట నుంచి పర్ణిక.. పరకాల నుంచి కాళీప్రసాద్ లు పోటీలో ఉన్నారు. ఇక.. డెంటల్ డాక్టర్ అయిన శ్రావణి జగిత్యాల అసెంబ్లీ నుంచి బరిలోకి దిగనున్నారు. - ఈ ఎన్నికల్లో మరో స్థానం అందరిని ఆకర్షిస్తోంది. బీఎస్పీ తెలంగాణ అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్న ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సిర్పూరు బరిలో నిలిచారు.

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పాలేరు నుంచి.. మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి మిర్యాల గూడ గురించి పోటీ చేస్తున్నారు. మజ్లిస్ శాసనసభాపక్ష నేత అక్బరుద్దీన్ ఓవైసీ చాంద్రాయణ గుట్ట నుంచి బరిలో నిలిచారు. ఇదే స్థానానికి ఆయన కుమారుడు కూడా నామినేషన్ దాఖలు చేశారు.




## ఆఖరి నిమిషంలో నామినేషన్ వేసిన రేవంత్

హైదరాబాద్: తెలంగాణలో నామినేషన్ల ప్రక్రియ ముగిసింది. మధ్యాహ్నం 3 గంటలతో గడువు ముగిసింది. 3 గంటల తర్వాత లైన్‌లో ఉన్నవారికి మాత్రం నామినేషన్లు వేసే అవకాశం కల్పించింది. ఈనెల 13న అధికారులు నామినేషన్లు పరిశీలించనున్నారు. ఈనెల 15 వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు విధించారు. ఇక ఈ నెల 30న 119 నియోజకవర్గాల్లో ఒకేసారి పోలింగ్ జరగనుంది. డిసెంబర్ 3న ఎన్నికల ఫలితాలు వెలువడ నున్నాయి. ఈసారి టీడీపీ, వైఎస్సార్‌టీపీ పోటీ నుంచి తప్పుకున్నాయి. వైఎస్సార్‌టీపీ మాత్రం అధికారికంగా కాంగ్రెస్‌కు మద్దతు తెలిపింది. ఇక కాంగ్రెస్‌తో పొత్తులో భాగంగా సీపీఐ కొత్తగూడెం నుంచి బరిలోకి దిగింది. సీపీఎం మాత్రం ఒంటరిగా పోటీ చేస్తోంది. 119 నియోజకవర్గాల్లో రెండు వేల ఐదు వందలకు పైగా నామినేషన్లు దాఖలయ్యాయి. అత్యధికంగా గజ్వేల్, మేడ్చల్ నియోజకవర్గాల్లో నామినేషన్లు వేశారు. గజ్వేల్‌లో యాభై, మేడ్చల్‌లో ముప్పై వరకు నామినేషన్లు వేశారు. 118 స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థుల నామినేషన్లు వేశారు. ఒక స్థానం సీపీఐకి కాంగ్రెస్ కేటాయించింది. గతంతో పోలిస్తే ఈసారి కాంగ్రెస్‌కు రెబల్ బెడద కూడా తగ్గింది. ఒకటి, రెండు స్థానాలు మినహా ఎక్కడా రెబల్స్ బెడద లేదు. నామినేషన్ల ఉపసంహరణ నాటికి కాంగ్రెస్ నుంచి సింగిల్ అభ్యర్థులు ఉండే ఛాన్సుంది. ఇక కామారెడ్డిలో సీఎం కేసీఆర్‌పై పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి, గజ్వేల్‌లో బీజేపీ నేత ఈటల రాజేందర్ పోటీ చేస్తున్నారు. కామారెడ్డిలో ఆఖరి నిమిషంలో రేవంత్‌రెడ్డి దాఖలు చేశారు. ఇక పోలింగ్‌కి మరికొన్ని రోజులే ఉండడంతో ఇక ప్రచారం ఊపందుకోనుంది.




# 2023 ఎన్నికల్లో.... ఊపిరిపీల్చుకున్న కాంగ్రెస్

## ప్లాన్ అదిరిపోయిందిగా..!!

అవును.. తెలంగాణలో జరగబోతున్న 2023 సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి భారీ ఊరట లభించింది. ఎందుకంటే.. ఎన్నికల షెడ్యూల్ మొదలుకుని నామినేషన్ల గడువు ముగిసే వరకూ పరిస్థితి ఎలా ఉంటుందో ప్రత్యేకించి చెప్పనక్కర్లేదు. ఎంత మంది తిరుగుబావుటా ఎగురవేస్తారో.. ఇంకెంతమంది టికెట్ల దక్కక రెబల్స్ మారుతారో లెక్కే ఉండదు. మునుపటితో పోలిస్తే.. ఈ ఎన్నికల్లో మాత్రం కాంగ్రెస్‌కు ఆ తిప్పలు లేవు. ఎందుకంటే.. గతంతో పోలిస్తే ఒకట్రెండు నియోజకవర్గాల్లో తప్ప ఎక్కడా రెబల్స్ అయితే ఇప్పటి వరకూ కనిపించలేదు. అయితే.. నామినేషన్ల ఉపసంహరణ నాటికి కాంగ్రెస్ నుంచి సింగిల్ అభ్యర్థులు మాత్రమే ఉండే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. వాస్తవానికి.. అభ్యర్థుల ఎంపిక మొదలుకుని బీఫామ్‌లు అందజేసి, నామినేషన్లు ఇచ్చేవరకూ హైకమాండ్ తీవ్ర కసరత్తులు చేసి పక్కా ప్లాన్‌తోనే ముందుకెళ్లింది.

పైగా.. స్వయంగా ఢిల్లీ పెద్దలు కలుగజేసుకోవడం, ఇక కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ రంగంలోకి దిగి అసంతృప్తులందరికీ నచ్చజెప్పారు. అటు ఢిల్లీ పెద్దలతో.. ఇటు కీలక నేతలు.. ఎన్నికల వ్యూహకర్తతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ ఒకట్రెండు చిన్న చిన్న వివాదాలు మినహాయించి అన్నీ పక్కాగా అమలు చేసుకుంటూ టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి ముందుకెళ్లారు. ఇలా ఒక అంఖం అయితే ముగిసింది.

**ఎక్కడా పొరపచ్చాల్లేకుండా..?** వాస్తవానికి.. ఐదారు నియోజకవర్గాల్లో అభ్యర్థుల విషయంలో ఆఖరి నిమిషం వరకూ కాంగ్రెస్ హైకమాండ్ హైరానా పడింది. ఎందుకంటే తమ అనుచరులకు.. కుటుంబ సభ్యులకే టికెట్లు ఇవ్వాలని కొందరు సీనియర్లు గట్టిగానే పట్టుబట్టారు. దీంతో అటు ఆయనకు.. ఇటు ఈయనకు ఇద్దరికీ ఏమీ చెప్పలేక హైకమాండ్ ఇబ్బంది పడిన పరిస్థితులు కూడా ఉన్నాయి. దీంతో అభ్యర్థులను ప్రకటించడం.. బీఫామ్‌లు ఇవ్వడం, ఇంకొందరికి ఇవ్వలేకపోవడం.. ఆఖరి నిమిషంలో అభ్యర్థిని మార్చడంతో ఆయా నియోజకవర్గాల్లో క్యాడర్ కాస్త గందరగోళానికి గురైన పరిస్థితి నెలకొంది. పఠాన్ చెరు, తుంగతుర్తి, నారాయణ్‌ఖేడ్ నియోజకవర్గాల అభ్యర్థుల విషయంలో మల్లగుల్లాలు పడిందని చెప్పుకోవచ్చు. ఇలా జరిగినప్పటికీ ఎక్కడా పొరపచ్చాలు లేకుండా అసంతృప్తులందరికీ సర్దిచెప్పినప్పటికీ పఠాన్ చెరు నుంచి అభ్యర్థిగా ప్రకటించిన నీల మధు ముదిరాజ్ ఆఖరికి బీఎస్పీ కండువా కప్పుకొని నామినేషన్ దాఖలు చేశారు. కొన్ని అసెంబ్లీ స్థానాల్లో సీనియర్లను సైతం పక్కనెట్టి కొత్తవారికి, బీఆర్ఎస్, బీజేపీ నుంచి వచ్చిన వారికి సర్వేలు చేసి మరీ టికెట్లు ఇచ్చిన పరిస్థితి.

ఇంకా ఒకట్రెండు చోట్ల టికెట్లు దక్కి.. బీఫామ్ రానివారు రెబల్స్‌గా మారిన పరిస్థితి. అయితే.. బీజేపీలోనూ ఇదే పరిస్థితి.. నామినేషన్ వేసుకోవచ్చు ఇక బయల్దేరండని చెప్పి ఆఖరికి ఇవ్వకపోవడం అల్లకల్లోల్లం అయ్యింది. కాగా మొత్తం రాష్ట్ర వ్యాప్తంగా గురువారం సాయంత్రం వరకూ 2028 నామినేషన్లు వచ్చాయని తెలిసింది.

**ఎప్పుడేం జరుగుతుంది..?**

**నవంబర్-10తో ముగిసిన నామినేషన్ల పర్వం**
**నవంబర్ -13న నామినేషన్ల పరిశీలన**
**నవంబర్ - 15 వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు**
**నవంబర్-30న పోలింగ్**
**డిసెంబర్ -03న కౌంటింగ్**

# సంపాదకీయం

## కిరణ్‌కుమార్.. కిరణాలు ఎక్కడా పడడం లేదే!

ఉమ్మడి ఏపీ మాజీ ముఖ్యమంత్రి, ప్రస్తుతం బీజేపీలో ఉన్న నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి ఊసు ఎక్కడా వినిపించడం లేదు. ఆయన ఎక్కడున్నారో.. ఏం చేస్తున్నారో.. కూడా తెలియడం లేదని బీజేపీలోనే ఒక టాక్ నడుస్తోంది. మరోవైపు కీలకమైన అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్నాయి. ఎక్కడెక్కడి నుంచో నాయకులను బీజేపీ నేతలు చేర్చుకుని ఈ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. కానీ, హైదరాబాద్‌పై పట్టున్న నాయకుడు, ముఖ్యంగా రెడ్డి సామాజిక వర్గంలో మంచి పలుకుబడి ఉన్న నేతగా కిరణ్‌కుమార్ రెడ్డి సేవలు ఎవరూ వినియోగించుకోవడం లేదా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కిరణ్‌కుమార్‌రెడ్డి గతంలో కాంగ్రెస్‌లో సుదీర్ఘకాలం పనిచేశారు. తర్వాత.. రాష్ట్ర విభజనను వ్యతిరేకించారు. ఈ క్రమంలోనే అసెంబ్లీలో ఆయన స్పీచ్ కూడా గంభీరంగా సాగింది. (ఇప్పటికీ సీఎం కేసీఆర్.. ఈయనను ప్రత్యక్షంగా పేరు పెట్టి చెప్పకపోయినా.. నాటి ముఖ్యమంత్రి అంటూ.. తెలంగాణ వస్తే.. నీటి యుద్ధాలు జరుగుతాయని, రాష్ట్రం చీకటిలోకి వెళ్లిపోతుందని అన్నారని.. కానీ, ఇప్పుడు తెలంగాణలో సస్యశ్యామలంగా పంటలు పండుతున్నాయని.. వెలుగు విరజిల్లుతున్నాయని చెబుతున్నారు.) ఇక, ఆ తర్వాత.. సొంత పార్టీ పెట్టుకున్న కిరణ్‌కుమార్ రెడ్డి చతికిలపడ్డారు. ఆ తర్వాత కొన్నేళ్లపాటు ఆయన రాజకీయాలకు దూరంగా ఉన్నారు. తర్వాత మళ్లీ కాంగ్రెస్ బాట పట్టారు. తర్వాత మళ్లీ ప్రాధాన్యంలేదంటూ.. బీజేపీ కండువా కప్పుకొన్నారు. మరి ఇప్పుడు పరిస్థితి ఏంటి? ఆయన ఉద్దేశ పూర్వకంగా ఎన్నికలకు దూరంగా ఉంటున్నారా? లేక.. బీజేపీ అధిష్టానమే ఆయనను సైలెంట్ చేసిందా? అనేది చర్చనీయాంశం. కిరణ్‌కుమార్ బయటకు వచ్చి ప్రచారం చేస్తే.. దీనిని అడ్వాంటేజ్‌గా చేసుకుని.. కేసీఆర్ ప్రభృతులు తెలంగాణ సెంటిమెంటును మరోసారి రెచ్చగొట్టి.. ఇలాంటి వారు మనకు అవసరమా? అనే చర్చ లేవనెత్తే అవకాశం ఉంది. బహుశ.. దీనిని దృష్టిలో పెట్టుకునే బీజేపీ అధిష్టానం కిరణ్‌ను సైలెంట్ చేసిందనే వాదన వినిపిస్తోంది. మరోవైపు.. తనకు బీజేపీలోనూ ప్రాధాన్యం లేదని.. భావిస్తున్న కిరణ్ తనంతట తనే సైలెంట్ అయ్యారనే వాదనకు కూడా బలం చేకూరుతోంది. ఏదేమైనా కీలక ఎన్నికల సమయంలో కిరణ్‌కుమార్‌రెడ్డి జాడ, వాయిస్ ఎక్కడా కనిపించడం లేదు. వినిపించడమూ లేదు. మరి ఆయన వ్యూ హం.. పార్టీ పంథా ఏంటనేది తెలియాలంటే.. ఇంకా వెయిట్ చేయాలేమో చూడాలి.

# ప్రజాసేవకు నేను సైతం అంటూ నామినేషన్ దాఖలు చేసిన పురోహితుడు

**తన అమూల్యమైన ఓటు ఏ పార్టీకి వేసేందుకు ఇష్టం లేక పోవడమే కారణం...**
**శంకుల అనిల్ కుమార్ డిగ్రీ బీఎస్సీ కంప్యూటర్స్**




గరుడ వార్త మేడ్చల్ జిల్లా బ్యూరో : ఆలయంలో పూజలు నిర్వహించే పురోహితుడు, తాను కూడా మేడ్చల్ నియోజకవర్గ ప్రజలకు సేవ చేస్తానంటూ తన నామినేషన్ న్ని దాఖలు చేశారు. మూడుచింతలపల్లి మండల పరిధిలోని అనంతారం గ్రామస్తుడైన శంకుల అనిల్ కుమార్ డిగ్రీ బీఎస్సీ కంప్యూటర్స్ పూర్తి చేశాడు. కాగా తన స్వగ్రామంలో ఉన్న ఆంజనేయస్వామి, శివాలయంలో పూజారిగా జీవనం కొనసాగిస్తున్నాడు. అయితే తన అమూల్యమైన ఓటు ఏ పార్టీకి వేసేందుకు ఇష్టం లేకనే తాను స్వతంత్ర అభ్యర్థిగా ఎన్నికల బరిలో దిగుతున్నట్లుగా అతను తెలిపారు. అందుకు అతను చెప్పిన ప్రధాన కారణం అన్ని రాజకీయ పార్టీల అభ్యర్థులు ప్రజల కోసం కాకుండా వారి స్వలాభం కోసమే పని చేస్తున్నారు. కాబట్టే తాను నిస్వార్థంగా ప్రజలకు సేవ చేసేందుకు మేడ్చల్ నియోజకవర్గం నుండి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్లుగా అతను తెలిపారు. తాను సోషల్ మీడియా ద్వార ప్రచారం చేస్తూ, దాంతో పాటుగా మరోవైపు ఇంటింటికి తిరిగి కూడా ప్రచారం చేస్తానని తెలిపారు. అందుకు తనకున్న వివిధ మండలాలు గ్రామాలకు చెందిన తన విద్యాభ్యాస స్నేహితులు సహకరిస్తారని శంకుల అనిల్ కుమార్ తెలిపారు.

# కూకట్ పల్లి నియోజకవర్గం లో భూ కబ్జాల, కమిషన్లకు కేరాఫ్ BRS ఎమ్మెల్యే

**ప్రజల సమస్యలు పరిష్కరించేది కాంగ్రెస్ పార్టీనేనని ప్రజలు బలంగా నమ్ముతున్నారు...**
**కాంగ్రెస్ కూకట్‌పల్లి నియోజకవర్గ అబ్యర్థి బండి రమేష్**



కూకట్‌పల్లి : ఈరోజు ఆరు గ్యారెంటీ పథకాల పై ఇంటింటా ప్రచారం చేస్తూ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ అభ్యర్థి బండి రమేష్ పాదయాత్ర నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ బోయినపల్లి డివిజన్ లోని అర్బర్ నగర్, ఫాతిమా, మషీద్, సిండికేట్ బ్యాంకు కాలనీ మీదగా వైష్ణవి దేవి కాలనీ లలోని పాదయాత్ర చేసి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మిషన్ భగీరథ మంచినీళు మురికిలో కలుస్తున్నాయిని, పెన్షన్ ఇస్తలేరని వృద్ధులు ఏడుస్తున్నారన్నారు, ఎన్నో సంవత్సరాల నుండి ఇల్లు లేక జాగా లేక ప్రజలు చాలా మురికివాడల్లో ఉంటున్నారు వాళ్ళు పాలక ప్రజప్రతినిడులకు కనిపిస్తలేరా అంటూ ప్రశ్నించారు. ఎమ్మెల్యే కాకా ముందు మాధవరావు కృష్ణ రావు, ఎమ్మెల్యే గా గెలిచాక కబ్జాలా కృష్ణ రావు గా పేరు మారిపోయిందఅంటూ ఘాటుగా ఆరోపించారు. అలాగే కృష్ణరావుని నమ్మి ప్రజలకు చెప్పి ఓట్లు వేయించి గెలిపించ, కానీ ఈరోజు గల్లీ గల్లీ తిరుగుతుంటే కృష్ణరావు పేరు మారి కబ్జాలా, కమిషన్ కృష్ణ రావు అని ప్రజలు అన్నమాట నిజగానే నేను కూడా అంటున్నానంటూ దుయ్యబట్టారు. కృష్ణ రావు దోచుకుంది ఇక చాలు, నువ్వు ఏరోజుకైనా నువ్వు తిన్నది కకించడానికి ప్రజలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటారన్నారు. పేద విద్యార్థులకు ఉచిత నాణ్యమైన విద్యా లేదు, కాలేజీలు లేవు, ఏ గల్లీ చుసిన రోడ్లు లేక డ్రైనేజీ వ్యవస్థ అతలాకుతలంగా ఉద్దంటూ ఆరోపించారు. ఓట్లు వేయించుకొని వారిసమస్యలు వినే నాధుడు లేడు అని అంటూ ఆవేదన వ్యక్తం చేసారు. అంటే ఈ రోజు ప్రజల ఓట్లు మాత్రమే మీకు అవసరం వారి సమస్యలు ఎవ్వరు పాటించుకోరా అందుకే ప్రజలు దృష్టిలో మీరు విఫలం చెందారు, కాబట్టి వారి సమస్యలను కాంగ్రెస్ పార్టీ పరిష్కరిస్తుందని నమ్ముతున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణం అందిస్తాము. పేద ప్రజలకు రవాణా సౌకర్యం అంటే ఆర్ టీ సి బస్సే శరణ్యం, ఆయన మీరు మీ ఆదాయం పెరుగలని బస్సు ఛార్జిలు పెంచారు. దాంతో వారు ఆర్థికంగా చాలా నష్టపోతున్నారు కాబట్టి, మా సోనియామ్మ ఉచితంగా ప్రయాణ సౌకర్యం కల్పించనుంది. ఈ రాష్ట్రములో ప్రియాంక గాంధీ ఆలోచనమేరకు ప్రతి మహిళకు 2500/-రూపాయలు వారి అకౌంట్లో వేయాలని గృహ లక్ష్మి పథకం అందించనున్నారు. పేద విద్యార్థులు పై చదువులకొరకు పోటీ పరీక్షల కొరకు యువ వికాస్ పథకం క్రింద 5 లక్షల రూపాయలు రాహుల్ గాంధీ అమోదించారు. ఇలా కూలీ, నాలి పనులు చేసి కరెంట్ బిల్లును కట్టలేని దుస్థితి ఈ రాష్ట్ర ప్రజలకు దాపరించింది. రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షులు రేవంత్ రెడ్డి అలోచించి 200యూనిట్ల కరెంట్ ఉచితంగా ఇస్తాము అని అన్నారు. ఆడపిల్ల పెండ్లి కీ కల్యాణ లక్ష్మితో పాటు తుల0 బంగారు, ఈ తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక పథకం కాబట్టి ప్రజలలు మార్పు కోరుకుంటున్నారు, కేసీర్ ఇక ఇంటికి పోయే సమయం ఆసన్నమైంది అని అన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కోర్డినేటర్ డాక్టర్ సత్యం శ్రీరంగం స్థానిక కాంగ్రెస్ సీనియర్ నాయకులు గోటేముక్కల వెంకటేశ్వరావు యాదగిరి డివిజన్ అధ్యక్షులు మల్లికార్జున్, యూత్ ప్రెసిడెంట్ కిరణ్ గౌడ్, శ్రీరాములు, శ్యామషా, శ్రీను, మహిళా అధ్యక్షురాలు విజయలక్ష్మి, అరుణ అస్లాం,అయూబ్, మహిళలు యువకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాలుగోన్నారు.

# కెసిఆర్ మైనార్టీలను మోసం చేస్తున్నారు...



కూకట్‌పల్లి : మైనార్టీలకు 12% రిజర్వేషన్ ఎక్కడ కేసీఆర్, బిఆర్ ఎస్ తో బిజెపి లిక్కర్ దోస్తాని అంటూ బిఆర్ ఎస్, బిజెపి పార్టీల పై విరుచుకుపడ్డ కాంగ్రెస్ జాతీయ నాయకులు. కూకట్ పల్లి నియోజక వర్గం అల్లాపూర్ డివిజన్ మోతినగర్ లో మైనార్టీ ఆత్మీయ సమ్మేలన ఆశీర్వాద సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులు రాజసభ సభ్యులు ,ఆల్ ఇండియా మైనార్టీ అధ్యక్షులు ఇమ్రాన్ ప్రతాప్ గుర్హ అలాగే కర్ణాటక రాష్ట్ర బెంగళూరు శివాజీ నగర్ ఎమ్మెల్యే రీవాజ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మైనార్టీలను సిఎం కెసిఆర్ మోసం చేస్తున్నారని వారు ఆరోపించారు. అందుకే ప్రజలు ఈసారి కాంగ్రెస్ పార్టీకే పట్టం కడతారని ధీమా వ్యక్తం చేసారు.

# ఎన్నికల పరిశీలకులను నియమించిన భారత ఎన్నికల కమిషన్..

**ఎన్నికల పరిశీలకులకు స్వాగతం పలికిన జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్,**

గరుడ వార్త మేడ్చల్ జిల్లా బ్యూరో: మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా అసెంబ్లీ ఎన్నికల కోసం కేంద్ర ఎన్నికల సాధారణ పరిశీలకులను భారత ఎన్నికల కమిషన్ నియమించిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ తెలిపారు. కుత్బుల్లాపూర్,(45 ) కూకట్ పల్లి,(46 ) నియోజకవర్గాల జనరల్ అబ్జర్వర్ అమన్ మిట్టల్ ,(ఐ.ఏ.ఎస్) , మేడ్చల్,(43 ) నియోజకవర్గాల జనరల్ అబ్జర్వర్, ఎస్.కె.జైన్, (ఐ.ఏ.ఎస్), నేహా యాదవ్( ఐ పి ఎస్,)మేడ్చల్,(43) మల్కాజిగిరి, (44), కుత్బుల్లాపూర్,(45) కూకట్ పల్లి(46) ఉప్పల్ ,(47)నియోజకవర్గాలకు.పోలీస్ జనరల్ అబ్జర్వర్, శుక్రవారం జిల్లా ఎన్నికల అధికారి (కలెక్టరేట్ )కార్యాలయంలో కలిసి పుష్పగుచ్చాలు అందించి స్వాగతం పలికినా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్. అనంతరము జిల్లాలో ఎన్నికల నిర్వహణ తీరుతెన్నుల గురించి కలెక్టర్ క్లుప్తంగా వివరించారు. జిల్లా ఎన్నికల యంత్రాంగం ఆధ్వర్యంలో ఎన్నికల నిర్వహణకై చేపడుతున్న కార్యకలాపాల గురించి తెలియజేశారు.



# ఇసుక తవ్వకాల్లో ఇష్టారాజ్యం

సిరిసిల్ల) : మానకొండూరు మండలంలోని శ్రీనివాస్‌నగర్, లింగాపూర్, వెల్ది, ఊటూర్ గ్రామాల పరిధిలోని మానేరు వాగులో ఇసుక తవ్వకాలు ఇష్టారాజ్యంగా సాగుతున్నాయి. సాండ్‌ట్యాక్స్ నిబంధనలు పాటించకపోవడంతో ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతోంది. ఆయా గ్రామాల పరిధిలో ఇసుక రీచ్‌లకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఇసుకరీచ్‌ల వద్ద విధులు నిర్వహిస్తున్న ఎస్సార్వోల నిర్వాహకంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. సాండ్‌టాక్స్ ద్వారా దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు మాత్రమే ఈ రీచ్‌ల ద్వారా ఇసుకను సరఫరా చేయాల్సి ఉంటుంది. ప్రతి రోజు ఒక ట్రాక్టర్‌కు సాండ్‌ట్యాక్స్ ద్వారా ఒకటి నుంచి రెండు ట్రిప్పులు మాత్రమే సమాచారం అందుతుంది. సదరు సమాచారాన్ని పరిశీలించిన తర్వాత ఎస్సార్వోలు ట్రాక్టర్లను ఇసుక రీచ్‌లోకి అనుమనుతులు ఇవ్వాలి. కానీ కొంతమంది ఇసుక యజమానులతో ఎస్సార్వోలు కుమ్మక్కై సాండ్



ట్యాక్స్ నుంచి ఎలాంటి సందేశం లేకుండానే ట్రాక్టర్లను ఇసుక రీచ్‌లలోకి అనుమతిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. ఇసుకరీచ్‌ల నుంచి ప్రతిరోజు ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఆన్‌లైన్‌లో బుకింగ్ పర్మిషన్ పొంది ఇసుక తరలించాల్సి ఉంది. కాగా అక్రమార్కులు రాత్రి నుంచి ఉదయం వేళల్లో సైతం ఎస్సార్వోల అండ దండలతో ఇసుక తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. పలుమార్లు పోలీసులు దాడి చేసి ట్రాక్టర్లను పట్టుకున్నా అక్రమార్కులు ఇసుక రవాణాను యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్ట వేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

# మహిళకు 'ఉపాధి'

సిరిసిల్ల) : ఉపాధిహామీ పనులు గ్రామీణ ప్రాంతాల్లోని వలసలకు అడ్డుకట్ట వేస్తోంది. ఉన్న ఊళ్లలోనే ఉపాధి పొందే వెసులుబాటు కల్పిస్తోంది. పెద్ద పెద్ద చదువులు చదువుకోని మహిళలకు, ఇతర ప్రాంతాల్లో పనిచేయలేని మహిళలలకు ఉపాధి హామీ ఆర్థికంగా ఊతం ఇస్తోంది. కుటుంబ పోషణలో ఆర్థికంగా మహిళలు చేదోడుగా నిలుస్తున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో చేపడుతున్న ఉపాధిహామీ పనుల్లో మహిళల హాజరు శాతమే ఎక్కువగా ఉంది. అన్ని పనుల్లోనూ భాగస్వాములు అవుతున్నారు. వ్యవసాయ పనుల కంటే ఉపాధి పనులకే ఎక్కువ మంది మహిళలు వెళ్లడం గమనార్హం. జిల్లాలో 1,0,60,00 జాబ్ కార్డులు ఉండగా 2.31 లక్షల ఉపాధి కూలీలు ఉన్నారు. 6,195 శ్రమశక్తి సంఘాలు ఉన్నాయి. సంఘాల పరిధిలో 1,20,303 మంది కూలీలు ఉన్నారు. 2022-23 సంవత్సరంలో 46.49 లక్షల పనిదినాలు కల్పించే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటివరకు ఉపాధి హామీ ద్వారా 32,975 కుటుంభాల్లో 45,758 కూలీలకు ఉపాధి కల్పించారు. జిల్లాలో 49,605 మంది మహిళలురాజన్న సిరిసిల్ల జిల్లాలో 12 మండలాలు, 255 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటి పరిధిలోని ఉపాధి హామీ కూలీల్లో ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు 76,825 మంది కూలీలకు ఉపాధి అందించారు. ఇందులో మహిళలు 49,605 మంది ఉపాధి పనులకు వెళ్తే పురుషులు 27,220 మంది ఉన్నారు. మహిళలు 8 లక్షల పనిదినాలు, పురుషులు 4 లక్షల పనిదినాలను పొందారు. మహిళలు రూ. 14.40 కోట్ల



కూలీని పొందారు. పురుషులు రూ.7.94 కోట్ల కూలి పొందారు. పాంఫాండ్, మ్యాజిక్ సోప్ కిట్, పల్లె ప్రకృతి వనాలు, కందకాలు, హరితహారం వంటి పనుల్లు పనిచేస్తున్నారు. కొత్త వి?ధానంతో నేరుగా వేతనాలు ఉపాధిహామీ పనుల్లో రాష్ట్ర ప్రభుత్వ పెత్తనానికి బ్రేక్ పడింది. పూర్తిగా కేంద్ర ప్రభుత్వమే అజమాయిషీ చేస్తోంది. ఇందుకోసం ఎన్ఐసీ సర్వర్‌ను అందుబాటులోకి తెచ్చింది. కూలీలకు సంబంధించిన వేతనాలు, పనుల వివరాలు నేరుగా కేంద్ర ప్రభుత్వం రూపొందించిన యాప్‌లోనే అప్‌లోడ్ చేస్తున్నారు. వేతనాలు కూడా కూలీల ఖాతాల్లోనే జమ చేస్తున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు కూలీలు సరాసిరి 187.46 రోజుకు కూలి పొందుతున్నారు. జిల్లాలో గత మే వరకు ఉపాధి హామీ ద్వారా కంపోస్ట్ షెడ్‌లు 255, వైకుంఠధామాలు 73, పల్లె పకృతి వనాలు 267 నిర్మించారు. వ్యవసాయ కల్లాలు 1681 మంజూరు కాగా 342 పూర్తి చేశారు. 1105 ప్రగతిలో ఉన్నాయి. 1269 పశువుల పాకల నిర్మాణాలకు 586 పూర్తి చేశారు. 297 ప్రగతిలో ఉన్నాయి. గొర్రెలు, మేకల పాకల నిర్మాణాలు 421 మంజూరు కాగా 21 పూర్తి చేశారు. 171 ప్రగతిలో ఉన్నాయి. మ్యాజిక్ సోప్‌కిట్‌లు 47,241 మంజూరు కాగా 26,974 పూర్తి చేశారు. 905 ప్రగతిలో ఉన్నాయి. ఫాంపాండ్ 2167 మంజూరు కాగా 1227 పూర్తి చేశారు. 423 ప్రగతిలో ఉన్నాయి. గ్రామ సంతలు 20 మంజూరు కాగా ఒకటి మాత్రమే పూర్తి చేశారు. ఐదు ప్రగతిలో ఉన్నాయి.

# పాల్వంచ జీసీసీ అక్రమాలపై ఐటీడీఏ దృష్టి

ఖమ్మం : భద్రాచలం జీసీసీని వివాదాలు వీడటం లేదు. అక్రమాల గుట్టు రట్టు చేసేందుకు డీఎం విజయ్‌కుమార్‌తో పాటు ఐటీడీఏ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో గిరిజన సహకార సంస్థ పాల్వంచ శాఖలో రూ.20 లక్షలకుపైగా లెక్కల్లో తేడాలను ప్రాథమికంగా గుర్తించారు. ఇది 2020-21లో చోటు చేసుకోవడంతో ఆ సమయంలో అక్కడ మేనేజర్‌గా ఉన్న వీరభద్రస్వామిని ఇటీవల సస్పెండ్ చేశారు. మళ్లీ ఇప్పుడు నోటీసులు జారీ చేసేందుకు కసరత్తు మొదలైంది. ఆ తరుణంలో విధులు నిర్వహించిన ఉద్యోగుల ప్రమేయం ఏ మేరకు ఉందో తెలుసుకోనున్నారు. త్వరలోనే పాత్రధారులు, సూత్రధారులు ఎవరన్నది నిగ్గు తేల్చనున్నారు. రూ.లక్షల్లో సరకులు గోల్‌మాల్ కావడం వెనుక మతలబు ఏంటన్నది ఒకొక్కటిగా బయటకు వస్తుండటంతో ఈ అంశం సంచలనంగా మారుతోంది. కొవిడ్ సమయంలో పాల్వంచ బ్రాంచి పరిధిలో నిత్యావసర సరకుల లెక్కలను పరిశీలిస్తే రూ.20 లక్షల విలువైన ఆహార, ఆహారేతర పదార్థాల ఆచూకీ లభ్యం కాలేదు. ఆ తరుణంలో దుకాణాలు తెరవకపోవడంతో ఇవి పాడయ్యాయన్నది ఒక వాదన. కాలం చెల్లిన మిరియాలు, మూడేళ్లపాటు నిల్వ ఉండే పీనాయిల్ వంటివి సైతం పాడయ్యాయని చెప్పడంతో సందేహాలు తలెత్తుతున్నాయి. పప్పు దెబ్బతిని ఉంటే దీన్ని ఏం చేశారన్న ఆధారం కోసం వీడియోగానీ, ఫొటోలు గానీ లేకపోవడం అనుమానం కలిగిస్తోంది. ప్రభుత్వ పరిధిలోని సంస్థకు చెందిన సరకులను పడేయాలంటే ఉన్నతాధికారుల అనుమతి ఉండాలి. సరకు



తగ్గుదలకు కొవిడ్‌ను కారణంగా చూపిస్తున్నప్పటికీ ఆ సరకు ఏమైందన్నది స్పష్టత లేకపోవడంతో విచారణ చేపట్టనున్నారు. ఈ సరకు నిల్వ ఉన్న తరుణంలో కొంత కాలం కొవిడ్ ఆంక్షలను సడలించినప్పటికీ ఎందుకు విక్రయించలేదన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

మిగతా బ్రాంచిలపైనా...ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్ ప్రత్యేక దృష్టితో జీసీసీ లెక్కలను తేల్చేందుకు ఇటీవల ఐదుగురు అధికారులతో కమిటీని ఏర్పాటు చేశారు. ఆ బృందం ఇచ్చిన నివేదికలను పరిశీలిస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో భద్రాచలం, పాల్వంచ, ఇల్లెందు, మణుగూరు, దమ్మపేటల్లో జీసీసీకి బ్రాంచులున్నాయి. ప్రస్తుతం పాల్వంచ వివాదంపై దృష్టి సారించినా మిగతా వాటిపైనా సమాలోచనలు చేస్తున్నట్లు సమాచారం. ప్రధానంగా ముష్టి గింజల కొనుగోళ్లతో పాటు కొన్ని పెట్రోలు బంకుల నిర్వహణలో అవకతవకల పైనా తీవ్ర విమర్శలు ఉన్నాయి. ఇలాంటి వాటిపై లోతుగా ఆరా తీస్తున్నట్లు సమాచారం. జీసీసీలోని అన్ని బ్రాంచిల్లో లెక్కలు సక్రమంగానే ఉన్నాయని, పాల్వంచ బ్రాంచి పరిధిలో కొంత తేడా రావడంతో తగు చర్యలు తీసుకుంటున్నట్లు జీసీసీ డీఎం విజయ్‌కుమార్ తెలిపారు.

# గణితం.. భవితకు మార్గనిర్గనిర్దేశం..

సంగారెడ్డి : గణితంలో పట్టు సాధిస్తే ఉజ్వల భవిత ఖాయం. ఎంతో మంది విద్యార్థుల్లో ఈ అంశం అంటే కాస్త వెనుకడుగు వేస్తుంటారు. పదో తరగతి వరకు ఎలాగోలా నెట్టుకొస్తూ ఇంటర్, డిగ్రీ స్థాయిలో ఆ సబ్జెక్టు లేకుండా కోర్సును ఎంచుకుంటారు. కొందరు మాత్రం ఇందుకు భిన్నం. గణితంలో పట్టు సాధించడమే లక్ష్యంగా ముందుకుసాగుతారు. ఇలాంటి వారికి సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాల మార్గనిర్దేశం చేసేందుకు ముందుకొచ్చింది. సదస్సులు, శిక్షణ కార్యక్రమాలతో ప్రతిభావంతులుగా తీర్చిదిద్దే కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం విశేషం.

మ్యాథమెటిక్స్ ట్రైనింగ్ అండ్ టాలెంట్ సెర్చ్ (ఎంటీటీఎస్) పేరిట కళాశాల విద్యాశాఖ గణితంలో విద్యార్థులను తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. దేశ వ్యాప్తంగా ఈ కార్యక్రమానికి 32 కళాశాలలను ఎంపిక చేయగా ఈ జాబితాలో సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చోటు దక్కడం విశేషం. గత విద్యా సంవత్సరం నుంచి ఈ కార్యక్రమం కొనసాగుతోంది. కళాశాలలో జాతీయస్థాయి శిక్షణ రెండు రోజుల పాటు నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ కళాశాలలకు చెందిన 10 మంది అధ్యాపకులతో పాటు 15 మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు.

మెలకువలు నేర్పిస్తూ..

గణితంలో రాణించాలంటే అందులో మెలకువలు నేర్చుకోవడం ఎంతో ముఖ్యం. ఈ క్రమంలో విద్యార్థులకు సులభ పద్ధతులు పరిచయం చేస్తూనే ప్రతిభ చాటేలా చేయడమే ఎంటీటీఎస్ లక్ష్యం. గణిత అధ్యాపకులకు సైతం తర్ఫీదు ఇస్తారు. ఇందుకు నిపుణులైన అధ్యాపకులతో శిక్షణ ఇప్పిస్తారు. తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 5, 6 తేదీల్లో నిర్వహించిన జాతీయ స్థాయి శిక్షణ కార్యక్రమంలో ఉత్తరప్రదేశ్ రాష్ట్రం నోయిడాలోని శివనాడార్ విశ్వవిద్యాలయానికి చెందిన సత్యనారాయణరెడ్డి, త్రిపుర విశ్వవిద్యాలయానికి చెందిన భట్టాచార్య ప్రధాన వక్తలుగా వ్యవహరించి వివిధ అంశాల్లో దిశానిర్దేశం చేశారు. శిక్షణ పూర్తిచేసుకున్న విద్యార్థులకు ధ్రువపత్రాలు సైతం అందిస్తున్నారు.

శిక్షణ.. రాణించేలా కార్యాచరణ

విద్యార్థులను మెరుగ్గా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. ఇందులో భాగంగా తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన వారు ఇతర రాష్ట్రాల్లోని విశ్వవిద్యాలయాల్లో నిర్వహించే వారం, 15 రోజుల వ్యవధి శిక్షణ కార్యక్రమాల్లో పాల్గొనాల్సి ఉంటుంది. విద్యార్థులు అక్కడికి వెళ్లేందుకు రానుపోను ఖర్చులు ఉన్నత విద్యాశాఖ భరిస్తుంది. గణితంలోని ప్రధాన అంశాల్లో నైపుణ్యాల పెంపే లక్ష్యంగా ఈ కార్యక్రమానికి తెర తీశారు. సమస్యల సాధనకు ఫార్ములాల వినియోగం, వాటిని ఎలా ఉపయోగించాలి, సులభంగా లెక్కలు చేయడంపై అవగాహన కల్పిస్తున్నారు. గణితంలో పట్టు సాధిస్తే ఎలాంటి అవకాశాలు ఉంటాయో కూడా వివరిస్తున్నారు. ప్రైవేటు రంగంలోనూ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని సబ్జెక్టులో రాణించేలా ప్రణాళికతో ముందుకుసాగుతున్నారు.

కళాశాల ఏర్పాటు: 15.07.1977 తరగతి గదులు: 38 ప్రయోగశాలలు: 20 అధ్యాపకులు: 20కోర్సులు: 41పీజీ: 10డిగ్రీ విద్యార్థులు: 38 పీజీ విద్యార్థులు: 580 గణితం విద్యార్థులు: 540

# జోరుగా వరి కోతలు



వనపర్తి : వానాకాలంలో సాగు చేసిన వరి పంట కోతలు ప్రారంభమయ్యాయి. రెండు, మూడు రోజులుగా ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా వర్షాలు కురుస్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే పంట కోత చేసిన రైతులు గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకు వస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో పది కేంద్రాలు మాత్రమే ప్రారంభించారు. వీటిని ఎక్కువ సంఖ్యలో ప్రారంభించాలని కోరుతున్నారు. ఎప్పటి మాదిరిగా ఈ సంవత్సరం కూడా వానాకాలం వరి ధాన్యం కొనుగోలు చేసేందుకు ఇందిరా క్రాంతి పథం, మార్కెట్ కమిటీ, సహకార సంఘాల ద్వారా కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు.

1.85 లక్షల ఎకరాల్లో వరి సాగు

జిల్లాలో 1.85 లక్షల ఎకరాల్లో వరి సాగైంది. 5.16లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయాధికారులు తెలిపారు. అందులో నుంచి 4.70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉందని వచ్చిన మొత్తాన్ని కొనుగోలు చేయాలని జిల్లా పౌరసరఫరాల సంస్థ నిర్ణయించింది. కొనుగోలుకు జిల్లా పౌరసరఫరాల సంస్థ, మార్కెటింగ్, సహకార సంఘాలు, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారులకు బాధ్యతలను అప్పగించారు. ధాన్యం కొనుగోలుకు సంచుల కొరత రాకుండా కావాల్సినన్ని సిద్ధం చేసుకున్నారు. లారీల కొరత లేకుండా చర్యలు తీసుకున్నారు. గత ఏడాది కొనుగోలు కేంద్రాల్లో హమాలీ ఛార్జీలను ఒక్కో కేంద్రంలో ఒక్కో రకంగా వసూలు చేశారని రైతులు ఆరోపించారు. వీటిని అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించి న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

గ్రేడింగ్‌పై అవగాహన

కొనుగోలు కేంద్రాలకు వరి ధాన్యం తీసుకొచ్చే రైతులకు గ్రేడింగ్‌పై అవగాహన కల్పిస్తున్నారు. తాలు ఎక్కువగా ఉండకుండా తూర్పారబట్టడం, యంత్రాల ద్వారా కోతలు చేసే సమయంలో ఫ్యాన్ విధిగా వాడాలని, ఎండలో ధాన్యం ఆరబెట్టడం, తేమ 17 శాతానికి మించకుండా తీసుకురావాలని అవగాహన కల్పించారు. ఏ-గ్రేడు రకానికి క్వింటాలుకు రూ.2,203, సాధారణ రకం ధాన్యానికి రూ.2,183 చొప్పున చెల్లించనున్నారు.

వేగంగా ప్రారంభిస్తాం- కొండలరావు, జిల్లా పౌరసరఫరాల అధికారి, వనపర్తి వానాకాలం వరి కోతలు ఇంకా పూర్తి స్థాయిలో ప్రారంభం కాలేదు. ఇటీవల రెండు రోజులుగా వాతావరణంలో మార్పు రావడంతో కోతలు పుంజుకోలేదు. లక్ష్యం మేరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తాం. కేంద్రాల వద్ద రైతులకు కావాల్సిన సౌకర్యాలు కల్పిస్తున్నాం. ఎలాంటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకుంటాం

# సారూ.. ఎలా చదవాలి?



వనపర్తి : జిల్లాలోని సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో చదువుకుంటున్న పదోతరగతి విద్యార్థులకు ఇంతవరకు స్టడీ మెటీరియల్ సరఫరా కాలేదు. వీటిని ఇవ్వకుండానే వసతి గృహాల్లో వందశాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేస్తుండటంపై విస్మయం వ్యక్తమవుతోంది. అంతే కాకుండా ఇప్పటి వరకు ట్రంకు పెట్టెలు, స్వెట్టర్లు, రగ్గులు, బూట్లు, క్రీడా సామగ్రిని అందజేయలేదు. అరకొర వసతులపై విద్యార్థులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.జిల్లాలో 13 సాంఘిక సంక్షేమ వసతి గృహాలు ఉన్నాయి. వీటిలో 15 వందలమంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇందులో మూడొందలమంది పదోతరగతి విద్యార్థులు. వీరికి ఏటా స్టడీ మెటీరియల్ సరఫరా చేస్తారు. ఈ ఏడాది ఇంతవరకు వీటిని అందజేయలేదు. ముందే ఇస్తే పరీక్షలకు సన్నద్ధమయ్యేందుకు ఉపకరిస్తుంది. అలా కాకుండా ఎప్పుడో గుర్తొచ్చినప్పుడు ఇస్తామంటే పెద్దగా ప్రయోజనం ఉండదు. పైగా విద్యార్థులు ఒత్తిడికి గురవుతారు. పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో ఈ నెల ఒకటో తేదీ నుంచి ఉదయం పూట గంటపాటు పదోతరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతుల నిర్వహణ చేపట్టారు. అవి కూడా రికార్డుల్లో బాగా జరుగుతున్నా క్షేత్రస్థాయిలో ఆశాజనకంగా లేవు. వచ్చే జనవరి నెల నుంచి సాయంత్రం పూట సైతం ఒక గంట పాటు ప్రత్యేక తరగతుల నిర్వహణకు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తున్నారు. సాంఘిక సంక్షేమ శాఖ మాత్రం ఆ దిశగా చర్యలు చేపట్టలేకపోతుండటం విమర్శలకు దారితీస్తోంది.

అయిదేళ్లుగా అందని ట్రంకు పెట్టెలు గతంలో వసతిగృహాల్లో ప్రవేశం పొందే విద్యార్థులకు ఏటా వస్తువులు, పుస్తకాలు దాచుకునేందుకు ట్రంకు పెట్టెలు ఇచ్చేవారు. అయిదేళ్లుగా వీటిని ఇవ్వడంలేదు. కొత్తగా ప్రవేశం పొందుతున్న విద్యార్థులు తమ వస్తువుల భద్రత కోసం ఇంటి నుంచే పెట్టెల్ని తీసుకురావాల్సి వస్తోంది. అయిదేళ్ల క్రితం ఇచ్చినవి కూడా మరమ్మతులకు గురయ్యాయి. శీతాకాలం రాకముందే ప్రతి ఏటా విద్యార్థులకు స్వెట్టర్లు, రగ్గులు ఇచ్చేవారు. ఈ సారి ఇంతవరకు రాలేదు. చలితో విద్యార్థులు ఇక్కట్లు పడుతున్నారు. ఒకే దుప్పట్లో నలుగురైదుగురు పడుకుంటున్నారు. ఈ పరిస్థితి చర్మవ్యాధలకు దారితీసే అవకాశం లేకపోలేదు. పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేకంగా నీళ్ల సీసాలు, చేతి రుమాళ్లు ఇచ్చేవారు. ఇప్పుడు అవీ లేవు. ఆటలాడుకోడానికి ఏటా క్రీడా సామగ్రి అందించేవారు. వాటిని ఇంతవరకు ఇవ్వకపోవడం శోచనీయమని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీటికి సంబంధించిన బడ్జెట్ విడుదలవుతున్నా ఎందుకు వెచ్చించడంలేదో అన్న అభిప్రాయాన్ని పలువురు వ్యక్తం చేస్తున్నారు. మిగతా జిల్లాలతో పోలిస్తే ఇక్కడ అరకొర వసతులు కనిపిస్తున్నాయి. ఇకనైనా అధికారులు విద్యార్థులకు అవసరమైన సామగ్రిని తక్షణమే అందజేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


ఎన్నికలు పూర్తవ్వగానే అందజేస్తాం- కన్యాకుమారి, జిల్లా సాంఘిక సంక్షేమాధికారిణి, నారాయణపేట

క్రీడా సామగ్రి, నీళ్ల సీసాఉ, షూస్ తదితర సామగ్రి కొనుగోలుకు టెండర్ నిర్వహించాలనుకుంటున్న తరుణంలో ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యింది.. ఎన్నికలు పూర్తి కాగానే టెండర్ ద్వారా కొనుగోలు చేసి అందజేస్తాం. స్టడీ మెటీరియల్‌లో భాగంగా ఆల్‌ఇన్‌వన్ పుస్తకాలు సిద్ధంగా ఉన్నాయి. వెంటనే పంపిణీ చేస్తాం. అయిదేళ్లకోసారి ట్రంకు పెట్టెలు కొనాలి. కానీ సమయం పూర్తికాలేదు. అందువల్ల ఇవ్వలేదు. పదోతరగతి పూర్తి చేసిన విద్యార్థుల నుంచి పెట్టెలు తీసుకొని కొత్తవారికి సర్దుబాటు చేస్తున్నాం.

# ఏడాది గడుస్తున్నా పనుల్లో కదలికేదీ?

వనపర్తి : నిత్యం రద్దీగా ఉండే జోగులాంబ (శ్రీబాలబ్రహ్మ రోడ్డు) రైల్వేహాల్ట్‌లో ఆలయాలకు వచ్చే భక్తులు, ప్రయాణికులకు అవస్థలు తప్పడంలేదు. ఈ మార్గం గుండా రోజు అధిక సంఖ్యలో రైళ్లు వెళ్తుంటాయి. ప్లాట్‌ఫాం లేకపోవడంతో ప్రయాణికులు, చిన్నారులు, వృద్ధులు, మహిళలు రైలు ఎక్కేందుకు దిగేందుకు ఇక్కట్లు పడుతున్నారు. ఈ రైల్వేహాల్ట్ ద్వారా రోజుకు రూ.10 వేల వరకు ఆదాయం వస్తోంది. కానీ ఆ మేరకు వసతులు కల్పించడంలేదు. ఏడాది కిందట ప్లాట్‌ఫాం నిర్మాణానికి గుత్తేదారు పనులు ప్రారంభించారు. నేటికీ వేగం అందుకోలేదు. ప్లాట్‌ఫాం సంబంధించిన సిమెంటు బండలను తయారు చేస్తున్నారు. వీటిని ప్రయాణికులు కూర్చొనే బెంచీల సమీపంలో పెట్టడంతో వచ్చినవారు ఇబ్బందులు పడుతున్నారు. వివిధ ప్రాంతాల నుంచి అలంపూర్ ఆలయాల దర్శనానికి నిత్యం భక్తులు వస్తుంటారు. రైల్వేహాల్ట్‌లో కనీసం మంచి నీరు ఏర్పాటు చేయలేదు. ఇక మూత్రశాలలు, మరుగుదొడ్లు పరిస్థితి అంతంతగానే ఉంది.

భారీగా నిధులు: జోగులాంబ రైల్వేహాల్ట్‌లో స్టేషన్ భవనం, అదనపు లైన్, ప్లాట్‌ఫాం, విశ్రాంతి గది, మరుగుదొడ్ల నిర్మాణానికి ఏడాది కిందటే రూ.4 కోట్ల మేరకు నిధులు మంజూరయ్యాయి. కానీ ఇక్కడ పనులు మాత్రం జరగడంలేదు. ఉదయం వేళల్లో అధిక సంఖ్యలో ప్రయాణికులు వస్తుంటారు. ఆ సమయంలో టికెట్ కౌంటర్ రద్దీగా ఉంటోంది. దీంతో కొంత మంది



ప్రయాణికులు టికెట్ తీసుకోకుండానే రైలెక్కాల్సి వస్తోంది. భవనాలు నిర్మించి అదనపు కౌంటర్లు ఏర్పాటు చేస్తే ఈ సమస్య ఉండదు. రైల్వే అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే పనులు ఆలస్యం అవుతున్నాయని, ప్రయాణికులు, భక్తులు వాపోతున్నారు. కర్నూల్‌కు సమీపంలోనే ఈ రైల్వేహాల్ట్ ఉంది. అయినా అధికారులు దీని గురించి పట్టించుకోవడం లేదని వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు అంటున్నారు. పలు గ్రామాల ప్రజలు, భక్తులకు ఎంతో ఉపయుక్తమైన ఈ రైల్వే హాల్ట్ పనులపై అధికారులు దృష్టిపెట్టి వేగవంతం చేయాలని కోరుతున్నారు.

# ఆన్‌లైన్‌లో ఏమరపాట్లు

ఖమ్మం : నేరం జరిగిన వెంటనే సైబర్ క్రైం అధికారులకు, బ్యాంకు అధికారులకు సమాచారం అందిస్తే నగదును హోల్డ్‌లో పెడుతున్నారు. తద్వారా మోసపోయిన వారికి నష్టం తగ్గుతోంది. తాజాగా కూసుమంచి మండలం నాయకన్‌గూడేనికి చెందిన ఓ ప్రైవేటు ఉద్యోగికి టెలిగ్రామ్ ద్వారా సంక్షిప్త సందేశం వచ్చింది. అందులోని టాస్క్‌లను పూర్తి చేస్తే పెద్దమొత్తంలో నగదు పొందవచ్చని ఉండటంతో ఆ దిశగా లింక్‌లోని అంశాలను పూర్తి చేసి రూ.1.09లక్షలను డిపాజిట్ చేశాడు. అయినా తనకు నగదు రాకపోవడంతో పోలీసులను ఆశ్రయించాడు.సత్తుపల్లి మండలం నారాయణపురానికి చెందిన చైతన్యకు రుణం అందిస్తామంటూ వాట్సాప్ ద్వారా లింక్ వచ్చింది. తొలుత రూ.4వేలు చెల్లిస్తే చాలు అని అవతలి వ్యక్తి సందేశం పంపాడు. దీంతో చైతన్య లింక్ ఓపెన్ చేసి రూ.4వేలు ట్రాన్స్‌ఫర్ చేశాడు. అప్పటి నుంచి అవతలి వ్యక్తి నుంచి స్పందన లేదు. దీంతో తాను మోసపోయినట్లు గ్రహించి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.పెనుబల్లి మండలం లింగగూడెం మండలం గట్టుగూడేనికి చెందిన అశోక్ రుణం కోసం ఓ యాప్‌ను క్లిక్ చేశాడు. సైబర్ నేరగాడు రుణం కోసం పలు దఫాలుగా అశోక్ నుంచి మొత్తం రూ.1.10లక్షలు కాజేశాడు. దీంతో బాధితుడు సైబర్ క్రైం కార్యాలయానికి ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేశారు. సైబర్ నేరగాళ్లు కొత్త వ్యూహాలతో బెంబేలెత్తిస్తున్నారు. అంతర్జాలం ద్వారా వివిధ యాప్‌లు, వెబ్‌సైట్‌లను ఉపయోగించే వారినే లక్ష్యం చేసుకుని బురిడీ కొట్టిస్తున్నారు. కంటికి కనిపించకుండా సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్‌లు, ఇంటర్‌నెట్ సహకారంతో కేటుగాళ్లు లక్షల రూపాయల




ను కొల్లగొడుతున్నారు. ఓ వైపు సాంకేతికత పెద్దఎత్తున పెరిగిపోతుండగా మరోవైపు అంతకు మించిన ఆలోచనలతో సైబర్ నేరాలు నిత్యకృత్యమవుతున్నాయి. ఓ దశలో తమ ఫోన్‌లకు వచ్చిన సంక్షిప్త సందేశాలను ఓపెన్ చేయాలంటేనే నెటిజన్లు వణికిపోతున్నారు. సైబర్ నేరాలపై పోలీస్ యంత్రాంగం పెద్దఎత్తున వివిధ మార్గాల ద్వారా అవగాహన కల్పిస్తున్నా కొందరు అత్యాశతో నిలువునా మోసపోతున్నారు. అమాయకులనే ఆసరాగా చేసుకుని సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. రుణం ఇస్తామని, లక్కీడ్రాలో రూ.లక్షలు గెలుచుకున్నారని, లాటరీలో రూ.కోట్లు సొంతం చేసుకుంటున్నారని, సెకండ్ హ్యాండ్ కార్లు, వాహనాలు, ఇతర వస్తువులను యాప్‌ల్లో పెట్టి ప్రజలకు వలవిసిరి ఇట్టే మోసం చేస్తున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఏ స్టేషన్‌లో చూసినా సైబర్ కేసులు నమోదవుతూనే ఉన్నాయి. సైబర్ క్రైమ్‌లను నివారించకుంటే మరిన్ని మోసాలు జరిగే ప్రమాదం ఉంది. సైబర్ మోసాల పట్ల యువత, విద్యావంతులు, ఉద్యోగులు, గ్రామీణ ప్రాంత ప్రజలను పోలీసులు అప్రమత్తం చేస్తూ వారిని చైతన్యపరచాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అపరిచిత వ్యక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. లేకపోతే ఇలా మోసాల పరంపర సాగుతూనే ఉంటుంది. గుర్తు తెలియని లింకులను క్లిక్ చేయవద్దు. బ్యాంకుల పేరుతో ఫోన్‌లు వస్తే ఎటువంటి సమాచారం ఇవ్వొద్దు. అనుమానమొస్తే బ్యాంకులను సంప్రదించాలి. విష్ణు ఎస్.వారియర్, పోలీసు కమిషనర్, ఖమ్మం

# సర్కారు బడుల్లో అర్ధాకలికి చెక్

పెద్దపల్లి : ప్రభుత్వ పాఠశాలల్లో అధికంగా నిరుపేద విద్యార్థులు చదువుతున్నారు. పేదరికంతో చాలా మంది పరిగడుపున పాఠశాలలకు వెళుతున్నారు. ఈ క్రమంలో విద్యార్థుల పరిగడుపు ఆకలి తీర్చేందుకు ప్రభుత్వం 'సీఎం అల్పాహారం' పథకం అమలు చేయాలని నిర్ణయించింది. ఒక్కో రోజు ఒక్కో రకమైన ఆహారం వడ్డించనున్నారు. ఇప్పటికే సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం, రాగి జావ అందిస్తుండగా తాజాగా అల్పాహారంతో విద్యార్థులకు ఆకలి వెతలు తీరనున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా ప్రయోగాత్మకంగా నియోజకవర్గానికి ఒక పాఠశాలలో ప్రారంభించేందుకు విద్యాశాఖ సిద్ధం చేసింది. దసరా సెలవుల తర్వాత అన్ని పాఠశాలల్లో అమలు చేస్తారు.

ఖాళీ కడుపుతో పాఠశాలకు...

ప్రభుత్వ పాఠశాలల్లో పేద కుటుంబాలకు చెందిన పిల్లలు చదువుతుండటంతో తరగతులకు దుమ్మా కొడుతున్నారు. స్థానికంగా పాఠశాలలు అందుబాటులో లేక దూర ప్రాంతాల విద్యార్థులు ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాల్లో పాఠశాలలకు చేరుకుంటున్నారు. ఉదయం పూట ఖాళీ కడుపుతోనే వెళ్లడంతో నీరసంగా ఉంటూ అస్వస్థతకు గురవుతున్నారు. జిల్లాలో 359 ప్రాథమిక పాఠశాలల్లో 12,542 విద్యార్థులు, 83 ప్రాథమికోన్నత పాఠశాలల్లో 5,464, 101 ఉన్నత పాఠశాలల్లో 12,195 మంది చదువుతున్నారు.

బలవర్ధకమైన ఆహారం...సర్కారు బడుల్లో కొన్నేళ్లుగా సన్న బియ్యంతో మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్నారు. ఈ ఏడాది నుంచి రాగి జావ కూడా అందిస్తుండటంతో ఆకలి సమస్య తీరినట్లయింది. తాజాగా రుచి, బలవర్ధకమైన అల్పా హారం అందిస్తుండంతో విద్యార్థులకు బహుళ ప్రయోజనం కలగనుంది. పేద విద్యార్థులకు వరం మా పాఠశాలలో చాలా మంది పేద విద్యార్థులమే. ఉదయం పూట ఖాళీ కడుపుతోనే వస్తున్నా. మధ్యాహ్న భోజనంతో కొంత ఆకలి తీరుతుంది. ప్రభుత్వం రుచికరమైన అల్పాహారం అందిస్తుండటంతో పేద విద్యార్థులకు నిజంగా ఒక వరమే. హర్షిత, 5వ తరగతి, రామగుండం ప్రాథమిక పాఠశాలపాఠాలపై ఏకాగ్రతఉదయం వేళలో పిల్లలకు ప్రభుత్వం అందించే అల్పాహారంతో ప్రయోజనం కలగనుంది. బలవర్ధకమైన ఆహారం తీసుకోవడంతో పాఠాలపై ఏకాగ్రత పెరుగుతుంది. సుప్రజ, 5వ తరగతి, అమర్‌నగర్ ప్రాథమిక పాఠశాల పెద్దపల్లిఇదీ మెనూ..సోమవారం : ఇడ్లీ, సాంబారు / గోధుమ రవ్వ ఉప్మా, చట్నీ మంగళవారం : పూరీ, ఆలు కుర్మా/ టోమాటో బాత్, సాంబారుబుధవారం : ఉప్మా, సాంబారు / బియ్యం రవ్వ కిచిడి చట్నీ గురువారం : చిరుధాన్యాల ఇడ్లీ సాంబారు / పొంగల్ సాంబారు శుక్రవారం : అటుకులు, చిరుధాన్యాల ఇడ్లీ చట్నీ / బియ్యం రవ్వ కిచిడి చట్నీశనివారం : పొంగల్, సాంబారు/ కూరగాయల పలావ్, పెరుగు చట్నీ, ఆలుకుర్మా

గరుడ వార్త



# భూముల రిజిస్ట్రేషన్లు తగ్గుముఖం

పాలమూరు : జడ్చర్ల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో నిత్యం 100లకు పైగా దస్తావేజులు నమోదవుతాయి. ప్రభుత్వానికి భారీగా ఆదాయం వస్తుంది. ఎన్నికల ప్రకటన వచ్చాక దస్తావేజుల రిజిస్ట్రేషన్ సగానికి తగ్గింది. ఈ ఏడాది ఆగస్టులో 1,629 దస్తావేజులు నమోదు కాగా, గత నెలలో 1,146 దస్తావేజులు నమోదు అయ్యాయి.

మహబూబ్‌నగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రోజూ 60కి పైగా రిజిస్ట్రేషన్లు జరిగేవి. నెలన్నర రోజుల నుంచి 30 నుంచి 40 వరకే దస్తావేజులు నమోదవుతున్నాయి. గత ఆగస్టు నెలలో 1,469, గత నెలలో 1,339 దస్తావేజులు నమోదయ్యాయి. రిజిస్ట్రేషన్ల ఆదాయం పడిపోయింది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఎన్నికల వేళ భూముల లావాదేవీలు తగ్గుముఖం పడుతున్నాయి. నిత్యం క్రయ విక్రయదారులతో కళకళలాడే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు వెలవెలబోతున్నాయి. ప్రభుత్వ ఖజానాకు వచ్చే ఆదాయం పడిపోతోంది. ఎన్నికల నేపథ్యంలో విధించిన ఆంక్షలతో భూములు, ఇళ్లు, ఇంటి స్థలాలు అమ్మడానికి, కొనుగోలు చేయడానికి జనం అంతగా ఆసక్తి చూపడం లేదు. గరిష్ఠంగా రూ.50వేల వరకే ప్రజలు తమ వెంట తీసుకెళ్లేలా ఎన్నికల సంఘం ఆదేశించడంతో పాటు నిరంతరం పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేస్తున్నారు. ఎవరి వద్ద రూ.50వేలకు మించి డబ్బులు దొరికినా తగిన ఆధారాలు లేకపోతే జప్తు చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో



ఎవరూ భూములు అమ్మటం కానీ, కొనటం కానీ చేయటం లేదు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో ఇదే పరిస్థితి నెలకొంది.

రూ.9 కోట్ల మేర తగ్గిన ఆదాయం : రెండు నెలల నుంచి ఉమ్మడి జిల్లాలో రిజిస్ట్రేషన్ల ఆదాయం రూ.9 కోట్ల మేర తగ్గింది. ప్రతినెలా ప్రభుత్వ ఖజానాకు రూ.22 కోట్ల నుంచి రూ.25కోట్ల వరకు ఆదాయం వచ్చేది. గత రెండు నెలల నుంచి రూ.17 కోట్ల మేర ఆదాయం వస్తోంది. అందులో బ్యాంక్ మార్టిగేజ్‌కు చెందిన దస్తావేజులే ఎక్కువ ఉంటున్నాయి. రియల్ వ్యాపారం కూడా అన్ని ప్రాంతాల్లో అంతంతగానే నడుస్తోంది. భూముల ధరలు బాగా పెరగటం వల్ల సామాన్యులు కొనుగోలు చేయటం లేదు.

ఎన్నికల తర్వాత పెరుగుతాయి– వి.రవీందర్, ఉమ్మడి జిల్లా స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ రిజిస్ట్రార్ ఇప్పుడు ఇళ్ల స్థలాలు, ఇళ్లు, అపార్ట్‌మెంట్ల క్రయ విక్రయాలు అంతగా జరగడం లేదు. ఎన్నికల తర్వాత రిజిస్ట్రేషన్లు పుంజుకుంటాయి. వచ్చే నెల నుంచి తిరిగి కార్యాలయాలు వినియోగదారులతో రద్దీగా ఉండే అవకాశాలు ఉన్నాయి.

# నాడి పట్టేవారేరి?

హైదరాబాద్: ఒకవైపు ఎన్నికల వేడిలో ప్రధాన పార్టీలన్నీ తలమునకలై ఉండగా.. ఇదే అదనుగా వైద్య సిబ్బంది విధులకు డుమ్మా కొడుతున్నారు. అత్యవసర సేవలను సైతం పట్టించుకోవడం లేదు. చలితో వైరల్ జ్వరాలు విజృంభిస్తున్నాయి. స్థానికంగా చికిత్స అందించడంలో ప్రాథమిక, పట్టణ ఆరోగ్య, బస్తీ దవాఖానాల్లో సిబ్బంది విఫలమవుతున్నారు. గ్రేటర్ వ్యాప్తంగా 250 వరకు బస్తీ దవాఖానాలున్నాయి. ఇందులో 50కి పైనా పరీక్షలు ఉచితంగా అందిస్తున్నారు. ఎన్నికల హడావుడిలో అంతా తారుమారు అయింది. వాస్తవానికి వైద్య సిబ్బందికి ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఉంటుంది. కొన్ని రోజులుగా ముఖ్యంగా బస్తీ దవాఖానాల్లో వైద్యులతోపాటు సిబ్బంది విధులకు డుమ్మా కొడుతున్నారు. మధ్యాహ్నం వరకు వైద్యులు, సిబ్బంది కోసం నిరీక్షించాల్సి వస్తోందని వాపోతున్నారు. కొన్ని కేంద్రాలు 10 గంటలు



దాటినా తెరుచుకోవడం లేదని చెబుతున్నారు. ప్రతి బస్తీ దవాఖానాలో వైద్యులు, సిబ్బంది 9 గంటల కల్లా అందుబాటులో ఉండాలి. 11 దాటినా కన్పించడం లేదు. 80 శాతం కేంద్రాల్లో ఇదే పరిస్థితి. కొన్ని బస్తీ దవాఖానాల్లో ముందు సమాచారం లేకుండానే సిబ్బంది, వైద్యులు విధులకు డుమ్మా కొడుతున్నారు. వేరే దారి లేక బస్తీల్లో ఉన్న వారు మళ్లీ ఉస్మానియా, గాంధీ ఆసుపత్రులకు వెళ్తున్నారు.

# మరో ఢిల్లీలా మడికొండ..

హైదరాబాద్: ఢిల్లీలో కాలుష్యం పెరిగి ప్రజలు ఊపిరి పీల్చుకోవడానికి ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వాయు కాలుష్యం తగ్గించడంలో భాగంగా వాహనాల నియంత్రణకు సరి, బేసి విధానాన్ని అక్కడి ప్రభుత్వం అమలుచేస్తోంది. అలాంటి కాలుష్య బెడదనే మడికొండ ప్రజలు ఎదుర్కొంటున్నారు. ఇక్కడి డంపింగ్ యార్డు నుంచి వెలువడుతున్న పొగ ఊపిరాడనివ్వడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆస్తమా, హృదయ సంబంధిత వ్యాధిగ్రస్తులు, వృద్ధులు తల్లడిల్లుతున్నారు. ఇప్పటికే అనేకమంది శ్వాసకోశ, చర్మ, గొంతు, దగ్గుతోపాటు వివిధ రకాల వ్యాధులతో సతమతమవుతున్నారు. వరంగల్ మహానగరంలోని చెత్తనంతా 12 సంవత్సరాలుగా మడికొండ డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. లక్షల టన్నుల చెత్త గుట్టలుగా పేరుకుపోయింది. చెత్తను ఎరువుగా మార్చడంలో నగరపాలక సంస్థ వైఫల్యం కారణంగా చెత్త కుప్పల్లో గ్యాస్ చోటు చేసుకుని మంటలు చెలరేగుతున్నాయి. చలికాలంలో మంచు కురుస్తుండటంతో పొగ పైకెళ్లక విస్తరిస్తోంది. గత కాలనీలను పొగ చుట్టుముట్టడంతో ప్రజలు ఊపిరాడక ఇబ్బందులు పడ్డారు. కనీసం ఫైర్ సేఫ్టీ చర్యలతో పొగను తాత్కాలికంగా రాకుండా చేయాల్సిన అవసరం ఉంది.

# ఒక్క ఫోన్ చాలు!




వికారాబాద్ : శాసనసభ ఎన్నికలను పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించడమే లక్ష్యంగా అధికార యంత్రాంగం అవసరమైన చర్యలు చేపట్టింది. ఎన్నికల నియమావళిని కచ్చితంగా పాటించేలా నిఘా ఏర్పాటు చేసింది. ఇందుకోసం ప్రత్యేక ఫిర్యాదు కేంద్రాలను ఏర్పాటుచేసింది. ఎన్నికల్లో నిబంధనల ఉల్లంఘనలపై ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలుసుకుందాం.

మద్యం పంపిణీ చేస్తే..ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి ధనబలం ఉన్న అభ్యర్థులు విచ్చలవిడిగా మద్యం పంపిణీ చేసే అవకాశం ఉంటుంది. అనుమతి లేకుండా, పరిమితికి మించి మద్యం నిల్వ చేసినా, విక్రయించినా ఓటర్లకు పంపిణీ చేసినా శిక్షార్హులవుతారు. ఇందులో పట్టుబడితే ఎక్సైజ్ చట్టం–1968 సెక్షన్ 34(ఏ) ప్రకారం ఆరుమాసాల నుంచి ఏడాది జైలు, రూ.5 వేల నుంచి రూ.20 వేల వరకు జరిమానా చెల్లించాల్సి ఉంటుంది.

మద్యం పంపిణీపై జిల్లా ఆబ్కారీ అధికారి ఫోన్ నం.8712658729కు ఫిర్యాదు చేయవచ్చు.

సి– విజిల్ యాప్

ప్రచార సమయం, కోడ్ ఉల్లంఘన, నియమావళి అమలుపై సి-విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. చేసిన 100 నిమిషాల్లోపు పరిష్కరించే బాధ్యతను ఫ్లయింగ్ స్క్వాడ్ తీసుకుంటాయి. కేంద్ర ఎన్నికల సంఘం నేషనల్ గ్రీవెన్స్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌కు అందిన ఫిర్యాదులను సైతం పరిష్కరిస్తారు.

కానుకలు ఇస్తున్నారా..

ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలనే తపనతో అభ్యర్థులు తమ నాయకులు, కార్యకర్తలు, అనుచరులతో ఓటర్లకు కానుకలు పంపిస్తుంటారు. మహిళలకు చీరలు, కుక్కర్లు, యువతకు క్రికెట్ కిట్లు, చరవాణులు పంపిణీ చేస్తారు. ఇలా ఏది ఇచ్చినా ఐపీసీ సెక్షన్ 171(ఈ) ప్రకారం ఏడాది జైలుశిక్షతో పాటు జరిమాన విధిస్తారు. కానుకలపై ఆయా మండలాల సహాయ ఎన్నికల అధికారులుగా విధులు నిర్వహిస్తున్న ఎంపీడీఓ, తహశీల్దార్లకు లేదా ఎన్నికల కంట్రోల్ రూమ్ స్థిరవాణి సంఖ్య 08416–357507కు ఫిర్యాదు చేయవచ్చు.

ఓటర్ల పేర్లు, పోలింగ్ కేంద్రాల నిమిత్తం

సందేహాల నివృత్తి కోసం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 1950 టోల్‌ఫ్రీ సంఖ్యకు ఫోన్ చేయాలి. ఓటర్ల జాబితాలో పేర్లు, పోలింగ్ కేంద్రాల వివరాలతో పాటు ఎన్నికలకు సంబంధించి అన్ని అంశాలపై ఫిర్యాదు చేయవచ్చు.

బెదిరిస్తే ఊరుకోవాల్సిన పనిలేదు

అభ్యర్థులు కొన్నిసార్లు సహనం కోల్పోయి ఓటర్లను బెదిరింపులకు గురి చేసే అవకాశం ఉంది. ఇలా ఎవరైనా బెదిరిస్తే ఐపీసీ సెక్షన్ 171(సి) ప్రకారం ఏడాది జైలుశిక్ష, జరిమానా విధిస్తారు. ఎవరైనా బెదిరింపులకు గురి చేస్తే ఆయా పోలీస్‌ఠాణాల రక్షకభట నిలయాధికారులకు, ఎన్నికల కంట్రోల్ రూమ్ స్థిరవాణి సంఖ్య 08416–357507కు ఫిర్యాదు చేయవచ్చు.

# ఎన్నికల ఫలితాలపై ఆన్‌లైన్ బెట్టింగులు



హైదరాబాద్: ఇప్పటివరకు క్రికెట్, ఇతరత్రా పోటీలపై బెట్టింగులు నిర్వహించిన వెబ్‌సైట్లు, మొబైల్ యాప్‌లు.. ఇప్పుడు ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలపై కన్నేశాయి. తెలంగాణతోపాటు ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, మిజోరాం రాష్ట్రాల్లో ఏ పార్టీ, ఎన్ని సీట్లు సాధిస్తుందనే అంచనాలపై వేర్వేరు బెట్టింగ్ సంస్థలు పందేలు నిర్వహిస్తున్నాయి. ప్రముఖులు ప్రచారకర్తలుగా ఆయా సంస్థల వెబ్‌సైట్లు, మొబైల్‌యాప్‌లకు విస్తృత ప్రచారం కల్పిస్తుండటం, వెబ్‌సైట్లు, బస్టాపులు, ఆటోలపై ప్రకటనలు ప్రదర్శిస్తున్నారు.

రెట్టింపు ఇస్తామంటూ..భారాస, కాంగ్రెస్, భాజపా తదితర పార్టీలు ఎన్ని స్థానాల్లో గెలుస్తాయి.. ఎన్ని సీట్లతో సరిపెట్టుకుంటాయి.. అంటూ ఆన్‌లైన్ బెట్టింగ్ సంస్థలు ప్రకటనలు గుప్పిస్తున్నాయి. డిసెంబరు 3న ఎన్నికల ఫలితాలు వెల్లడవుతాయని, పందెంలో గెలిచిన వారు అంతకంత డబ్బు సంపాదించుకోవచ్చని ఊరిస్తున్నాయి.

జోరుగా ప్రచారం..ఎన్నికల్లో గెలిచేందుకు రాజకీయ పార్టీలు, అభ్యర్థులు నిత్యం రకరకాల ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. బెట్టింగ్ సంస్థలు అంతకు మించి హడావుడి చేస్తున్నాయి. అమాయకులను వలలో వేసుకునేందుకు రవాణా వాహనాలు, బస్టాపులు, రైల్వే స్టేషన్లు, ఇతరత్రా రద్దీ ప్రాంతాల్లోని టీకొట్లు, పాన్‌షాప్‌లు, దుకాణాల్లో గోడపత్రాలు అంటించి వ్యాపారాన్ని విస్తరించుకుంటున్నాయి. యువత, నిరుద్యోగులు, చిరుద్యోగులు, వ్యాపారులు, ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడే వారు ఎక్కువగా ఆకర్షితులవుతున్నారు. తక్కువ సమయంలో, కష్టపడకుండా.. సులువుగా డబ్బు సంపాదించాలన్న కోరికతో ఉచ్చులో ఇరుక్కుంటున్నారు.

# పారదర్శకతకు పెద్దపీట

మెదక్ : ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా జిల్లా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఎన్నికల షెడ్యూల్ వెలువడగానే సంబంధిత అధికారులు ఆయా విభాగాలను ఏర్పాటు చేశారు. వాటికి అధికారులను నియమించి పర్యవేక్షిస్తున్నారు. జిల్లా స్థాయిలో వివిధ కమిటీలను ఏర్పాటు చేశారు. మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ(ఎంసీఎంసీ), జిల్లా గ్రీవెన్స్ కమిటీ, మాడల్ కోడ్ ఆఫ్ కండక్ట్(ఎంసీసీ), వ్యయ నిర్వహణ, వీడియో సర్వైలెన్స్, వీడియో వ్యూయింగ్ టీం, అకౌంటింగ్ టీం, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక అకౌంటింగ్ టీం, మూడు ఫ్లయింగ్ స్క్వాడ్స్ టీంలు, ఒక స్టాస్టిక్ సర్వైలెన్స్ టీం, ఒక సహాయ వ్యయ పరిశీలకుల టీంలు అందుబాటులోకి వచ్చాయి.

జిల్లాలో 7 చెక్‌పోస్టులు

పోలీస్ శాఖ ఎన్నికలపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇప్పటికే జిల్లాలో ఏడు చోట్ల చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. అభ్యర్థులకు సంబంధించి చిత్రాలు, వీడియోలు, కించపరుస్తూ సామాజిక మాధ్యమాల్లో వచ్చే పోస్టులపై కన్నేశారు. తప్పు చేసిన వారిపై కఠినంగా వ్యవహరిస్తామని జిల్లా పోలీసు అధికారులు హెచ్చరిస్తున్నారు. ఐటీ సెల్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. సోషల్ మీడియాలో ప్రకటనలను పరిశీలించేందుకు పోలీస్‌శాఖ కలెక్టరేట్ మీడియా కేంద్రంలో సిబ్బందిని నియమించింది.

అభ్యర్థి ఖాతాలోనే వ్యయం..

ఎన్నికల్లో పోటీచేసే ప్రతి అభ్యర్థి రూ.40 లక్షల వరకు గరిష్ఠంగా ఖర్చు చేసుకునే అవకాశముంది. ఈ మేరకు ప్రతి ఖర్చు వివరాలను ఎన్నికల వ్యయ పరిశీలకులకు అందించాల్సి ఉంది. ఈ మేరకు అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక సహాయ వ్యయ పరిశీలకుణ్ని నియమించారు. కేంద్ర ఎన్నికల సంఘం నుంచి ఒక వ్యయ పరిశీలకుణ్ని జిల్లాకు కేటాయించింది. ఇటీవల సంజయ్‌కుమార్ జిల్లాకు వచ్చి, ఆయా రిటర్నింగ్ అధికారుల కార్యాలయాలను పరిశీలించారు. ఆయా అధికారులతో సమావేశమయ్యారు. అభ్యర్థుల వ్యయాన్ని ఎలా నమోదు చేయాలనేదానిపై వివరించారు.

అన్నింటికీ 1950

ఓటరు జాబితాలో పేరు, నియోజకవర్గం మార్పు, పోలింగ్ కేంద్రం వివరాలు, పార్టీల ప్రలోభాలకు సంబంధించి ఫిర్యాదుకు కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. 24 గంటలపాటు సిబ్బంది అందుబాటులో ఉంటారు. జిల్లా స్థాయిలో ఎలాంటి ఫిర్యాదునైనా చరవాణి నుంచి 1950 టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్ చేసి చెప్పొచ్చు. సెప్టెంబరు నుంచి ఇప్పటి వరకు 1,324 ఫిర్యాదులు వచ్చాయి.

అతిక్రమిస్తే చర్యలు..

పార్టీలు ఎన్నికల సంఘం నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. ప్రభుత్వ ఆస్తులపై ప్రచార సామగ్రిని ఏర్పాటు చేయరాదు.




దేవాలయాలు, మసీదులు, చర్చిల్లో కండువా వేసి ప్రచారం చేయరాదు. రాత్రి 10 గంటల్లోపు ప్రచారం ముగించాలి. ప్రచారం కోసం వినియోగించే వాహనాలు, సభలు, సమావేశాలకు అనుమతులు తప్పనిసరి. జిల్లాలో ఎన్నికల నియమావళిని పరిశీలించేందుకు ఎంసీసీ ఏర్పాటు చేశారు. అదనపు పాలనాధికారి(స్థానిక సంస్థలు) జిల్లా స్థాయిలో పర్యవేక్షిస్తున్నారు. మండల స్థాయిలో ఎంపీడీవోలు, పట్టణాల్లో పుర కమిషనర్లు, ఇతరులను నోడల్ అధికారులుగా నియమించారు.

ఆర్వోలదే కీలకపాత్ర..

అసెంబ్లీ ఎన్నికల్లో రిటర్నింగ్ అధికారి కీలక పాత్ర పోషిస్తారు. జిల్లాలో మెదక్, నర్సాపూర్ అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. ఆర్డీవో రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తారు. సహాయ రిటర్నింగ్ అధికారులుగా తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్ స్థాయి అధికారులుంటారు.

తిరిగి ఇచ్చేలా..

ఎన్నికల వేళ వెంట ఎక్కువ మొత్తంలో నగదును తీసుకెళ్లడానికి వీల్లేదు. ఎన్నికల సంఘం నిర్దేశించిన రూ.50వేల కంటే ఎక్కువగా తీసుకెళ్లిన వాటిని అధికారులు సీజ్ చేస్తున్నారు. సరైన ఆధారాలు చూపకపోవడంతో పలువురు ఇబ్బందులు పడుతున్నారు. ఇందుకోసం జిల్లా స్థాయిలో గ్రీవెన్స్ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీనివాస్, జిల్లా ఖజానాశాఖ అధికారి చిన్నసాయిలు, జిల్లా ఆడిట్ అధికారి రాకేశ్ ఉన్నారు.

# ఆహ్లాదంగా.. అందంగా..!

నల్గొండ : ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అధికారులు చర్యలు చేపట్టారు. ఇందు కోసం వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ సారి జిల్లాలో సాధారణ పోలింగ్ బూత్‌లే కాకుండా, ప్రత్యేకమైనవి ఏర్పాటు చేయనున్నారు. వృద్ధులు, యువత, మహిళలు, దివ్యాంగులు ఉత్సాహంగా ఓటు వేసేలా ప్రణాళిక రూపొందించారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 144 పోలింగ్ బూత్‌ల ఏర్పాటుకు రంగం సిద్ధం చేశారు. ఇందులో మహిళలు, దివ్యాంగులు, యువత కోసం, నమూనా కేంద్రాలున్నాయి. వీటిని ఈ నెల 30న జరిగే ఎన్నికల కన్నా ముందే సిద్ధం చేసి వినియోగంలోకి తేనున్నారు. ఈ కేంద్రాల్లో ప్రత్యేకంగా ఓటర్ల కోసం ఎర్ర తివాచీలు పరువనున్నారు. స్వాగత తోరణాలు, బెలూన్లు కట్టనున్నారు. అందంగా ఆకర్షణీయంగా తీర్చిదిద్ది పోలింగ్ రోజు ఆయా కేంద్రాలకు వచ్చే ఓటర్లకు కొత్త అనుభూతి కలిగేలా ఏర్పాట్లు చేస్తారు. కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పిస్తారు. కొత్తగా హక్కు వచ్చిన పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలకనున్నారు.

మహిళలకు ఉమ్మడి జిల్లాలో నియోజకవర్గానికి 5 చొప్పున 12 నియోజకవర్గాల్లో 60 కేంద్రాలు ఏర్పాటుకు ప్రతిపాదించారు. అయితే ఉన్నతాధికారుల ఆమోదం పొందాల్సి ఉంది. ఈ కేంద్రాల్లో విధులు నిర్వహించే సిబ్బంది, అధికారులు అంతా మహిళలే ఉంటారు.

దివ్యాంగులు పూర్తిగా దివ్యాంగులైన వారే ఈ కేంద్రాలను నిర్వహిస్తారు. ప్రతి నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఏర్పాటు చేయనున్నారు. ఉమ్మడి జిల్లాలో ఇలా 12 ఏర్పాటు కానున్నాయి. దివ్యాంగులు తమ హక్కును వినియోగించుకునేలా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. గ్రామాల్లోనూ చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇంటి నుంచే ఓటు హక్కు వినియోగించుకోవాలనుకునే వారి నుంచి ఫాం 12డి దరఖాస్తులను స్వీకరించారు. కేంద్రాలకు వచ్చేవారికి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చోట్ల ర్యాంపులు నిర్మించారు.

యువకులు యువతే నిర్వహించేలా పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేయనున్నారు. నియోజకవర్గానికి ఒకటి చొప్పున 12 కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. యువత ఎన్నికల్లో ఉత్సాహంగా తమ హక్కు వినియోగించుకునేలా, స్వీప్ ఆధ్వర్యంలో చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వీరిని ఆకట్టుకునేందుకే కేంద్రాలను గుర్తించారు.

ఆదర్శంగా...నియోజకవర్గానికి అయిదు చొప్పున ఉమ్మడి జిల్లాలో 60 ఆదర్శ కేంద్రాలను ఏర్పాటు చేస్తారు. మిగతా కేంద్రాలకంటే చాలా అందంగా తీర్చిదిద్దుతారు. ఎన్నికల నిబంధనలు తెలిపే బోర్డులు, అధునాతన ఫర్నిచర్, మంచినీటి సౌకర్యం, శౌచాలయాల వంటివి ఏర్పాటు చేస్తారు.

# పట్టించుకోండి.. పుట్టంగండి..!

మోత్కూరు : జిల్లా ఆశలసౌధం ఏఎమ్మార్ ప్రాజెక్టులో ప్రధాన భాగమైన పుట్టంగండి సిస్టర్న్ ఆనకట్టను నాణ్యతాలోపాలు వెంటాడుతూనే ఉన్నాయి... రెండు దశాబ్దాల క్రితం రూపుదిద్దుకున్న ఈ ఆనకట్ట నిర్మాణంలో అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా.. పనులు చేపట్టిన ఏజెన్సీ నాణ్యతను విస్మరించింది. దీనిమూలంగా ప్రాజెక్టు ప్రారంభించిన కొద్దిరోజులకే ఆనకట్ట పలుచోట్ల లీకేజీలకు గురైంది. ఇన్‌టేక్ స్ట్రక్చర్ నుంచి పలుచోట్ల నీరు బయటకు రావడంతో ప్రమాదఘంటికలు మోగాయి. ఇసుక బస్తాలు వేసి ఏళ్ల తరబడి లీకేజీలను తాత్కాలికంగా అరికట్టారు. తర్వాత ఇన్‌టేక్ స్ట్రక్చర్‌ను ఆనుకుని లోపలివైపు రక్షణగోడతోపాటు ఆనకట్ట 30 మీటర్లు కూలిపోవడంతో హుటాహుటిన రాక్‌ఫిల్‌డ్యాం, ఇన్‌టేక్ స్ట్రక్చర్ వెనుకవైపున సిమెంటు నిర్మాణం చేపట్టి లీకేజీలు నివారించారు. ఆ తర్వాత లీకేజీలు కాకుండా ఆనకట్ట ఎత్తుపెంచి మట్టిపోయడంతో లోపలివైపు రక్షణగోడ పూర్తిగా మునిగిపోయి శిథిలావస్థకు చేరుకుంది. 2.3 కిలోమీటర్ల పొడవున్న ఆనకట్ట 0.994 కిలోమీటరు నుంచి 1.85 కిలోమీటరు వరకు రక్షణగోడ కూలిపోయింది. కొన్నిచోట్ల లోపలికి వంగిపోయి ప్రమాదకరంగా మారింది. దీంతో ఆనకట్టపై



ఏ చిన్న వాహనంసైతం ప్రయాణించలేని పరిస్థితి నెలకొంది.

మంజూరు కాని నిధులు...

సిస్టర్న్ మరమ్మతులకు ఏడాది క్రితం ప్రాజెక్టు అధికారులు రూ.40 లక్షలతో అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి పంపించారు. కానీ ఇప్పటి వరకు నిధుల మంజూరు లేకపోవడంతో పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా మారింది. గతంలో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో డ్యాం భద్రతా బృందం సందర్శించి వారి ఆదేశాల మేరకు తాజాగా అక్కంపల్లి, పుట్టంగండి జలాశయాల అభివృద్ధికి రూ.25 కోట్లతో డ్యాం రిహాబిలిటేషన్ ఇంప్లిమెంటేషన్ ప్రాజెక్టు(డ్రిప్) అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి పంపించారు. ఆ నిధులు మంజూరు కాలేదు. జిల్లా సాగు, తాగు, జంటనగరాల తాగునీటి అవసరాలు తీర్చడంలో కీలక ప్రాత వహిస్తున్న ఈ ప్రాజెక్టు ఆధునికీకరణకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. అంచనాలు రూపొందించి పంపించాం– నాగయ్య, డీఈ, ఏఎమ్మార్పీ ఏఎమ్మార్ ప్రాజెక్టులో ప్రధానమైన అక్కంపల్లి, పుట్టంగండి జలాశయాల ఆధునికీకరణకు ఇటీవల రూ.25 కోట్లతో డ్రిప్ ఎస్టిమేట్ చేసి ప్రభుత్వానికి పంపించాం. కేంద్ర బృంద సూచన మేరకు ఈ అంచనాలు రూపొందించి పంపించాం. నిధులు మంజూరు కాగానే సిస్టర్న్ ఆనకట్టను వెడల్పు, రక్షణగోడ నిర్మాణం, బీటీ రహదారి, విద్యుద్ధీకరణ పనులు చేపడతాం.

# మహిళలకు వ్యాపార ప్రోత్సాహం

గద్వాల : గ్రామీణ ప్రాంతాల్లోని స్వయం సహాయక సంఘాల మహిళలు వ్యాపార రంగాల్లో రాణించేలా సెర్ప్ చర్యలు తీసుకుంటోంది. 'విలేజ్ న్యూ ఎంటర్‌ప్రైజెస్' పేరుతో ప్రత్యేకంగా మహిళలకు రుణాలు అందిస్తున్నారు. చిన్న దుకాణం నుంచి పెద్ద వ్యాపారం చేసే వాళ్లకు రెండేళ్లుగా ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. తాజాగా 2023-24 ఆర్థిక సంవత్సరానికి లక్ష్యం నిర్దేశించారు. కొత్తగా వ్యాపారం చేసుకునే వారితో పాటు, గత రెండేళ్లలో ఈ పథకం ద్వారా వ్యాపారం నిర్వహిస్తున్న వారికి సైతం మరింత రుణం ఇవ్వాలని జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులకు ఆదేశాలు వచ్చాయి. ఈ మేరకు వారు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

జిల్లాలో లక్ష్యం ఇలా.. జిల్లాలోని మొత్తం 12 మండలాల పరిధిలో 255 గ్రామ పంచాయతీలున్నాయి. 310 గ్రామైక్య సంఘాల పరిధిలో 8,120 మహిళల స్వయం సహాయక సంఘాలున్నాయి. ఇందులో 90,800 మందికి పైగా సభ్యులున్నారు. పొదుపు సంఘాల్లోని కొందరికి వ్యాపారంపై పట్టు నేర్పితే మిగతా వారు సైతం ఆ వైపు ఆలోచనలు చేస్తారని సెర్ప్ సంకల్పించింది. ఈ మేరకు 2021-22 ఆర్థిక సంవత్సరానికి 936 మంది మహిళలకు వ్యాపారాల ఏర్పాటుకు రూ.9.33 కోట్లు రుణం అందించారు. 2022-23లో 2,194 వ్యాపారాల ఏర్పాటుకు లక్ష్యం ఉండగా.. 1,549 మందికి రూ.16.20 కోట్లు రుణం ఇచ్చారు. రుణం అందించడంలో గ్రామైక్య సంఘాలను భాగస్వామ్యం చేస్తున్నారు. ప్రస్తుతం ఆర్థిక సంవత్సరం 1,642 మందికి రుణం చెల్లించేందుకు లక్ష్యం నిర్దేశించారు. వీరికి బ్యాంకు లింకేజీ,



స్త్రీనిధి, సీఐఎఫ్ (కమ్యూనిటీ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్), పొదుపు సంఘం నిధి ద్వారా రూ.50 వేల నుంచి రూ.3 లక్షల వరకు రుణం అందించనున్నారు. టైలరింగ్, మెడికల్, ఫర్టిలైజర్, హోటల్, కూరగాయల వ్యాపారం, జ్యూస్, స్వీట్ సెంటర్, రోటీ మేకర్, ప్లేట్ల తయారీ, దుస్తుల దుకాణం, తినుబండారాల తయారీ తదితర వాటిని మహిళలు ఏర్పాటు చేసుకోవచ్చు. గత రెండేళ్లలో వ్యాపారాలు ఏర్పాటు చేసుకున్న వారికి సైతం రూ.లక్ష చొప్పున సరాసరి రుణం ఇవ్వనున్నారు. వ్యాపారాలను విస్తరించుకోవడం, అదనపు వ్యాపారం ఏర్పాటుకు రుణం అందజేస్తారు. ఇలాంటి 1,614 మందికి ఆర్థిక సహకారం అందించాలి సెర్ప్ లక్ష్యంగా నిర్దేశించింది.

రూ.లక్ష రుణంతో కిరాణం : పొదుపు సంఘాల ద్వారా రుణాలతో చాలా మంది వ్యాపారాలు చేస్తున్నారు. నేను విలేజ్ ఎంటర్ ప్రైజెస్ ద్వారా అధికారుల సూచనలతో రూ.లక్ష రుణం తీసుకొని కిరాణం ఏర్పాటు చేసుకున్నా. వ్యాపారం మంచిగా జరుగుతోంది. కుటుంబ జీవనోపాధికి నా వంతు ఆర్థిక సహకారం అందిస్తున్నా. రానున్న రోజుల్లో మరింత రుణం ఇస్తే.. మరింత అభివృద్ధి చేసుకుంటా.

సరిత, పాల్వాయి, మల్దకల్ మండలం

రుణంతో కారం పిండిగిర్ని : పిండి గిర్నితో ఉపాధి పొందేదాన్ని. వ్యాపారం పెంచుకోవాలనే ఉద్దేశంతో విలేజ్ ఎంటర్ ప్రైజెస్ ద్వారా రూ.1.50 లక్షలు రుణం పొందా. కారం పిండి గిర్ని ఏర్పాటు చేశాను. మిర్చి కొని పొడి చేసి, కారం ప్యాకెట్లతో వ్యాపారం చేస్తున్నా. దీని ద్వారా ప్రతి నెలా రూ.20 వేలకు పైగా వ్యాపారం జరుగుతోంది. తీసుకున్న రుణం పూర్తిగా సద్వినియోగం చేసుకున్నా.

రాధమ్మ ఉప్పల, అయిజ మండలం

ఆసక్తి ఉన్నవారికి ఇస్తాం : మహిళలు వ్యాపారంలో రాణించేలా, ఆర్థిక సాధికారత సాధించేందుకు విలేజ్ ఎంటర్ ప్రైజెస్ ద్వారా రుణాలు ఇస్తున్నాం. సాధారణంగా బ్యాంకు లింకేజీ ద్వారా గ్రూపులకు ఇస్తాం. ఇందులో వ్యాపారం కోసం ఆసక్తి ఉన్న మహిళకు ప్రత్యేకంగా చెల్లిస్తాం. ఉన్నతాధికారులు నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం.

రామ్మూర్తి, డీపీఎమ్, జోగులాంబ గద్వాల

# పనులు పూర్తయినా అందని పరిహారం

ఆసిఫాబాద్: జిల్లాలో నాలుగు వరుసల రహదారి పనులు దాదాపుగా పూర్తయ్యాయి. మరో పక్షం రోజుల్లో టోల్‌గేట్ ఏర్పాటుకు గుత్తేదారు సన్నాహాలు చేస్తున్నారు. కానీ రోడ్డు విస్తరణలో భూములు, నివాసాలు కోల్పోయిన వారిలో పలువురికి ఇప్పటికీ పరిహారం రాక అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూనే ఉన్నారు. అరకొరగా డబ్బులు అందిన మరికొందరు సైతం మార్కెట్ విలువను పరిగణనలోకి తీసుకొని చెల్లింపులు జరపాలని కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకున్నారు. మరోమారు సర్వే చేసి ఆర్థిక సాయం అందించాలని కోరుతున్నారు.

జిల్లాలో నాలుగు వరుసల రహదారి కోసం 347 హెక్టార్ల భూమిని సేకరించి, రూ.80 కోట్ల వరకు పరిహారం అందించారు. పనుల్లో పరిహారం చెల్లింపుల్లో ఆది నుంచి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రెవెన్యూ అధికారులు ఇచ్చిన నివేదిక ఆధారంగానే పరిహారం మంజూరైంది. తప్పుల తడకగా సర్వే చేయడం, వ్యవసాయ భూములను వాణిజ్య భూములుగా చూపించడం, పక్కపక్కనే ఉన్న వ్యక్తులకు సంబంధించి పరిహారం చెల్లింపుల్లో పెద్దఎత్తున తేడాలు ఉండటం. కొందరికి ఇళ్లు, భూములు పోయినా పరిహారం అందకపోవడం వంటి విమర్శలు వచ్చాయి. చాలా తక్కువ మొత్తంలో పరిహారం ఇచ్చారని జిల్లాలోని 210 మంది వరకు ఆర్బిట్రేషన్ (మధ్యవర్తి త్వం) కోసం పాలనాధికారికి దరఖాస్తు చేసుకున్నారు. కలెక్టర్ పరిశీలించి నిర్ణీత మొత్తం పరిహారం సూచించాలి. అది సైతం నచ్చకపోతే బాధితులు కోర్టుకు వెళ్లే అవకాశం ఉంది. కానీ రెండేళ్లుగా దరఖాస్తులు పాలనాధికారి వద్దే పెండింగ్‌లో ఉన్నాయి.అందరికీ న్యాయం చేస్తాంభూములు, ఇళ్లు కోల్పోయిన వ్యక్తులకు సంబంధించి పాలనాధికారి వద్ద ఉన్న దరఖాస్తులను త్వరలోనే పరిష్కరిస్తాం. పరిహారమే రాని వ్యక్తుల గురించి మరోసారి నోటిఫికేషన్ వేసి, సర్వే చేసి అందరికీ న్యాయం చేస్తాం.రాజేశ్వర్, జిల్లా రెవెన్యూ అధికారి

# పునరావాసం ఇంకెన్నేళ్లకు..?



మహబూబ్‌నగర్ : జూరాల ప్రాజెక్టు ముంపు గ్రామాల ప్రజలు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కోసం 16 ఏళ్లుగా ఎదురుచూస్తున్నారు. నారాయణపేట జిల్లా మక్తల్ మండలం అంకెన్‌పల్లి, అనుగొండ, దాదన్‌పల్లి గ్రామాలకు సంబంధించిన 850 ఎకరాలు ముంపునకు గురయ్యాయి. జూరాల ప్రాజెక్టు 318 ఎఫ్ఆర్ఎల్ స్థాయిలో నిండితే తిరుగు జలాలు ఈ మూడు గ్రామాల సమీపం వరకు వస్తాయి. దీంతో ఈ మూడింటిని ముంపు గ్రామాలుగా 2007లో అధికారులు గుర్తించారు. అదే ఏడాది ఈ గ్రామాలకు పునరావసం కోసం జీవో విడుదల చేసింది. 2011లో ఈ ఇళ్లను ఖాళీ చేయాలని పరిహారం సైతం ఇచ్చింది. ఇక్కడి వరకు బాగానే ఉన్నా వీరికి ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ద్వారా ఇప్పటి వరకు పునరావాస కేంద్రాన్ని చూపలేదు. ఏటా వర్షాకాలం వస్తే ప్రజలు భయం గుప్పట్లో కాలం వెళ్లదీస్తున్నారు.

మొత్తం 1,690 కుటుంబాలు

గతంలో అంకెన్‌పల్లి, దాదన్‌పల్లి, అనుగొండ కలిపి ఒకే గ్రామపంచాయతీగా ఉండేది. అనుగొండ పరిధిలో ఇవన్నీ కలిసి ఉండేవి. ప్రభుత్వం గ్రామ పంచాయతీల విస్తరణలో భాగంగా అంకెన్‌పల్లి, దాదన్‌పల్లిలను గ్రామపంచాయతీలుగా గుర్తించింది. ప్రస్తుతం ఈ మూడు గ్రామాల పంచాయతీలకు ప్రత్యేకంగా ఆర్అండ్ఆర్ ప్యాకేజీని కల్పించాల్సిన అవసరం ఉంది. గతంలో ప్రభుత్వం నిర్వహించిన సర్వేలో అనుగొండలో 970, అంకెన్‌పల్లిలో 370, దాదన్‌పల్లిలో 350 కుటుంబాలు ఉన్నట్లు గుర్తించారు. ప్రస్తుతం వీటి సంఖ్య పెరిగింది. ఈ మూడు గ్రామాలకు ఇప్పటి వరకు ఎలాంటి పునరావాసం కల్పించకపోవడంతో ఆ కుటుంబాలు ప్రస్తుతం గ్రామాల్లో బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నాయి.

అన్నీ సమస్యలే..

వీటిని ముంపు గ్రామాలుగా అధికారులు ప్రకటించడంతో ఈ ప్రాంతంలో అభివృద్ధి చేయడం లేదు. రహదారులు ఏర్పాటు కావడం లేదు. పాఠశాల అదనపు గదుల నిర్మాణం, డ్రైనేజీ పనులు కూడా జరగడం లేదు. ఎవరూ కొత్తగా ఇళ్లను నిర్మించుకోవడం లేదు. పాత ఇళ్లే కూలిపోయే దుస్థితి. కొత్త ప్రభుత్వ భవనాలు రావడం లేదు. శిథిలావస్థకు చేరిన ప్రస్తుత భవనాలతోనే సర్దుకోవాల్సి వస్తోంది. వర్షాకాలం వస్తే ఈ భవనాలు ఎక్కడ కూలుతాయోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ప్రధానంగా వర్షాకాలంలో జూరాల తిరుగుజలాలు ఈ గ్రామాలను తాకుతాయి. ఇళ్లలోకి పాములు, తేళ్లు, ఇతర విష పురుగులు వస్తున్నాయి. ఈ గ్రామాలు మొత్తం బురదమయంగా మారుతున్నాయి. కనీసం నడవడానికి కూడా అవస్థలు పడాల్సిన పరిస్థితి వస్తోంది. ప్రజాప్రతినిధులు, అధికారులు మాత్రం ఆర్అండ్ఆర్ ప్యాకేజీని ఏర్పాటు చేస్తామని హామీలు ఇస్తున్నారే తప్ప తమను పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

త్వరగా పునరావాస కేంద్రం చూపాలి : కొన్నేళ్లుగా తమ గ్రామానికి పునరావాస కేంద్రం చూపడం లేదు. వెంటనే ఆర్అండ్ఆర్ ప్యాకేజీలో భాగంగా తమకు ఏర్పాటు చేసే పునరావాస కేంద్రంలో మౌలిక వసతులు కల్పించాలి. వర్షాకాలం వస్తే భయం గుప్పిట్లో ఉంటున్నాం. తిరుగుజలాలు ఇళ్లలోకి వచ్చే పరిస్థితి. వెంటనే తమకు కేటాయించిన స్థలంలో అన్ని సౌకర్యాలు కల్పించి తమను అక్కడికి తరలించాలి.

అంజన్న, అంకెన్‌పల్లి

పునరావాస కేంద్రంపై దృష్టి పెట్టాం: జూరాల జలాశయం ముంపు గ్రామాల్లో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయడంపై దృష్టి పెట్టాం. ఇప్పటికే కలెక్టర్ చర్యలు చేపట్టారు. అనుగొండలో 80 ఎకరాల భూమిని ప్రభుత్వం సేకరించింది. ఇక్కడ మౌలిక వసతులు ఏర్పాటు చేస్తాం. దాదాన్‌పల్లిలో భూసేకరణ వివాదం కోర్టులో ఉంది. అంకెన్‌పల్లిలో భూసేకరణ చేపట్టాల్సి ఉంది. ధర్మతేజ, ఎస్ఈ, జలవనరుల శాఖ

# నాలాలపై ఆగని కబ్జాలు



పాలమూరు : జిల్లా కేంద్రమైన పాలమూరులో పరిస్థితి కాదేదీ కబ్జాకు అనర్హం అన్నట్లు తయారైంది. ముఖ్యమైన నాలాలన్నీ ఆక్రమణలకు గురవుతున్నాయి. లక్ష్మీనగర్‌కాలనీ నుంచి శ్రీనివాసకాలనీ శివారు వరకు ఉన్న చిక్కుడువాగు, రామయ్యబౌలి నుంచి భూత్పూర్ రహదారి మీదుగా ఇమాంసాబ్‌కుంట వరకు ఉన్న పెద్దచెరువు వాగును అడుగడుగునా కబ్జా చేసి భవనాలు నిర్మిస్తున్నారు. సమాచారం తెలిసి టౌన్ ప్లానింగ్ అధికారులు, నీటి పారుదల శాఖ ఇంజినీర్లు క్షేత్రస్థాయికి వెళ్లి వాగులను కబ్జా చేసి జరుగుతున్న నిర్మాణాలను ప్రాథమిక దశలో అడ్డుకుంటున్నారు. ఆ తర్వాత రాజకీయ అండదండలతో అక్రమ నిర్మాణాలు కొనసాగిస్తున్నారు. ఐదు మాసాల క్రితం చిక్కుడు వాగుపై ఓ వ్యక్తి పునాదులు తీసి గదుల నిర్మాణానికి సిద్ధమయ్యారు. సమాచారం తెలుసుకున్న టౌన్ ప్లానింగ్ సిబ్బంది పనులు అడ్డుకున్నారు. మరుసటి రోజు నుంచి మళ్లీ పనులు ప్రారంభించారు. వారం రోజుల్లో బేస్‌మెంట్ నిర్మించి భవన నిర్మాణానికి సిద్ధం చేశారు.

తాజాగా భూత్పూర్ రోడ్డులోని ఎస్సార్ పెట్రోలు బంకు వెనుక పెద్దచెరువు నాలా ఆక్రమించి ఓ వ్యక్తి ఇంటి నిర్మాణానికి పూనుకున్నారు. మూడు రోజుల క్రితం టౌన్ ప్లానింగ్ సిబ్బంది దాడులు నిర్వహించి పనులు నిలిపివేశారు. అయినా వెనక్కి తగ్గలేదు. నేతలతో అధికారులపై ఒత్తిడి తెప్పించి రెండు రోజులుగా నాలాపై భవనం పనులు కానిచ్చేస్తుండడం గమనార్హం.

కనిపించని బఫర్ జోన్లు : చిక్కుడు వాగు, పెద్దచెరువు వాగు పొడవునా ఎక్కడా బఫర్ జోన్లు కనిపించడం లేదు. కాకతీయుల కాలంలోనే చెరువులకు పాటుకాల్వలు(వాగులు), పంట కాల్వలు, తూములు, అలుగులు నిర్మించారు. చెరువులను అనుసంధానం చేసూ వాగులు నిర్మించారు. ఒక్కో వాగును చెరువు సామర్థ్యాన్ని బట్టి 10 నుంచి 20 మీటర్ల వరకు వెడల్పుతో నిర్మించారు. 10 మీటర్ల వెడల్పుతో ఉన్న వాగులకు ఇరువైపులా రెండు మీటర్ల బఫర్ జోన్ కూడా నిర్ణయించారు. 10 మీటర్ల కంటే ఎక్కువ విస్తీర్ణంలో వాగు ఉంటే దానికి ఇరువైపులా 09 మీటర్ల వరకు బఫర్ జోన్ ఉంటుంది. నీటి పారుదల శాఖ రికార్డుల్లో ఈ బఫర్ జోన్ల మార్గదర్శకాలు ఉన్నాయి. నిబంధనలు ఇంత స్పష్టంగా ఉన్నా వాగులు, వాటి పక్కన బఫర్ జోన్లను వదలకుండా అక్రమార్కులు కబ్జా చేస్తున్నారు. చెప్పుకోవడానికేమో అన్నట్లు అధికారులు ఒకసారి పనులు ఆపుతున్నారు. తర్వాత నిర్మాణాలు కొనసాగుతున్నా కన్నెత్తి చూడటం లేదు.

# ప్రగతి దిశగా పల్లెలు

ఆదిలాబాద్ : తెలంగాణ ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో కనీస సౌకర్యాలను కల్పించేందుకు పల్లె ప్రగతి పేరున పలు కార్యక్రమాలను చేపడుతోంది. మిషన్ అంత్యోదయలో భాగంగా కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ జిల్లాల వారీగా గ్రామాల్లో ఏయే సౌకర్యాలు, అందుబాటులో ఉన్నాయనే వివరాలను తాజాగా విడుదల చేసిన 2022-23 వార్షిక నివేదికలో వెల్లడించింది. బ్యాంకు, తపాలా, పశువైద్యం, తదితర వాటిలో వెనుకబడి ఉన్నట్లు తేలింది. నీతి ఆయోగ్ విడుదల చేసిన బహుముఖ పేదరిక సూచికలో ఉమ్మడి జిల్లా పేదరికంలో మొదటి స్థానంలో ఉంది. గతంతో పోలిస్తే కనీస సౌకర్యాలను కల్పించడంతో పాటు జీవన ప్రమాణాల పెంపు కోసం ప్రభుత్వం కృషి చేస్తోంది.

సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా అభివృద్ధి పరంగా చూస్తే గతంలో అనేక గ్రామాలకు రహదారి సౌకర్యం ఉండేది కాదు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత ప్రభుత్వం మరికొన్ని గ్రామాలకు పంచాయతీ హోదా కల్పించి నిధులు కేటాయించడంతో ఆయా గ్రామాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. గ్రామీణాభివృద్ధిలో భాగస్వామ్యం వహించే 29 శాఖల ఆధ్వర్యంలో చేపట్టే పనులు ఒకే గొడుగు కిందికి తీసుకొచ్చి సమగ్ర అభివృద్ధికి బాటలు వేయాలని కేంద్ర ప్రభుత్వం మిషన్ అంత్యోదయ కార్యక్రమం చేపట్టింది. ఇందులో భాగంగా గ్రామీణ ప్రాంతాలకు చేరువగా ఉన్న సౌకర్యాలపై సర్వే నిర్వహించి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. రాబోయే



రోజుల్లో వీటి ఆధారంగా చేపట్టే పనులకు నిధులు కేటాయించే అవకాశం ఉంది.

అందుబాటులో సౌకర్యాలుజిల్లాల వారీగా అనేక గ్రామాలకు కనీస ఎకర్యాలు అందుబాటులోకి వచ్చినట్లుగా అంత్యోదయ సర్వేలో వెల్లడైంది. విద్య పరంగా పరిశీలిస్తే ప్రాథమిక విద్య 95శాతం అందుబాటులో ఉండగా, ఉన్నత, వృత్తివిద్య అవకాశాలను మరింత చేరువ చేయాల్సిన అవసరం ఉంది. కొత్తగా పంచాయతీలు ఏర్పాటు చేసినా ఇంకా పాత పంచాయతీల్లోనే ప్రజాపంపిణీ వ్యవస్థ కొనసాగుతోంది. కొత్త పంచాయతీల్లో చౌకధరల దుకాణాలు ఏర్పాటు చేస్తే మరింత మేలు జరిగే అవకాశం ఉంది. 1,509 పంచాయతీల్లో 2,324 గ్రామాలుంటే 1,365 చౌకధరల దుకాణాలు ఉన్నాయి. మిషన్ భగీరథతో ప్రతి పల్లెకు తాగునీటి సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. బ్యాంకింగ్, తపాలా, పశువైద్య సేవలను మరింత చేరువ చేయాల్సిన అవసరం ఉంది.

# ట్రాఫిక్ నియంత్రణపై దృష్టి

ఆదిలాబాద్ : జిల్లా కేంద్రంలో వ్యాపారానికి ప్రధాన కేంద్రమైన అంబేద్కర్ చౌక్ చుట్టుపక్కల ప్రాంతంలో నడక సైతం నరకప్రాయంగా మారింది. అడ్డదిడ్డంగా వాహనాల రాకపోకలు, పాదబాటల ఆక్రమణలతో ట్రాఫిక్ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. విభాగినులు(డివైడర్లు) వెడల్పుగా నిర్మించడంతో రహదారులు మరింత కుచించుకుపోయాయి. షాపింగ్ చేసేందుకు బజారుకు వచ్చిన ప్రజలు వాహనాలను రోడ్డుపైనే నిలపడంతో నిత్యం ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. దీనికితోడు రహదారులపైనే వాహనాలు నిలిపితే ట్రాఫిక్ పోలీసులు చరవాణిలో చిత్రాలు తీసి జరిమానా విధిస్తున్నారు. ఇటువంటి ట్రాఫిక్ చిక్కులను నియంత్రించేందుకు బల్దియా యంత్రాంగం రెండు చోట్ల పార్కింగ్ జోన్లను ఏర్పాటు చేసేందుకు నిర్ణయించింది.

నిర్వహణ బాధ్యతలు ఏజెన్సీలకు..

పట్టణంలో గతంలో గణేష్ థియేటర్‌కు లీజుకిచ్చిన స్థలాన్ని గతేడాది బల్దియా అధికారులు స్వాధీనం చేసుకుని నిర్మాణాన్ని నేలమట్టం చేశారు. ప్రస్తుతం ఆ స్థలం ఖాళీగా ఉంది. దీంతోపాటు యూనియన్ బ్యాంకు సమీపంలోని స్థలానికి సైతం పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు క్లియరెన్స్ ఇచ్చారు. దీంతో రెండుచోట్ల పార్కింగ్ జోన్లు ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారు. ఆసక్తి ఉన్న ఏజెన్సీలు ఏడాది పాటు పార్కింగ్ జోన్లను నిర్వహించుకునేందుకు బల్దియా అధికారులు టెండర్లను ఆహ్వానించారు. బల్దియా నిర్ణయించిన ధర కంటే ఎక్కువ మొత్తం పురపాలికకు చెల్లించే ఏజెన్సీలతో అధికారులు ఒప్పందం చేసుకోనున్నారు. పార్కింగ్ జోన్‌లో వాహనం నిలిపితే గంట వరకు



కనీస ఫీజు రూ.10 వసూలు చేయనున్నారు. గంట దాటి నాలుగు గంటల వరకు రూ.20, అంతకుమించి సమయం వాహనం ఉంటే పెరిగిన ప్రతి గంటకు రూ.10 చొప్పున చెల్లించాలని ప్రాథమికంగా నిర్ణయించారు. ఏజెన్సీలు ఆన్‌లైన్ టెండరులో పాల్గొనేందుకు ఈ నెల 11వ తేదీ వరకు గడువు విధించారు.

దుకాణాల ఎదుట ఇష్టానుసారంగా..పట్టణంలోని సినిమా రోడ్డులో ట్రాఫిక్ దుస్థితి ఇది. వ్యాపార సముదాయాల ఎదుట రోడ్డుపైనే వాహనాలు నిలపడం ఇక్కడ సర్వసాధారణమైంది. దీంతో రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పార్కింగ్ జోన్లు ప్రారంభమైతే ఈ సమస్యకు కొంతైనా పరిష్కారం లభిస్తుందని అధికారులు భావిస్తున్నారు.

ఏర్పాటు చేయనున్న స్థలం ఇదే

గణేష్ థియేటర్‌ను కూల్చివేసిన ఈ విశాలమైన బల్దియా స్థలంలో పార్కింగ్ జోన్ ఏర్పాటు చేయనున్నారు. టెండరులో బల్దియా కనీస ధర నెలకు రూ.2 లక్షలు నిర్ణయించారు. ఎక్కువ మొత్తం చెల్లించే ఏజెన్సీతో ఒప్పందం చేసుకుని ఏడాదిపాటు పార్కింగ్ జోన్ నిర్వహించేందుకు అవకాశం కల్పిస్తారు.

టెండరు పిలిచాంఅరుణ్, ఏఈఈ, బల్దియా

బల్దియా పాలకవర్గం నిర్ణయం మేరకు సినిమా రోడ్డులోని గణేష్ థియేటర్‌ను కూల్చివేసిన బల్దియా స్థలం, యూనియన్ బ్యాంకు సమీపంలోని స్థలంలో పార్కింగ్ జోన్లను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. బల్దియా కనీస ధర నిర్ణయించి టెండరు పిలిచాం. ఎక్కువ ధర చెల్లించేందుకు ముందుకు వచ్చిన ఏజెన్సీలతో ఏడాదిపాటు పార్కింగ్ జోన్ నిర్వహించేందుకు ఒప్పందం చేసుకుంటాం.

# విస్తరణం..

ఆదిలాబాద్ : ఒకవైపు అడ్డగింతలు, మరోవైపు వినతులు, ఇంకో వైపు బైపాస్ కోసం తీర్మానాలు..వెరసి ఆర్మూర్ నుంచి క్యాతన్‌పల్లి వరకు 63వ నెంబరు జాతీయ రహదారి విస్తరణ పనులకు అడ్డంకులు ఏర్పడుతున్నాయి. రహదారి విస్తరణలో కీలకమైన అలైన్‌మెంట్ పనులు ఇప్పటికే పూర్తి చేసిన అధికారులు భూ సేకరణకు వీలుగా నోటిఫికేషన్ జారీ చేశారు. రహదారి విస్తరణలో భాగంగా సంబంధిత శాఖలకు సమాచారం ఇచ్చిన జాతీయ రహదారుల సాధికారిక సంస్థ(ఎన్‌హెచ్ఏఐ) సమగ్ర ప్రాజెక్టు నివేదిక రూపకల్పనలో నిమగ్నమైంది. దీనిలో భాగంగా దండేపల్లి మండలం గూడెం నుంచి క్యాతన్‌పల్లి వరకు ప్రస్తుతం ఉన్న రహదారిని 45 మీటర్ల మేర విస్తరించేందుకు వీలుగా దారికి ఇరువైపులా మార్కింగ్ చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. అడుగడుగునా అడ్డగింతలుదండేపల్లి మండలం గూడెంలో జిల్లా సరిహద్దు అయిన గోదావరి వంతెన నుంచి 35.8 కి.మీ. మేర రహదారి విస్తరణ కోసం అధికారులు మార్కింగ్‌కు శ్రీకారం చుట్టారు. గత నెలలో పలుమార్లు సర్వే కోసం వెళ్లిన అధికారులను నిర్వాసితులు అడ్డగించడంతో రహదారి చివరి భాగమైన క్యాతన్‌పల్లి నుంచి వెనక్కి సర్వే ప్రారంభించారు. ప్రస్తుతం ముల్కల్ల వరకు పెగ్గింగ్ పూర్తి చేసినప్పటికీ బాధితుల నుంచి ఇబ్బందులు తప్పడం లేదు. సర్వే ఏజెన్సీ, రెవెన్యూ శాఖ అధికారులను బాధితులు అడ్డుకుంటుండటంతో అవసరమైతే పోలీసు రక్షణ మధ్య మార్కింగ్ చేయాలన్న ఆలోచనలో అధికారులు ఉన్నట్టు సమాచారం.

కొనసాగుతున్న డీపీఆర్ పనులు

జాతీయ రహదారి విస్తరణలో భాగంగా సమగ్ర ప్రాజెక్టు రిపోర్టు తయారీలో అధికారులు నిమగ్నం అయ్యారు. భూ నిర్వాసితులు, భవనాల యజమానుల నుంచి నిరసనలు ఎదురవుతున్నా.. రహదారి నిర్మాణానికి అవసరమైన భూ సేకరణ, వంతెనలు, అండర్ పాస్‌లు, సర్వీస్ రోడ్డులు, విద్యుత్తు లైను షిఫ్టింగ్, తొలగించాల్సిన వృక్షాలు తదితర అంశాలను పరిశీలిస్తున్నారు.అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ ప్రదక్షిణలురహదారి విస్తరణ వల్ల తమ ఆస్తులు కోల్పోతున్న బాధితుల పరిస్థితి ఎక్కని కొండ, మొక్కని బండ లేదన్నట్టు సాగుతోంది. ఒకవైపు నిరసన తెలుపుతూనే మరోవైపు దిల్లీ నుంచి గల్లీ వరకు అధికారులు, ప్రజా ప్రతినిధులు, అన్ని పార్టీల నాయకుల వద్దకు వెళ్లి తమ గోడు వెల్లబోసుకుంటూ మద్దతు కూడగట్టుకునే ప్రయత్నాలు ప్రారంభించారు. కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్‌గడ్కరీ, జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ రీజినల్ అధికారి కృష్ణప్రసాద్, కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్‌రెడ్డిలతో సహా పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులకు తమ బాధలు చెప్పుకొంటున్నారు. జాతీయ రహదారి పక్కన చాలా వరకు భూములు ప్లాట్లు, స్థిరాస్తి వెంచర్లుగా మారి ఎకరం కనిష్ఠంగా రెండు కోట్ల ధర పలుకుతుండగా పట్టణ ప్రాంతాల్లో గుంటకు రూ.30-50 లక్షలకు అమ్ముడుపోతున్నాయి.

# వైఎస్సార్ జిల్లాలో ముగిసిన సీఎం జగన్ రెండు రోజుల పర్యటన



వైఎస్సార్ జిల్లా: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ జిల్లాలో తన రెండు రోజుల పర్యటనలో భాగంగా రెండో రోజు శుక్రవారం ఉదయం ఇడుపులపాయ ఆర్కే వ్యాలీలో రూ. 1.75 కోట్లతో నిర్మించిన ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ పోలీస్ స్టేషన్, రూ. 2.75 కోట్లతో నిర్మించిన జమ్మలమడుగు పోలీస్ స్టేషన్లను సీఎం జగన్ ప్రారంభించారు.

అనంతరం అర్జీదారుల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్. బి. అంజాద్ బాషా, జిల్లా ఇంచార్జి మంత్రి ఆదిమూలపు సురేష్, ఎంపీ అవినాష్ రెడ్డి, జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు, డీఐజీ శెంథిల్ కుమార్, ఎస్పీ శిద్దార్థ్ కౌశల్, జమ్మలమడుగు ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి, ఎంపీటీసీ గంగ రత్నమ్మ, జడ్పీటీసీ రవికుమార్ రెడ్డి, ఎంపిపి లక్ష్మి గాయత్రి, ఇడుపులపాయ సర్పంచ్ నాగమ్మ, పోలీస్ అధికారులు పాల్గొన్నారు. అనంతరం ఎకో పార్కులో పులివెందుల నియోజకవర్గం అభివృద్ధి పనులపై సమీక్షలో భాగంగా.. వేముల మండలం ప్రజాప్రతినిధులతో సీఎం జగన్ సమావేశమయ్యారు.

సీఎం జగన్ వైఎస్సార్ జిల్లా రెండు రోజుల పర్యటన ముగిసింది. గురు, శుక్రవారాల్లో పలు అభివృద్ధి, శంకుస్థాపన కార్యక్రమాల్లో పాల్గొన్న సీఎం.. ఇడుపులపాయ నుంచి గన్నవరం ఎయిర్‌పోర్ట్‌కు చేరుకుని అక్కడ నుంచి తాడేపల్లి నివాసానికి బయలుదేరి వెళ్లారు.

# విజయవాడలో కృష్ణ విగ్రహాన్ని ఆవిష్కరించిన కమల్ హాసన్



టాలీవుడ్ సూపర్ స్టార్ దివంగత నటుడు కృష్ణ విగ్రహాన్ని ప్రముఖ నటుడు కమల్‌హాసన్ ఆవిష్కరించారు. విజయవాడలోని గురునానక్ కాలనీ కేడీజీవో పార్కులో ఏర్పాటుచేసిన నటశేఖరుడి విగ్రహాన్ని అభిమానుల సమక్షంలో ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో విజయవాడ తూర్పు నియోజకవర్గ వైసీపీ ఇన్‌ఛార్జి దేవినేని అవినాష్,విజయవాడ డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ పాల్గొన్నారు. ఆయన ప్రిన్స్ మహేశ్ బాబు- కృష్ణ అభిమానుల ఆహ్వానం మేరకు కమల్ హాసన్ అక్కడకు హాజరయ్యారు. గత రెండురోజులుగా ఇండియన్-2 చిత్రం షూటింగ్ విజయవాడలో జరుగుతుంది. సూపర్ స్టార్ విగ్రహాన్ని ఆవిష్కరించడంపై కమల్ ఆనందం వ్యక్తం చేశారు. పదిరోజుల వ్యవధిలోనే కృష్ణ విగ్రహ ఏర్పాటుకు సహకరించిన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గారికి కృష్ణ కుటుంబ సభ్యులు తరపున దేవినేని అవినాష్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. భారీ సంఖ్యలో ఈ కార్యక్రమంలో కృష్ణ -మహేశ్ ఫ్యాన్స్ పాల్గొన్నారు. తెలుగు ప్రజలందరి అభిమాన నటుడు కృష్ణ విగ్రహాన్ని ఇక్కడ ఆవిష్కరించడం ఆనందంగా ఉందన్నారు దేవినేని అవినాష్. అయన నట వారసుడిగా ఇండస్ట్రీ లోకి వచ్చిన మహేష్ బాబు అటు సినీరంగంతో పాటు పలు సేవా కార్యక్రమాల్లో ముందుంటు ప్రజలకు సేవ చేస్తూ.. కృష్ణ గారి గౌరవాన్ని నిలబెడుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కమల్ హాసన్ పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు. నగర ప్రజల తరపునే కాకుండా సూపర్ స్టార్ కృష్ణ, మహేష్ బాబు అభిమానుల తరపున కమల్ హాసన్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# ఓటమి భయంతోనే వైసీపీ నేతల దాడులు..

అమరావతి : వైసీపీ నేతలు ఓటమి భయంతో టీడీపీ నేతలపై దాడులకి తెగబడుతున్నారని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ట్విటర్ వేదికగా తెలిపారు. చంద్రగిరి మండలం భీమవరం టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు మునిరత్నం నాయుడుపై వైసీపీ నేత కొటాల చంద్రశేఖర్ రెడ్డి అనుచరులు హత్యాయత్నం చేయడం దారుణమన్నారు.

మునిరత్నం నాయుడు పరిస్థితి విషమంగా ఉందని తెలుస్తోందని నారా లోకేష్ అన్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని.. అన్ని విధాలా పార్టీ అండగా ఉంటుందన్నారు. వైసీపీ ఫ్యాక్షన్ పాలనలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని నారా లోకేష్ తెలిపారు.







రాజకీయ చదరంగంలో విజయం సాధించేందుకు ఒక్కొక్కరు ఒక్కో రకమైన ఎత్తుగడ వేస్తారు. ఈ క్రమంలో నేతలు తమ, పర భేదం చూడరనడానికి రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికలే నిదర్శనంగా చెప్పొచ్చు. ఆ రాష్ట్రంలోని కొన్ని నియోజకవర్గాల్లో బావ-మరదళ్లు, బాబాయ్-అమ్మాయ్.. ఇలా సమీప బంధువులే ప్రత్యర్థులుగా తలపడుతుండటంతో అక్కడి రాజకీయాలు రసవత్తరంగా మారాయి. 'ఎంత వారలైనా పదవికి దాసులే' అన్న చందంగా వారంతా నువ్వా-నేనా అన్న రీతిలో ప్రచారం నిర్వహిస్తున్నారు. దీంతో ఆయా నియోజకవర్గాల్లో ప్రజలు ఎవరివైపు మొగ్గుచూపుతారోనన్న ఉత్కంఠ నెలకొంది.

**మాజీ భార్యాభర్తల పోటీ :** రాజస్థాన్ ఎన్నికల్లో ఇప్పుడు అందరి దృష్టి సికర్ జిల్లాలోని దంతరామ్‌గఢ్ నియోజకవర్గంపై పడింది. ఇక్కడ కాంగ్రెస్ అభ్యర్థి వీరేంద్రసింగ్‌పై ఆయన మాజీ భార్య రీటా సింగ్ పోటీ చేస్తున్నారు. ఆమెకు జననాయక్ జనతా పార్టీ తాజాగా టికెట్ ఇచ్చింది. 2018లోనే ఈ దంపతులు విడిపోయారు. వీరేంద్ర తండ్రి నారాయణ్ సింగ్ ఏడు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. తొలి నుంచి వీరి కుటుంబం కాంగ్రెస్‌కు మద్దతుగా నిలుస్తోంది. రీటా సింగ్ ప్రస్తుతం జిల్లా ప్రముఖ్‌గా కొనసాగుతున్నారు. కాంగ్రెస్ టికెట్ కోసం ఆమె 2018లోనూ తీవ్రంగా ప్రయత్నించినప్పటికీ సిట్టింగ్ ఎమ్మెల్యే కావడంతో హస్తం పార్టీ వీరేంద్ర వైపే మొగ్గు చూపింది. మరోవైపు, భాజపా గజానంద్ కుమావత్‌ను ఇక్కడ బరిలో దింపింది.

**బావ-మరదళ్లు :** మరో ఆస్తకికర నియోజకవర్గం ధోలాపుర్. ఇక్కడ పోటీ చేస్తున్న బావా, మరదళ్లు అటు నుంచి ఇటు.. ఇటు నుంచి అటు పార్టీలు మారారు. శోభారాణి కుశ్వాహా గత ఎన్నికల్లో భాజపా అభ్యర్థిగా పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి శివచరణ్ కుశ్వాహాను ఓడించారు. 2020లో సచిన్ పైలట్ తిరుగుబాటు చేసిన సందర్భంలో.. ఆమె సీఎం అశోక్ గహ్లోత్‌కు మద్దతుగా నిలిచారు. రాజ్యసభ ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్‌కు పాల్పడ్డారని భాజపా ఆమెపై బహిష్కరణ వేటు వేయడంతో కాంగ్రెస్‌లో చేరారు. దాంతో హస్తం పార్టీ టికెట్ దక్కింది. మరదలికి పోటీగా శివచరణ్ ఈసారి భాజపా అభ్యర్థిగా బరిలో ఉన్నారు. సోజత్ అసెంబ్లీ నియోజకవర్గంలోనూ ఇదే పరిస్థితి కొనసాగుతోంది. కాంగ్రెస్-భాజపాలు బావా-మరదళ్లకు టికెట్లు కేటాయించాయి. మాజీ సీఎస్ నిరంజన్ ఆర్యకు కాంగ్రెస్ టికెట్ ఇచ్చింది. సీఎం అశోక్ గహ్లోత్‌కు అత్యంత సన్నిహితుడిగా ఈయనకు పేరుంది. భాజపా తరఫున ఆయన మరదలు సిట్టింగ్ ఎమ్మెల్యే శోభా చౌహాన్ బరిలో ఉన్నారు.

**బాబాయ్-అమ్మాయ్ ఢీ :** ఖేత్రి నియోజకవర్గం నుంచి భాజపా టికెట్‌పై పోటీ చేసేందుకు ధరమ్‌పాల్ గుర్జర్, ఆయన సోదరుడు దాతారామ్ గుర్జర్, దాతారామ్ తనయ మనీషా గుర్జర్‌లు చివరి నిమిషం వరకు తీవ్రంగా ప్రయత్నించారు. ఆఖరికి కమలం పార్టీ ధరమ్‌పాల్‌కు టికెట్ కేటాయించింది. దాంతో తీవ్ర అసంతృప్తికి గురైన మనీషా రెబల్‌గా పోటీకి సై అన్నారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ఆమెకు బీ ఫామ్ ఇవ్వడంతో ఇక్కడ రాజకీయం ఆసక్తికర మలుపు తిరిగింది. బాబాయ్-అమ్మాయ్ మధ్య సమరంలో నెగ్గేదెవరో చూడాలి. నాగౌర్ అసెంబ్లీ నియోజకవర్గంలోనూ ఇలాంటి పరిస్థితి నెలకొంది. కాంగ్రెస్ పార్టీ హరేంద్ర మిర్ధాను బరిలో నిలిపింది. 2009లో ఈ స్థానం నుంచి జ్యోతి మిర్ధా కాంగ్రెస్ ఎంపీగా గెలుపొందారు. 2014, 2019లో ఆమెనే ఇక్కడ నుంచి పోటీ చేశారు. తాజాగా పార్టీ మారిన జ్యోతి మిర్ధా భాజపా అభ్యర్థిగా బరిలో నిలిచారు. ఈ నేపథ్యంలో హస్తం పార్టీ ఆమె బాబాయ్‌ను తెరపైకి తీసుకొచ్చింది. దీంతో నాగౌర్‌లోనూ రక్త సంబంధీకుల మధ్య పోటీ అనివార్యంగా మారింది.

# స్కిల్ కేసులో ఉండవల్లి పిటిషన్‌పై విచారణ 29కి వాయిదా



అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో విచారణను సీబీఐకు ఇవ్వాలంటూ కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ వేసిన పిటీషన్‌పై విచారణను హైకోర్టు వాయిదా వేసింది. ఉండవల్లి పిటిషన్‌పై ఈరోజు (శుక్రవారం) హైకోర్టులో విచారణకు వచ్చింది. ఈ పిటిషన్‌పై విచారణను ధర్మాసనం ఈనెల 29కి వాయిదా వేసింది. ఈ కేసులో ప్రతివాదులకు గతంలో నోటీసులు జారీ చేయాలని ధర్మాసనం ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. దీనిపై న్యాయవాదులు కోర్టు ముందు ప్రస్తావిస్తూ... ఈ నోటీసులు అందరికీ అందలేదని పేర్కొన్నారు. నోటీసులను అందరికీ అందకపోవడంతో కేసు విచారణను హైకోర్టు ఈ నెల 29కి వాయిదా వేసింది. ఆలస్యంపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని రిజిస్ట్రీకి న్యాయమూర్తి సూచించారు. కాగా.. స్కిల్ డెవలప్‌మెంట్ కేసును సీబీఐ విచారణకు ఇవ్వాలంటూ మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ ఏపీ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. రెండు మూడు రాష్ట్రాలకు విస్తరించి ఉండటంతో కేసును సీబీఐకి ఇవ్వాలని పిటిషన్‌లో ఉండవల్లి కోరారు. ఆర్థిక పరమైన నేరం, జీఎస్టీ ఎగవేత ఉండటం, ఇప్పటికే ఈడీ కూడా విచారణ చేస్తుందని, అందువలనే సీబీఐ విచారణకు ఇవ్వాలని పిటిషన్ దాఖలు చేసినట్లు ఉండవల్లి పేర్కొన్నారు. కేంద్ర హోంశాఖ కార్యదర్శి, సీబీఐ డైరెక్టర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర సీఐడీ, ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, గంటా సుబ్బారావు, కె.లక్ష్మీనారాయణ, నిమ్మగడ్డ వెంకటకృష్ణ ప్రసాద్, డిజైన్‌టెక్ సంస్థ, ఆ సంస్థ ఎండీ వికాస్ ఖన్వేల్కర్, స్కిల్లర్ ఎంటర్ ప్రైజెస్, సీమెన్స్ మాజీ ఎండీ సుమన్ బోస్, మాజీ సీఎం చంద్రబాబు, మాజీ మంత్రి అచ్చెన్నాయుడు సహా 44మందిని తన పిటిషన్‌లో ప్రతివాదులుగా చేర్చారు.




## కాలుష్యం కోరల నుంచి దిల్లీ వాసులకు స్వల్ప ఊరట

దిల్లీ: తీవ్ర వాయు కాలుష్యంతో అల్లాడిపోతున్న దేశ రాజధాని దిల్లీ వాసులకు శుక్రవారం కాస్త ఊరట లభించింది. గురువారం అర్ధరాత్రి నుంచి కురిసిన ఓ మోస్తరు వర్షంతో ఈ ఉదయం వాయు నాణ్యత స్వల్పంగా మెరుగుపడింది. నేడు కూడా వర్షం పడే అవకాశమున్నట్లు వాతావరణ శాఖ అంచనా వేయడంతో దిల్లీ ప్రజలు కాస్త ఊపిరి పీల్చుకుంటున్నారు. పశ్చిమ గాలులు దిశ మార్చుకోవడంతో వాయువ్య భారతంలో కొన్ని చోట్ల వర్షాలు కురుస్తున్నాయి. దిల్లీ-ఎన్‌సీఆర్ ప్రాంతంలో కూడా నిన్న అర్ధరాత్రి తర్వాత నుంచి ఓ మోస్తరు వర్షం కురిసింది. దీంతో శుక్రవారం ఉదయం 7 గంటల ప్రాంతంలో దిల్లీలో సగటు గాలి నాణ్యత సూచీ 408కి తగ్గింది. నిన్న సాయంత్రం ఇది 437గా నమోదైంది. శుక్ర, శనివారాల్లో కూడా దిల్లీ - ఎన్‌సీఆర్ ప్రాంతంలో వర్షం కురిసే అవకాశముందని భారత వాతావరణ శాఖ అంచనా వేసింది. దీంతో దీపావళి (నవంబరు 12) నాటికి దిల్లీలో కాలుష్యం మరింత తగ్గే అవకాశముందని ఐఎండీ పేర్కొంది. దిల్లీలో గత వారం రోజులుగా వాయు నాణ్యత విపరీతంగా క్షీణించి ప్రమాదకర స్థాయికి పడిపోయిన విషయం తెలిసిందే. దిల్లీ అంతటా విషపూరిత పొగమంచు కమ్మేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పొరుగు రాష్ట్రాల్లో పంట వ్యర్థాలను తగలబెట్టడమే దిల్లీలో వాయు కాలుష్యానికి ప్రధాన కారణంగా కన్పిస్తోంది. ఈ నేపథ్యంలో కాలుష్య నియంత్రణకు చర్యలు చేపట్టిన దిల్లీ ప్రభుత్వం.. ఈ నెల 20న కృత్రిమ వర్షం కురిపించాలని యోచించింది. ఐఐటీ కాన్పుర్‌తో కలిసి మేఘమథనం జరిపే అంశాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లింది. ఈలోగానే వర్షాలు కురుస్తుండటం ప్రభుత్వానికి కాస్త ఉపశమనం కల్పించింది.

**సరి-బేసితో రద్దీ తగ్గుతుంది..** ఇదిలా ఉండగా.. దిల్లీలో వాయు కాలుష్యంపై ఇటీవల తీవ్ర విచారం వ్యక్తం చేసిన సుప్రీంకోర్టు.. కాలుష్య నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలని దిల్లీ సహా పొరుగు రాష్ట్రాలను ఆదేశించింది. ఈ క్రమంలోనే దిల్లీ ప్రభుత్వం ప్రకటించిన 'సరి-బేసి' విధానంపై అసంతృప్తి వ్యక్తం చేసింది. ఇలాంటి విధానాలు తక్కువ ఫలితాలను ఇస్తాయని పేర్కొన్న సుప్రీం.. దానిపై వివరణ ఇవ్వాలని దిల్లీ ప్రభుత్వాన్ని ఆదేశించింది.

ఈ నేపథ్యంలోనే నేడు ఆప్ సర్కారు న్యాయస్థానానికి అఫిడవిట్ దాఖలు చేసింది. సరి-బేసి విధానం వల్ల రహదారులపై రద్దీ తగ్గుతుందని దిల్లీ ప్రభుత్వం పేర్కొంది. "సరి-బేసి విధానం సానుకూల ప్రభావం చూపుతుందని శాస్త్రీయ అధ్యయనాలు వెల్లడించాయి. దీని ద్వారా ప్రజా రవాణా వినియోగం పెరగడంతో పాటు 15శాతం ఇంధన వినియోగం తగ్గుతుంది. రోడ్లపై రద్దీ కూడా తగ్గడంతో కాలుష్యం కూడా నియంత్రణలో ఉంటుంది" అని కోర్టుకు తెలియజేసింది.




ఒకప్పుడు అమాయకుల హత్యలకు కుట్రలు పన్ని భయోత్పాతం సృష్టించిన పాక్ ఉగ్రవాదులకు కంటిమీద కునుకు లేకుండా పోయింది. పాక్‌లో కొందరు గుర్తుతెలియని వ్యక్తులు వరుసగా వారిని హత్య చేస్తుండటంతో.. చాలా మంది రహస్య ప్రదేశాల్లో దాక్కుంటున్నారు. తాజాగా పాక్‌లోని లష్కరే తోయిబా ఉగ్రనేత అక్రమ్ ఖాన్ ఘాజీని కొందరు గుర్తుతెలియని వ్యక్తులు కాల్చి చంపారు. దాదాపు 20 నెలల్లో హత్యకు గురైన 19వ ఉగ్రవాది ఇతడు. అక్రమ్ ఖాన్ 2018-2020 మధ్యలో లష్కరే తోయిబా ఉగ్ర సంస్థకు అవసరమైన నియామకాలు చేపట్టేవాడు. గత రెండేళ్లుగా కశ్మీర్ లోయలోకి చొరబడుతున్న ఉగ్ర బృందాలకు ఇతడు భారత్‌పై విద్వేషపూరిత పాఠాలు చెబుతున్నాడు. నేడు ఖైబర్ పక్తూన్‌ఖ్వా ప్రావిన్స్‌లో బజార్ జిల్లాలో బైకుపై వచ్చిన ఇద్దరు వ్యక్తులు అక్రమ్ ఖాన్‌ను కాల్చి చంపినట్లు ఆంగ్లపత్రిక టైమ్స్ ఆఫ్ ఇండియా పేర్కొంది. ఈ విషయాన్ని వీలైనంత వరకు బయటకు రాకుండా చూడాలని పాక్ నిఘా సంస్థ ఐఎస్ఐ ప్రయత్నించినట్లు తెలిపింది. ఈ హత్యతో అప్రమత్తమైన పాక్ దర్యాప్తు సంస్థలు రంగంలోకి దిగాయి. స్థానిక ప్రత్యర్థులు, ఇతర ఉగ్ర గ్రూపుల పాత్ర, లష్కరేలో అంతర్గత విభేదాలు వంటి కోణాలను పరిశీలిస్తున్నారు. గత మూడునెలల్లో లష్కరేకు చెందిన టాప్ కమాండర్లు హతం కావడం ఇది రెండోసారి. సెప్టెంబర్‌లో పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని రావల్‌కోట్‌లో ఒక మసీదు బయట లష్కరే సీనియర్ కమాండర్ రియాజ్ అహ్మద్‌ను కాల్చి చంపారు. పాక్ నిఘా సంస్థ ఐఎస్ఐ నియంత్రణలోనే లష్కరే సంస్థ పనిచేస్తుందన్న విషయం తెలిసిందే. ఈ వారంలో హత్యకు గురైన షాహిద్ ఖ్వాజా కూడా లష్కరే ఉగ్రవాదే. ఇతడు 2018న భారత్‌లో సుంజ్వాన్ సైనిక క్యాంప్‌పై దాడికి సూత్రధారి. ఈ వరుస హత్యల్లో ఉగ్రసంస్థ జైషే మహమ్మద్‌కు కూడా భారీ దెబ్బలు తగిలాయి. గత నెలలో జైషే చీఫ్ మసూద్ అజర్‌కు అత్యంత సన్నిహితుడైన దావుద్‌మాలిక్‌ను నార్త్ వజీరిస్థాన్‌లో పట్టపగలు గుర్తు తెలియని వ్యక్తులు కాల్చిచంపారు. ఇక హిజ్బుల్ చీఫ్ హఫీజ్ సయీద్ సన్నిహితడు ముఫ్తీ ఖైజర్ ఫారుఖీని కరాచీ నడిబొడ్డున హత్య చేశారు. ఈ ఘటన లష్కరే ఉగ్ర సంస్థకు పెద్ద ఎదురుదెబ్బగా మారింది. ఐసీ-814 విమానం హైజాక్‌లో కీలక పాత్ర పోషించిన జైషే ఉగ్రవాది మిస్త్రీ జహూర్ ఇబ్రహీంను కూడా పాయింట్ బ్లాంక్ రేంజిలో కాల్చి చంపారు. ఈ వరుస ఘటనలు పాక్ నిఘా సంస్థ ఐఎస్ఐను ఉక్కిరిబిక్కిరి చేశాయి. పదుల సంఖ్యలో ఉగ్రవాదులను సురక్షిత ప్రాంతాలకు తరలించింది. ఇక మే నెలలో ఖలిస్థానీ కమాండో ఫోర్స్ అధినేత పరంజీత్ సింగ్ పన్వార్‌ను కొందరు గుర్తు తెలియని వ్యక్తులు లాహోర్‌లో కాల్చిచంపారు. జైషే ఉగ్ర సంస్థ ఆత్మాహుతి దాడి బృందానికి చీఫ్ హ్యాండిలర్‌గా ఉన్న షాహిద్ లతీఫ్‌ను అక్టోబర్‌లో గుర్తుతెలియని వ్యక్తులు హత్య చేశారు. ఇతడి బృందమే పంజాబ్‌లోని పఠాన్‌కోట్ ఎయిర్ బేస్‌పై దాడిచేసింది.

# బైజూస్‌కు ఎదురుదెబ్బ.. ఎగవేత కేసులో రుణదాతల విజయం!




వాషింగ్టన్: ఆర్థిక కష్టాల్లో చిక్కుకున్న ఎడ్‌టెక్ సంస్థ బైజూస్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. కంపెనీకి చెందిన ఓ యూనిట్‌ను రుణదాతల గ్రూప్ తమ అధీనంలోకి తీసుకోవడాన్ని డెలావెర్ ఛాన్సరీ కోర్టు సమర్థించింది. బైజూస్ పలుసార్లు రుణ చెల్లింపు నిబంధనలను ఉల్లంఘించిందని నిర్ధారించింది. బైజూస్‌కు రెడ్‌వుడ్ ఇన్వెస్ట్‌మెంట్స్, సిల్వర్ పాయింట్ క్యాపిటల్ సహా మరికొన్ని సంస్థలు 1.2 బిలియన్ డాలర్ల రుణాన్ని అందజేశాయి. కానీ, కొవిడ్ తర్వాత ఎడ్‌టెక్ బిజినెస్ దెబ్బతినడంతో కష్టాల్లో కూరుకుపోయిన బైజూస్ వాయిదాలను సకాలంలో చెల్లించలేకపోయింది. ఇది రుణ ఎగవేతకు దారితీసింది. ఫలితంగా నిబంధనల ప్రకారం.. రుణదాతలు ఎంపిక చేసిన టిమోతీ పోల్ అనే వ్యక్తి కంపెనీకి చెందిన 'బైజూస్ ఆల్ఫా'లో ఏకైక డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ నియామకం రుణ షరుతల ప్రకారమే జరిగినట్లు తాజాగా కోర్టు తేల్చింది. ఆయన నియామకాన్ని సవాల్ చేస్తూ బైజూస్ వేసిన పిటిషన్‌ను కొట్టివేసింది. రోజురోజుకీ బైజూస్ ఆర్థిక కష్టాలు పెరిగిపోతున్న నేపథ్యంలో 1.2 బిలియన్ డాలర్ల రుణాన్ని వసూలు చేసుకోవడం కోసం రుణదాతులు తీవ్ర ఒత్తిడి తెస్తున్నారు. ఈ క్రమంలో కంపెనీ రుణ అవసరాల నిమిత్తం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 'స్పెషల్ పర్పస్ వెహికల్ బైజూస్ ఆల్ఫాను తమ ప్రయోజనాలను రక్షించేలా హోల్డింగ్ కంపెనీలా మార్చినట్లు రుణదాతల తరఫు న్యాయవాది తెలిపారు. ఎడ్‌టెక్ కంపెనీని పూర్తిగా టేకోవర్ చేయడం తమ ఉద్దేశం కాదని స్పష్టం చేశారు.

## ఫ్యాన్స్ మర్చిపోకుండా ప్రగ్యా ట్రిక్కు

ఇంతకీ కంచె బ్యూటీ ప్రగ్యా జైశ్వాల్ ఏమైంది? ఆడినన్నాళ్లు ఆడింది.. కానీ ఇప్పుడు టిటౌన్ లో కనిపించడం లేదు. ఎక్కడ ఏం ఆడుతోందో కూడా తెలీదు! అంటూ టాలీవుడ్ కుర్రాళ్లు ఆట పట్టిస్తున్నారు ప్రగ్యాని. కంచె లాంటి హిట్ సినిమాలో నటించినా బాలయ్య సరసన అవకాశం దక్కించుకున్నా కానీ ఈ భామ ఫేట్ మారలేదు. తనకు లక్ ఫేవర్ చేయలేదు. అందుకే ఇటీవల తెలుగు పరిశ్రమ నుంచి ఈ భామ దూరమైంది. అయితే సినిమాలు చేయకున్నా కానీ, ప్రగ్య నిరంతరం వేడెక్కించే ఫోటోషూట్లను షేర్ చేస్తూ సోషల్ మీడియాల్లో అభిమానులకు టచ్ లో ఉంది. తాజాగా వైట్ బ్లేజర్ లో టాప్ లెస్ ఫోజులతో షేక్ చేసిన ఫోటోషూట్ వీడియో ఇంటర్నెట్ ని షేక్ చేస్తోంది. బ్లేజర్ కి తగ్గట్టుగా ఆ బాటమ్ వెరైటీగా షార్ట్ లుక్ తో కనిపించడంతో ఏదో సంథింగ్ స్పెషల్ గా ట్రై చేసిందని అభిమానులకు అర్థమవుతోంది. ఒకవేళ మీరు మర్చిపోతే.. ! అంటూ సస్పెన్స్ క్యాప్షన్



ని ఈ ఫోటోకి జోడించింది. అయితే సీకే బ్యూటీ ప్రగ్యను అంత తేలిగ్గా మర్చిపోలేం అంటూ అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. ప్రగ్య జైశ్వాల్ 2014లో సినీ అరంగేట్రం చేసినప్పటి కెరీర్ పరంగా ఆశించిన స్థాయికి ఎదుగలేదు. మోహన్ బాబు -నందమూరి బాలకృష్ణ వంటి స్టార్లతో పనిచేసినా ఇదీ కలిసి రాలేదు. అయితే ఫ్యాషనిస్టాగా అనుచరుల అంచనాలను అందుకోవడంలో ఎప్పుడూ విఫలం కాలేదు. తాజాగా వైట్ అండ్ వైట్ లో కొత్త లుక్ తో ఆకట్టుకుంది. దీనికి ముందు, ప్రగ్యా సాంప్రదాయ దసరా లుక్‌తో తన అనుచరులను మెస్మరైజ్ చేసింది. ప్రగ్యా జైస్వాల్ 2014లో తమిళ చిత్రం విరాట్టులో తొలిసారిగా నటించింది. మరుసటి సంవత్సరం తెలుగు సినీపరిశ్రమలోకి ప్రవేశించింది. మిర్చి లాంటి కుర్రాడులో నటించింది. క్రిష్ దర్శకత్వం వహించిన పీరియాడికల్ డ్రామా కంచెలో తన పాత్రకు గుర్తింపు పొందింది. ఆసక్తికరంగా తొలిగా క్రిష్ గబ్బర్ ఈజ్ బ్యాక్ కోసం ఆడిషన్ లో పాల్గొంది. కానీ ఆ పాత్రను దక్కించుకోలేకపోయింది. తర్వాత కంచెలో నటించింది. ఆ తర్వాత జయ జానకి నాయకలో అతిధి పాత్రలో కనిపించింది. భక్తిరస జీవిత చరిత్ర చిత్రం ఓం నమో వేంకటేశాయ (2017)లో ఆనందం పాటలో కనిపించింది. ప్రగ్యా జైస్వాల్ ఇటీవలి ఎన్బీకే అఖండలో నటించింది. ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా సుమారుగా రూ. 133 కోట్ల గ్రాస్ వసూలు చేసింది.

## సీతారామం కొనసాగిస్తారా..?

హను రాఘవపూడి డైరెక్షన్ లో దుల్కర్ సల్మాన్, మృణాల్ ఠాకూర్ లీడ్ రోల్ లో వచ్చిన సినిమా సీతారామం. 2022 ఏడాది క్రితం రిలీజైన ఈ సినిమా మరోసారి వైజయంతి బ్యానర్ వ్యాల్యూని నిలబెట్టింది. వైజయంతి మూవీస్ బ్యానర్ లో అశ్వనిదత్, స్వప్న, ప్రియాంకా దత్ లు ఈ సినిమా నిర్మించారు. అప్పటికే మహానటితో హిట్ అందుకున్న దుల్కర్ తో సీతారామం సినిమా చేశారు ఈ నిర్మాతలు. మహానటి సినిమా కూడా ఈ నిర్మాణ సంస్థ నుంచే వచ్చింది. ఆ నమ్మకంతోనే దుల్కర్ మీద మరోసారి పాతిక కోట్ల పైన బెట్ పెట్టారు అశ్వనిదత్. డైరెక్టర్ హను రాఘవపూడి కూడా సక్సెస్ లో ఉన్న డైరెక్టర్ కూడా కాదు అయినా కూడా సినిమా కథ మీద ఉన్న నమ్మకంతో సినిమాకు భారీ బడ్జెట్ కేటాయించారు. ఈ సినిమాతోనే మృణాల్ ఠాకూర్ తెలుగు తెరకు పరిచయమైంది. బాలీవుడ్ లో సీరియల్స్ చేస్తూ వచ్చి సినిమా ఛాన్స్ లు అందుకున్న ఆమె హృతిక్ రోషన్ సూపర్ 30లో నటించి మెప్పించింది. ఆ సినిమాలో మృణాల్ ని చూసే హనుకి సీతారామం లో సీత ఆమె అయితేనే పర్ఫెక్ట్ అని



ఫిక్స్ చేశారు. సీతారామం సినిమా ఏ ముహుర్తాన ఒప్పుకుందో కానీ మృణాల్ ఫేట్ మారిపోయిందని చెప్పొచ్చు. వరుస సినిమాలతో ఇటు తెలుగు అటు హిందీలో అదరగొట్టేస్తుంది మృణాల్. సీతారామం హిట్ తర్వాత ఈ సినిమా కథని కొనసాగించేలా హనుకి ఒక ఆలోచన ఉందట. అయితే అది ఇప్పుడప్పుడే మెటీరియలైజ్ అవ్వదు కానీ కొంత టైం తీసుకున్నా సరే కచ్చితంగా సీతారామం సినిమా కొనసాగింపు ఉంటుందని అది కూడా నెక్స్ట్ లెవెల్ లో ఉండబోతుందని హను రాఘవపుడి ఒకానొక సందర్భంలో చెప్పారు. సీతారామం పార్ట్ 2 కూడా ఉంటే ఆ సినిమాను ఇష్టపడే ఫ్యాన్స్ కి పండుగే అని చెప్పొచ్చు. ఆల్రెడీ మహానటితో తెలుగులో మంచి మార్కెట్ ఏర్పరచుకున్న దుల్కర్ సల్మాన్ సీతారామం హిట్ తో ఇక్కడ స్టార్ క్రేజ్ తెచ్చుకున్నాడు. తెలుగులో తనకు అన్ని సాఫ్ట్ క్యారెక్టర్స్ మాత్రమే ఇస్తున్నారు అని కింగ్ ఆఫ్ కోట అనే మాస్ సినిమాతో వస్తున్నారు దుల్కర్ సల్మాన్. ఆ సినిమా దుల్కర్ నుంచి వస్తున్న తొలి పాన్ ఇండియా సినిమా అని చెప్పొచ్చు. ఇదే కాదు తెలుగులో కూడా ఒకటి రెండు కథలు దుల్కర్ తో చర్చలు జరుగుతున్నాయట.




## ఆకుపచ్చ చీరలో అగ్గి రాజేసింది







సయీ మంజ్రేకర్ పరిచయం అవసరం లేదు. 'దబాంగ్ 3'లో నటించిన ఈ బ్యూటీ తనదైన అందం నటప్రతిభతో మురిపించింది. ఆ తర్వాత అడివి శేష్ నటించిన పాన్ ఇండియా బ్లాక్ బస్టర్ మేజర్ తో సయీ మంజ్రేకర్ పేరు మార్మోగింది. సల్మాన్ బావగారైన ఆయుష్మాన్ సరసనా ఈ బ్యూటీ నటించింది. అయితే రామ్ సరసన నటించిన స్కంధ బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్ అవ్వడం సయీని తీవ్రంగా నిరాశపరిచింది. అయితే జయాపజయాలతో సంబంధం లేకుండా సయీ మంజ్రేకర్ పాన్ ఇండియాలో అభిమానులను సంపాదించుకుంది. సయీ అందం మతులు చెడగొడుతుంది అనేందుకు తాను షేర్ చేస్తున్న ఇన్ స్టా వీడియోలే సాక్ష్యం. తాజాగా సయీ మంజ్రేకర్ స్టన్నింగ్ శారీ లుక్ వీడియో వెబ్ ని షేక్ చేస్తోంది. సింపుల్ గా పచ్చ చీరలో సయీ చిరునవ్వులు చిందిస్తూ కెమెరాలకు ఫోజులిచ్చిన తీరు కుర్రకారు హృదయాల్ని టచ్ చేస్తోంది. ప్రస్తుతం ఈ ఫోటోషూట్ అంతర్జాలంలో వైరల్ గా మారింది. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో సయీ మంజ్రేకర్ తన ఆలోచనలను ఓపెన్ గా షేర్ చేసింది. సాయి మంజ్రేకర్ మాట్లాడుతూ.. తన సమకాలీనులనుంచి తాను చాలా నేర్చుకుంటానని నిజాయితీగా అంగీకరించింది. సహచర నాయికల సినిమాలు, ఇంటర్వ్యూలను చూసి ప్రేరణ పొందుతానని తెలిపింది. దబాంగ్ 3తో అరంగేట్రం చేసిన సయీ మంజ్రేకర్ తన సమకాలీనులైన సారా అలీ ఖాన్, జాన్వీ కపూర్ , అనన్య పాండే వంటి వారి నుండి ప్రేరణ పొందానని చెప్పింది. సయీ నటుడు మహేష్ మంజ్రేకర్ కుమార్తె. సయీ సమకాలీనుల తప్పుల నుండి నేర్చుకోవడం గురించి మాట్లాడింది."సారా, అనన్య (పాండే), తారా (సుతారియా), జాన్వి (కపూర్) వంటి వారు అందరూ విభిన్న మార్గాల్లో చాలా ప్రతిభావంతులు. మేమంతా కలిసి అందించడానికి చాలా ఉన్నాయి. నేను ప్రతి ఒక్కరినీ గౌరవిస్తాను ..వారి తప్పుల నుండి నేర్చుకునేందుకు .. వారి నుంచి మంచి పాయింట్లను నోట్ చేసుకోవడానికి వారి అన్ని ఇంటర్వ్యూలను చాలాసార్లు చూశాను. నేను వారిని లైమ్‌లైట్‌లో చూడటం కూడా నేర్చుకున్నాను.. అని తెలిపింది. నేర్చుకునే స్వభావం ఉన్న వారు ఏ రంగంలోనైనా ఎదిగేందుకు ఛాన్సుంది. అయితే కొన్నిటికి కాలమే సమాధానం. సయీ మంజ్రేకర్ కి కెరీర్ పరంగా లక్ అంతగా ఫేవర్ చేయలేదు. మేజర్ చిత్రంతో పాన్ ఇండియాలో బ్లాక్ బస్టర్ అందుకున్నా తెలుగులో ఆశించినన్ని అవకాశాలు రాలేదు. మునుముందు తనలోని తప్పుఒప్పుల్ని స్టడీ చేసి సరిదిద్దుకునే ప్రయత్నం చేస్తుందేమో చూడాలి. స్కంధ తర్వాత రెండు హిందీ చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉంది ఈ బ్యూటీ. కుచ్ కట్టా హెూ జావ్ - ఆరోన్ మై కహా దమ్ థా.. చిత్రాల్లో నటిస్తోంది. త్వరలో ఇవి రిలీజ్ కి రానున్నాయి.

## 500 కోట్లతో విలాసాల విల్లా కొనుక్కున్న గాయని





ప్రముఖ పాప్ గాయని జెన్నిఫర్ లోపెజ్ (జెలో) కొత్త ఇంటి ఖరీదు ఆశ్చర్యపరుస్తోంది. సుమారు 500 కోట్ల (60 మిలియన్ డాలర్ల) ఖరీదు చేసే ఈ భవనం లోపల నుండి అరుదైన ఫోటోలను జెన్నిఫర్ అభిమానుల కోసం సోషల్ మీడియాల్లో షేర్ చేసింది. ఎట్టకేలకు తన భర్త బెన్ అఫ్లెక్‌తో నివశించే మెగా మాన్షన్ లుక్ అభిమానల్లో వైరల్ అయింది. శనివారం లాస్ ఏంజిల్స్‌లో స్వాష్ లాక్మా గూచీ ఈవెంట్‌కు సిద్ధమవుతున్నప్పుడు జెన్నిఫర్ తన ఇంటి హాలులో పోజులిచ్చిన ఫోటోలు వైరల్ అయ్యాయి. వీటిలో ఖరీదైన ఇంటి తాలూకా పచ్చని ఇంటీరియర్ రూపం బయటపడింది. భర్త బెన్ తో కలిసి జెన్నిఫర్ ఈ సంవత్సరం మేలో ఈ ఇంటిని కొనుగోలు చేసారు. అయితే తన సూపర్‌సైజ్డ్ నివాసంలో జెలో కనిపించడం ఇదే మొదటిసారి కాదు. అక్కడి స్థానికులు కూడా ఆమె వంటగదిలో వీడియోలు తీసి షేర్ చేయగా అవి వైరల్ అయ్యాయి. ఆ సమయంలో తన గదిలో డాబాపై ..ఇన్ఫినిటీ పూల్ వీక్షణలతో జెలో పోజులిచ్చారు. హాలీవుడ్ పవర్ కపుల్ జెలో-బెన్ ఈ సంవత్సరం ప్రారంభంలో ఇంటిని కొనుగోలు చేసారు. ఈ వేసవిలో JLo అన్ని అలంకరణలను పర్యవేక్షిస్తుంది. ఆసక్తికరంగా ఈ కొత్త ఇంటి ఫోటోలను జెలోతో పాటు బెన్ కూడా తన వారితో షేర్ చేస్తుంటారు. లోపెజ్ యుక్తవయస్సు కవలలు మాక్స్ -ఎమ్మెలు కూడా తమ తండ్రి (మాజీ భర్త మార్క్ ఆంథోనీ)తో కొత్త ఇంటి ఫోటోలను షేర్ చేసుకున్నారు. బెన్ తన ముగ్గురు పిల్లలు - వైలెట్, సెరాఫినా, శామ్యూల్‌లతో కస్టడీని విభజించాడు. తమ పిల్లలతో మంచి అనుబంధం కలిగి ఉన్నాడు. TMZ వివరాల ప్రకారం.. ఈ వేసవిలో 46,000 చదరపు అడుగుల భవనం కోసం 60.85 మిలియన్ డాలర్లను చెల్లించారు. ఒప్పందం పూర్తి కావడానికి కేవలం ఒక వారం మాత్రమే పట్టింది. ఈ జంట $75 మిలియన్ల రేటు చెప్పగా, దాదాపు $15 మిలియన్లు చెల్లించి ఈ ఇంటిని కొనుగోలు చేసారు. నిజానికి ఈ ఇల్లు మొదటిసారిగా 2018లో $135 మిలియన్లకు మార్కెట్‌లోకి వచ్చింది. అయితే ఈ సంవత్సరం పునఃసమీక్ష అనంతరం ఆ ధర దాదాపు సగానికి తగ్గిపోయింది. వాల్లింగ్‌ఫోర్డ్ ఎస్టేట్ పేరుతో నిర్మించిన ఈ ఇల్లు 5 ఎకరాల ప్రాంగణంలో ఉంది. ఇందులో 12 బెడ్‌రూమ్‌లు .. 24 బాత్‌రూమ్‌లు ఉన్నాయి. 12-కార్ల గ్యారేజీని .. 80 వరకూ కార్ల పార్కింగ్‌ను కలిగి ఉంది. మైదానంలో ఒక ఒక రకమైన ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్, 5,000 చదరపు అడుగుల గెస్ట్ పెంట్‌హౌస్, కేర్‌టేకర్ హౌస్, రెండు పడకగదుల గార్డు హౌస్ కూడా ఉన్నాయి. ఇండోర్ స్పోర్ట్స్ సౌకర్యం, వ్యాయామశాలతో పాటు బాస్కెట్‌బాల్, పికిల్‌బాల్ బాక్సింగ్ రింగ్ కోసం కోర్టులు ఉన్నాయి. ఇందులోనే పూర్తి హెయిర్ అండ్ నెయిల్ సెలూన్, హెూమ్ థియేటర్, వైన్ సెల్లార్, విస్కీ లాంజ్, అలాగే ఆవిరి స్నానాల రూమ్, మసాజ్ గదులు కూడా ఉన్నాయని TMZ నివేదించింది. జీరో ఎడ్జ్ పూల్ ప్రధాన ఇంటి వెనుక ఉంది. కాటి పెర్రీ - మడోన్నాతో కలిసి పనిచేసిన బ్రెట్ లాయర్ - ఈ సేల్‌లో జెన్నిఫర్ లోపేజ్ కి సాయం చేసారు. అక్టోబరులో బెన్- జెన్నిఫర్‌ల కొత్త నివాసంలోకి ఫర్నీచర్ నిల్వలు తరలించారు. వారు ఇంతకుముందు పసిఫిక్ పాలిసాడ్స్ ప్రాంతంలోని ఇతర ఇంటిని కొనుగోలు చేయాలని అనుకున్నారు. దాని విలువ $34.5 మిలియన్లు. ఆ ఆస్తి ఏడు బెడ్‌రూమ్‌లు - 13 బాత్‌రూమ్‌లను కలిగి ఉంది.

## 'మంగళవారం' లో పాయల్ చాలా తేడా..!

పాయల్ రాజ్ పూత్ కీలక పాత్రలో ఆర్ఎక్స్ 100 దర్శకుడు అజయ్ భూపతి దర్శకత్వంలో రూపొందిన తాజా చిత్రం 'మంగళవారం'. ఈ సినిమా పై మొన్నటి వరకు పెద్దగా జనాల్లో అంచనాలు ఆసక్తి లేదు. కానీ గత రెండు వారాలుగా సినిమా గురించి చేస్తున్న ప్రచారం, మరియు జరుగుతున్న ప్రచారం కారణంగా అంచనాలు ఆకాశానికి తాకేలా వస్తున్నాయి. మంగళవారం సినిమాలో పాయల్ రాజ్ పూత్ పాత్ర గురించి ఆసక్తికర పుకార్లు షికార్లు చేస్తున్నాయి. దర్శకుడు అజయ్ భూపతి ఆర్ఎక్స్ 100 సినిమాలో పాయల్ రాజ్ పూత్ ను హీరోయిన్ గా చూపిస్తూనే నెగటివ్ షేడ్స్ తో చూపించాడు. దాంతో ఆ సినిమా పాయల్ రాజ్ పూత్ కెరీర్ కి ఏ



స్థాయిలో బూస్ట్ ను ఇచ్చిందో అందరికి తెల్సిందే. ఇప్పుడు మంగళవారం సినిమాలోని పాయల్ పాత్ర కూడా అదే రేంజ్ లో ఉంటుందట. ఈ చిత్రంలో పాయల్ అరుదైన వ్యాధితో బాధ పడుతూ ఉంటుందట. ఆ సమస్య కారణంగా పాయల్ చిత్ర విచిత్రంగా, చాలా తేడాగా ప్రవర్తిస్తూ ఉంటుందని యూనిట్ సభ్యుల ద్వారా సమాచారం అందుతోంది. మొత్తానికి పాయల్ కి ఆర్ ఎక్స్ 100 సినిమా తర్వాత మళ్లీ తన నట విశ్వరూపం చూపించే విధంగా అవకాశం అయితే లభించింది. తాను ఈ అవకాశంను సద్వినియోగం చేసుకుంది అంటూ ప్రమోషన్ సందర్భంగా యూనిట్ సభ్యులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 17న విడుదల అవ్వబోతున్న మంగళవారం సినిమా పాయల్ కి మళ్లీ బూస్ట్ ఇచ్చి వరుస సినిమాల్లో నటించేలా చేసేనా చూడాలి.

## అమలా పాల్ ఏం చేసినా లాభం ఉండట్లేదు..!

ఒకప్పుడు కోలీవుడ్ లో సూపర్ ఫాంలో ఉన్న అమలా పాల్ డైరెక్టర్ విజయ్ తో పెళ్లి డైవర్స్ మ్యాటర్ తో అమ్మడి ఫాం పూర్తిగా కోల్పోయింది. ఇప్పుడంటే పెళ్లైన హీరోయిన్స్ కి డిమాండ్ తగ్గలేదు కానీ ఆమె డైవర్స్ తీసుకున్న టైం లో అది కూడా వివాదాలతో కూడిన డైవర్స్ చేసుకోవడం వల్ల అది ఆమె కెరీర్ మీద ఎఫెక్ట్ పడేలా చేసింది. పెళ్లికి ముందు స్టార్ ఛాన్స్ లు అందుకున్న అమలా పాల్ ఆఫ్టర్ డైవర్స్ అరకొర అవకాశాలే అందుకుంది. అయితే వచ్చిన ప్రతి చిన్న అవకాశాన్ని వాడుకోవాలని చూసిన అమలా పాల్ తన మార్క్ చూపించడంలో వెనకబడింది. అమలా పాల్ సెకండ్ ఇన్నింగ్స్ అంత సంతృప్తిగా లేదని చెప్పొచ్చు. ఆమె చేస్తున్న సినిమాలేవి ఆశించిన ఫలితాలను అందుకోలేదు. సినిమాలే కాదు వెబ్ సీరీస్ లతో కూడా అమలా పాల్ ఆకట్టుకునే ప్రయత్నం చేసినా అది కూడా వర్క్ అవుట్



అవలేదు. అంతకుముందు కుడి ఎడమైతే సీరీస్ తో పర్వాలేదు అనిపించుకున్న అమలా పాల్ రీసెంట్ గా కడవర్ సినిమాతో కూడా సక్సెస్ అందుకుంది. ప్రస్తుతం తమిళ, హిందీ, మలయాళ భాషల్లో తనకు వచ్చిన అవకాశాలను చేస్తుంది అమ్మడు. ఇక మరోపక్క తన ఫోటో షూట్స్ తో కూడా ఫాలోవర్స్ ని ఎట్రాక్ట్ చేసే పనిలో ఉంది అమలా పాల్. ఆమె చేస్తున్న ఈ ఫోటో షూట్స్ వల్ల అమ్మడికి మంచి మైలేజ్ వస్తాయని అనుకున్నా అవి కూడా పెద్దగా అవకాశాలు తీసుకురాలేకపోతున్నాయి. తెలుగులో అమలా పాల్ ని ఫాలో అయ్యే ఫ్యాన్స్ ఉన్నారు. టాలీవుడ్ లో చరణ్ తో ఒక సినిమా నాగ చైతన్యతో మరో సినిమా చేసిన అమలా పాల్ ఆ రెండు సినిమాలతోనే మంచి ఫాలోయింగ్ ఏర్పరచుకుంది. తెలుగులో కొనసాగించే ఆలోచన లేని అమలా పాల్ తమిళ సినిమాలనే చేస్తూ వచ్చింది. పర్సనల్ లైఫ్ లో జరిగే విషయాల పట్ల కథానాయికల కెరీర్ ఎఫెక్ట్ అవుతుంది అని అమలా పాల్ లైఫ్ చూస్తే అర్థమవుతుంది. ఇప్పటికీ ఆడియన్స్ లో తన ఐడెంటిటీని కాపాడుకునేందుకు అమలా పాల్ చాలా ప్రయత్నాలు చేస్తుంది కానీ అవేవి పెద్దగా లాభం చేయట్లేదు. అమలా పాల్ చేస్తున్న ఫోటో షూట్స్ అయితే ఆమె ఫాలోవర్స్ ని మాత్రం ఎంజాయ్ చేసేలా చేస్తున్నాయి. ఈ ఇయర్ మలయాళం లో రెండు సినిమాలు చేస్తున్న అమలా పాల్ సౌత్ లో మరిన్ని ఆఫర్స్ కోసం తెగ ప్రయత్నాలు చేస్తుంది.




# తెలంగాణలో ముగిసిన నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ.. అఫిడవిట్లు లేకుండా 100 మంది?

హైదరాబాద్: తెలంగాణ శాసనసభ ఎన్నికలకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ పూర్తైంది. నవంబర్ 3వ తేదీన ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన వెంటనే నామినేషన్ల ప్రక్రియ మొదలుకాగా.. ఇవాళ మధ్యాహ్నం 3 గం.తో అది ముగిసింది. ఇవాళ నామినేషన్ల దాఖలుకు చివరిరోజు కావడంతో ఆర్డీవో ఆఫీస్‌ల వద్ద అభ్యర్థుల కోలాహలం కనిపించింది. తెలంగాణలో నిన్న దాకా వరకు మొత్తం 2,474 నామినేషన్లు దాఖలు కాగా.. ఇవాళ చివరిరోజు వెయ్యికి పైగా నామినేషన్లు దాఖలై ఉంటాయని అంచనా. ఈ మధ్యలో నిన్న(నవంబర్ 9) ప్రముఖ నేతలు ఎక్కువ సంఖ్యలో నామినేషన్లు వేశారు. ఎన్నికల సంఘం నోటిఫికేషన్ ప్రకారం.. ఈ నెల 13వ తేదీన నామినేషన్ల పరిశీలన ఉంటుంది. అభ్యర్థులు 15వ తేదీలోపు తమ నామినేషన్లు ఉపసంహరించుకోవచ్చు. మరోవైపు బీ-ఫామ్ సబ్మిట్‌కు సైతం గడువు ముగిసింది. బీ-ఫామ్ సమర్పించని అభ్యర్థుల్ని స్వతంత్ర అభ్యర్థులుగా ప్రకటిస్తుంది ఎన్నికల సంఘం. అలాగే నామినేషన్ సమయంలో వందకు పైగా అభ్యర్థులు అఫిడవిట్లు సమర్పించలేదు. దీంతో వాళ్లకు రిటర్నింగ్ ఆఫీసర్లు నోటీసులు ఇచ్చినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉంటే.. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలోని 119 నియోజకవర్గాలకు 94 రాజకీయ పార్టీలతోపాటు స్వతంత్ర అభ్యర్థులు కలిపి 2,644 నామినేషన్లు దాఖలయ్యాయి. తాజా గణాంకాల ప్రకారం.. ఈసారి నామినేషన్ల సంఖ్యే ఎక్కువే ఉండొచ్చని స్పష్టమవుతోంది. తెలంగాణలో 119 అసెంబ్లీ స్థానాలకు ఈ నెల 30వ తేదీన పోలింగ్ జరగనుంది. తెలంగాణ ఏర్పడ్డాక జరుగుతున్న మూడో శాసనసభ ఎన్నికల్లో 3.17 కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. డిసెంబర్ 3వ తేదీన కౌంటింగ్ నిర్వహణ, ఫలితాల వెల్లడి ఉంటుంది.




# ప్రచారంలో అదరగొడుతున్న నేతలు

సమయానుకూలంగా సామెతలు.. పంచ్ డైలాగులు.. ఎంచుకున్న అంశాన్ని అర్థమయ్యేలా చెప్పేందుకు చిన్న చిన్న కథలు... ఇలాంటివి లేకుంటే ఏ ప్రసంగమూ రక్తి కట్టించదు. ప్రస్తుత ఎన్నికల ప్రచారంలోనూ అగ్రనేతల నుంచి అభ్యర్థుల వరకు అంతా పంచ్ డైలాగులతో దుమ్మురేపుతున్నారు. ఎన్నికల్లో నెగ్గేదెవరో ఫలితాల తర్వాత తెలుస్తుంది కానీ.. ఇప్పుడు ప్రసంగాల్లో మాత్రం తగ్గేదేలే అంటున్నారు.

ముఖ్యమంత్రి కేసీఆర్ ఎప్పుడూ తన ప్రసంగాల్లో తెలంగాణ యాసలో మాట్లాడుతూ ఆకట్టుకుంటారు. ఇటీవలి సభల్లో.. తెలంగాణ రాష్ట్రం వచ్చిన కొత్తలో వసతులు ఏమీ లేవని చెప్పడానికి 'కొత్త కుండలో ఈగజొచ్చినట్టు' అన్న సామెతను వాడారు.

ఖమ్మం సభలో ప్రసంగిస్తూ 'పువ్వాడ పువ్వులు కావాలా? తుమ్మ ముళ్లు కావాలా' అంటూ ప్రతిపక్ష అభ్యర్థిపై ప్రాసలతో చలోక్తులు విసిరారు. అలానే 'ఆదాయం పెంచుకుంటూ పేదలకు పంచుకుంటూ పోతున్నాం' అంటూ ప్రాసతో వర్ణిస్తున్నారు.
పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ప్రసంగాలు వాడివేడిగా సాగుతాయి. కాళేశ్వరం ప్రాజెక్టులో భారాస అవినీతికి పాల్పడిందని చెప్పడానికి 'పనిమంతుడు పందిరేస్తే కుక్కతోక తగిలి కూలిపోయిందట' అనే సామెతను ఉటంకిస్తున్నారు.

మాటల మధ్యలో నినాదాలు ఇస్తూ సభికులతో మాట్లాడిస్తున్నారు. 'మార్పు కావాలి అంటే కాంగ్రెస్ రావాలి' అంటూ ప్రాస నినాదంతో సభికుల్లో హుషారు నింపే ప్రయత్నం చేస్తున్నారు.

రాష్ట్ర మంత్రి కేటీఆర్.. ఇటీవల కేసీఆర్ గురించి చెబుతూ 'సింహం సింగిల్‌గానే వస్తుంది' అంటూ సినిమా డైలాగును జోడిస్తున్నారు. అనేక సభల్లో కేటీఆర్ ఒక కథను చెబుతున్నారు. 'ఒక వ్యక్తి తల్లిదండ్రులను హతమారుస్తాడు.

తర్వాత పోలీసులు అతన్ని న్యాయస్థానానికి తీసుకెళితే న్యాయమూర్తి ముందు సానుభూతి పొందేందుకు.. సర్ శిక్ష తగ్గించి వేయండి అమ్మానాన్నా లేని అనాథను అంటాడు'.. ఇన్నేళ్లు పాలించిన కాంగ్రెస్ మళ్లీ ఒక్క ఛాన్స్ ఇవ్వమని అడగడం కూడా ఇలా విడ్డూరంగా ఉందని చెప్పేందుకు ఈ కథను కేటీఆర్ ప్రస్తావిస్తున్నారు.
'కాంగ్రెస్ పార్టీ పరిస్థితి.. వంద టికెట్లు.. నూటొక్క ధర్నాలు అన్నట్టు తయారైంది' అంటూ మంత్రి హరీశ్‌రావు తన ప్రసంగాల్లో ఎద్దేవా చేస్తున్నారు. 'కేసీఆర్ అంటే నమ్మకం.. కాంగ్రెస్ అంటే నాటకం' అంటూ ప్రాసలు విసురుతున్నారు.

భారాస, కాంగ్రెస్‌లు రెండూ ఒకే కోవకు చెందినవని చెప్పడానికి.. 'దున్నపోతులు తినేటోళ్లు పోయి ఏనుగులు తినేటోళ్లు వస్తారు' అంటూ కేంద్ర మంత్రి, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఇటీవల సభలో ఎద్దేవా చేశారు. భాజపా ఎన్నికల నిర్వహణ కమిటీ ఛైర్మన్ ఈటల రాజేందర్ సైతం.. "గజ్వేల్ ప్రజల్ని కదిలిస్తే మేం కేసీఆర్ బాధితులమని చెబుతున్నారు. నేను కూడా కేసీఆర్ బాధితుడినే. ఆ బాధితులకు ఈ బాధితుడు నాయకత్వం వహిస్తున్నాడు" అంటూ గజ్వేల్ ర్యాలీలో కవితాత్మకంగా ప్రసంగించారు.

# నేను చెల్లని రూపాయ్ కాదు డాలర్.. పువ్వాడకు తుమ్మల కౌంటర్



ఖమ్మం: మంత్రి పువ్వాడ అజయ్‌కు కాంగ్రెస్ అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావు కౌంటర్ ఇచ్చారు. "నేను చెల్లని రూపాయి కాదు డాలర్..... ఎక్కడైనా చెల్లుతా. డాలర్ కి ప్రపంచంలో ఏ దేశంలోనైనా విలువ. నీవు రద్దైన రెండు వేల నోటు నీ విలువ అది" అంటూ వ్యాఖ్యలు చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఎక్కడైనా పోటీ చేస్తానని.. ఖమ్మంలో పువ్వాడపై గెలుపు తనదే అని ధీమా వ్యక్తం చేశారు. తన రాజకీయ జీవితంలో భూ కబ్జాలు, అక్రమ కేసులు పెట్టించడం చేయలేదన్నారు. ప్రముఖ డాక్టర్ల భూములు కబ్జా చేశారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.

రఘునాథపాలెం మండలంలో లంబాడ సోదరుల భూములు, గుట్టలు కబ్జా చేశారని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. అరాచకం లేని ఖమ్మం కోసం, ప్రశాంతమైన ఖమ్మం కోసం, అన్ని వర్గాలు సంతోషంగా ఉండే ఖమ్మం కోసం కాంగ్రెస్ పార్టీనే గెలిపించాలని తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు.

# కోనప్పా... ఇగ చాలప్పా... ఆంధ్రా వెళ్లిపో..

కొమురంభీం: ఉద్యోగ, ఉపాధ్యాయులారా... సర్కార్లను మార్చేసిన చరిత్ర మీది అని... కేసీఆర్ అరాచక పాలనకు పాతరేయండి అని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సిర్పూర్ కాగజ్‌నగర్ సభలో బండి సంజయ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే వెంటనే కుప్పకూలుతాయన్నారు. తెలంగాణలో బీజేపీ తొలి గెలుపు సిర్పూర్ దే అని ధీమా వ్యక్తం చేశారు. "కోనప్పా... ఇగ చాలప్పా... ఆంధ్రా వెళ్లిపో..." అంటూ బీఆర్ఎస్ అభ్యర్థి కోనేరు కన్నప్పపై బీజేపీ నేత వ్యాఖ్యలు చేశారు. అంబలి, అన్నదానం చేస్తే చేసిన పాపాలు పోతాయా? అని ప్రశ్నించారు. సిర్పూర్ మిల్లులో ఉద్యోగాలియ్యకుండా స్థానికుల పొట్టకొడతావా అంటూ మండిపడ్డారు. చేసిన తప్పులకు రాజీనామా చేసి వెళ్లిపోక మళ్లీ ఓట్లడుగుతావా అని నిలదీశారు. 50 లక్షల నిరుద్యోగుల జీవితాలను నాశనం చేసిన మూరు?డు కేసీఆర్ అని విరుచుకుపడ్డారు. ఉద్యోగాల్లేక ఇంటికి బరువైన యువతను చూసి తల్లిదండ్రులు గుండెపగిలి రోదిస్తున్నారు. నిరుద్యోగులు, ఉద్యోగులు, రైతులు, విద్యార్థుల, మహిళల పక్షాన యుద్ధం చేశానన్నారు. సిర్పూర్ కాగజ్ నగర్‌లో గోండు ఖిల్లాను కబ్జా చేస్తుంటే ఎందుకు అడ్డుకోలేదని ప్రశ్నించారు. ఎంఐఎం నేతలు రెచ్చిపోతుంటే ఏం చేస్తున్నారని అడిగారు. "పాతబస్తీలో సభ పెట్టి దమ్ము చూపిన... సిర్పూర్‌లో మీ సత్తా చాటండి" అంటూ బండి సంజయ్ సవాల్ విసిరారు.

# నా అల్లుడిని బెదిరించారు... మ్యాన్ హ్యాడ్లింగ్ ఏంటి?.. ఐటీ ఆఫీసర్స్‌పై పొంగులేటి ఫైర్


ఖమ్మం: మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆఫీస్, నివాసాల్లో ఐటీ దాడులు ఇంకా కొనసాగుతున్నాయి. సోదాలు నిర్వహిస్తున్న సమయంలో ఐటీ అధికారుల ప్రవర్తన సరిగా లేదని పొంగులేటి మండిపడ్డారు. ఐటీ అధికారులు పరిధిని దాటి వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం పొంగులేటి మీడియాతో మాట్లాడుతూ... "నాపైనా, కుటుంబ సభ్యులకు చెందిన 30 కంపెనీలపై ఐటీ దాడులు చేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశాం. ఇది ప్రజా స్వామ్యమా?... ప్రజాస్వామ్యబద్ధంగా అధికారపక్షాలు పని చేస్తున్నారా?....ఆలోచన చేయాలి. అధికారిక ప్రభుత్వం ఒత్తిడితో ఐటీ దాడులు చేస్తున్నారు. తెలంగాణలో కాంగ్రెస్ బలంగా ఉంది అని... కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందన్న భయంతో అధికార పార్టీలు దాడులు చేయిస్తున్నాయి. కాంగ్రెస్‌ను అధికారంలోకి రానీయకుండా ఫెవికాల్ బంధం ఉన్నా బీజేపీ, బీఆర్ఎస్ కలిసి దాడులు చేస్తున్నారు. స్వయానా నా అల్లుడిని బెదిరించారు. నా ఆఫీసు అకౌంటెంట్‌పై థర్డ్ డిగ్రీకి పాల్పడ్డారు. థర్డ్ డిగ్రీ ప్రయోగించి ఒంటి కాలు మీద నిలబెట్టారు.. దారుణంగా బెదిరించారు. ఐటీ అధికారులు పరిధిని దాటి వ్యవహరించటం దుర్మార్గం. ఐటీ అధికారులు మ్యాన్ హ్యాడ్లింగ్ చేయటం ఏమిటి?.. మీకు ఏమైనా దొరికితే కేసులు పెట్టండి. ఐటీ అధికారుల తీరును తీవ్రంగా ఖండిస్తున్నా. మీరు హద్దులలో ఉండాలి... మీ రూల్స్ తెలియని వారు ఎవరు లేరు ఇక్కడ. నిబంధనలు ఉల్లంఘించిన మీరు కూడా దోషులు అవుతారు. బీఆర్ఎస్‌పై స్వరం పెంచిన తరువాత.. నాతో పాటు అనేక మంది వ్యక్తుల మీద అక్రమ కేసులు పెట్టారు ఓర్చుకున్నాం. మా కంపెనీలపై దాడులు చేశారు... అనుమతి ఇచ్చిన ప్రాజెక్టును ఆపివేశారు. తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారు... రిటర్న్ గిఫ్ట్ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారా ప్రజలు ఇస్తారు. అసలు గిఫ్ట్.. కేంద్రంలో ఇవ్వబోతున్నారు" అంటూ పొంగులేటి వ్యాఖ్యలు చేశారు. అలాగే కాంగ్రెస్ శ్రేణులనుద్దేశించి మాట్లాడుతూ.. "కాంగ్రెస్ శ్రేణులకు విన్నపం... సమయం తక్కువ ఉంది... కేసులతో ఇబ్బందులు పడుతున్న వారికి విముక్తి ఉండబోతుంది. 20 రోజుల పాటు కష్టపడి పని చేయాలి" అని పొంగులేటి శ్రీనివాసరెడ్డి కోరారు.




దిల్లీ: దేశ రాజధాని దిల్లీలో నెలకొన్న వాయు కాలుష్యంపై దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు శుక్రవారం విచారణ జరిపింది. ఈ సందర్భంగా దిల్లీ ప్రభుత్వం తీరుపై అసహనం వ్యక్తం చేసింది. తాము పదేపదే జోక్యం చేసుకుంటేనే వేగం వస్తుందా..? అంటూ మందలించింది. దిల్లీలో వాయు కాలుష్యానికి పొరుగు రాష్ట్రాల్లో పంట వ్యర్థాలను తగలబెట్టడమే కారణమా? అన్నదానిపై సుప్రీంకోర్టులో విచారణ జరుగుతుండగా.. దీనిపై అమికస్‌గా ఉన్న అపరాజితా సింగ్ న్యాయస్థానానికి ఓ నివేదిక సమర్పించారు. కాలుష్య మూలాలపై అందులో కీలక వివరాలను పేర్కొన్నారు. మొత్తం కాలుష్యంలో పంటవ్యర్థాల దగ్ధం 24 శాతం మేర ప్రభావం చూపుతోందని తెలిపారు. బొగ్గు మండించడం వల్ల 17 శాతం, వాహనాల నుంచి వెలువడే పొగ 16 శాతం గాలి కాలుష్యానికి కారణమని చెప్పారు. 'ప్రతి ఒక్కరికీ కాలుష్యం మూలం తెలిసినప్పటికీ.. వారంతా కోర్టు జోక్యం కోసం ఎదురుచూస్తున్నారు. మన వద్ద ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుంది. కానీ ఎవరూ ఏం చేయరు. కోర్టు కూడా ఫలితం కావాలని చెప్తుంది' అని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. 'మేం ప్రయోగాత్మకంగా స్మాగ్ టవర్లను ప్రారంభించాం. వర్షాకాలంలో వాటిని ఉపయోగించే వీలులేదు' అంటూ దిల్లీ పొల్యూషన్ కంట్రోల్ కమిటీ ప్రతినిధి కోర్టుకు వెల్లడించారు. దీనిపై కోర్టు స్పందిస్తూ.. 'మేం క్షేత్రస్థాయిలో పరిష్కారాలు అమలు కావాలని మాత్రమే చూస్తాం' అని పేర్కొంది. ఇదిలా ఉంటే.. ఇంతకుముందు విచారణలో భాగంగా దిల్లీ ప్రభుత్వం ప్రకటించిన 'సరి-బేసి' విధానంపై సుప్రీంకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. ఇలాంటి విధానాలు తక్కువ ఫలితాలను ఇస్తాయని పేర్కొన్న సుప్రీం.. దానిపై వివరణ ఇవ్వాలని దిల్లీ ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ నేపథ్యంలోనే నేడు ఆప్ సర్కారు న్యాయస్థానానికి అఫిడవిట్ దాఖలు చేసింది. 'సరి-బేసి విధానం సానుకూల ప్రభావం చూపుతుందని శాస్త్రీయ అధ్యయనాలు వెల్లడించాయి. దీని ద్వారా ప్రజా రవాణా వినియోగం పెరగడంతో పాటు 15 శాతం ఇంధన వినియోగం తగ్గుతుంది' అని పేర్కొంది.

**ప్రస్తుతానికి సరి-బేసి లేదు: దిల్లీ ప్రభుత్వం** – ప్రస్తుతానికి దేశ రాజధాని దిల్లీలో 'సరి-బేసి' విధానాన్ని అమల్లోకి తీసుకురాబోమని పర్యావరణ మంత్రి గోపాల్ రాయ్ వెల్లడించారు. 'గాలి నాణ్యతలో మెరుగుదల కనిపిస్తోంది. 450కి మించి ఉన్న వాయు కాలుష్య సూచీ .. 300కి పడిపోయింది. దాంతో నవంబర్ 13 నుంచి అమలు చేయాలనుకున్న 'సరి-బేసి' విధానాన్ని ప్రస్తుతానికి వాయిదా వేస్తున్నాం. దీపావళి తర్వాత మరోసారి సమీక్ష జరుపుతాం' అని మంత్రి వెల్లడించారు. ఈ విధానం అమలు నిర్ణయాన్ని సుప్రీంకోర్టు.. దిల్లీ ప్రభుత్వానికే వదిలేసిన నేపథ్యంలో ఈ ప్రకటన వెలువడింది.

# భాజపా డకౌట్.. కాంగ్రెస్ రనౌట్.. కేసీఆర్ సెంచరీ ఖాయం: మంత్రి హరీశ్‌రావు



నర్సాపూర్: ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో భాజపా డకౌట్.. కాంగ్రెస్ రనౌట్ అవుతాయని మంత్రి హరీశ్‌రావు అన్నారు. కేసీఆర్ సెంచరీ పూర్తి చేసుకొని మరోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపడతారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. నర్సాపూర్ భారాస అభ్యర్థి సునీతా లక్ష్మారెడ్డి నామినేషన్ ర్యాలీలో మంత్రి హరీశ్‌రావు పాల్గొని మాట్లాడారు. "సీఎం కేసీఆర్ ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. ప్రజలకు సంక్షేమ ఫలాలను అందించారు. గతంలో పది సార్లకు పైగా కాంగ్రెస్‌కు అవకాశం ఇస్తే ఆ పార్టీ చేసింది శూన్యం. గత ఎన్నికల్లో భాజపాకు ఒకటే సీటు వచ్చింది. ఈసారి ఆ పార్టీకి డిపాజిట్లు కూడా రావు. భాజపా డకౌట్.. కాంగ్రెస్ రనౌట్ అయిపోతాయి. కేసీఆర్ సెంచరీ కొట్టి మరోసారి అధికారంలోకి వస్తారు' అని హరీశ్ వ్యాఖ్యానించారు. 'కొడంగల్‌లో ఓడిపోతే రేవంత్‌రెడ్డి రాజకీయ సన్యాసం తీసుకుంటానన్నారు. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చే వరకు గడ్డం తీసుకోను అన్నారు. 28 లక్షల మోటార్లతో ప్రయోజనం పొందుతున్న రైతులు కేసీఆర్‌ను కాదని ఇతర పార్టీలకు ఓటు వేయరు. భారాస విజయం కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలి. సునీతమ్మ గెలిస్తే నర్సాపూర్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తారు. కాంగ్రెస్ నుంచి పోటీ చేసే అభ్యర్థి ఇప్పటివరకు సర్పంచి కూడా కాలేదు. రాష్ట్రంలో గెలిచే పార్టీ భారాస. ఇతర పార్టీలు గెలిస్తే అభివృద్ధి జరగదు. సీఎంతో ఉన్న అనుబంధం వల్ల మదన్ రెడ్డి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశారు. సునీతా రెడ్డిని ఎమ్మెల్యే చేయండి.. మదన్ రెడ్డిని ఎంపీ చేసే బాధ్యత నాది. ఈ ఇద్దరూ గెలిస్తే అభివృద్ధి కోసం కృషి చేస్తారు.

నర్సాపూర్ అభివృద్ధి కోసం 65 కోట్ల రూపాయలు కేసీఆర్ మంజూరు చేశారు" అని హరీశ్‌రావు వెల్లడించారు.

# బీజేపీలో 'బీఫామ్' మంటలు.. సంగారెడ్డిలో ఉద్రిక్తత




సంగారెడ్డి: సంగారెడ్డి బీజేపీలో ఆగ్రహ జ్వాలలు ఎగసిపడుతున్నాయి. బీఫామ్‌లు మంటలు రేపుతున్నాయి. అభ్యర్థుల జాబితాలో పేర్లు ఉండి బీఫామ్ మరొకరికి ఇవ్వడంతో తీవ్రస్థాయిలో ఆగ్రహం, ఆవేదన వ్యక్తం చేస్తున్నారు బీజేపీ నేతలు. సంగారెడ్డి రిటర్నింగ్ కార్యాలయం దగ్గర ఉద్రిక్తత చోటుచేసుకుంది. టికెట్ ఇచ్చి బీఫామ్ ఇవ్వలేదంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆర్వో కార్యాలయం ముందు బీజేపీ నేత రాజేశ్వర్‌రావు దేశ్‌పాండే నిరసన తెలిపారు. బీఫామ్ ఇవ్వకపోతే ఆత్మహత్య చేసుకుంటానంటూ దేశ్‌పాండే ఆవేదన వ్యక్తం చేశారు. అయితే, సంగారెడ్డి బీఫామ్‌ను పులిమామిడి రాజుకు బీజేపీ అధిష్టానం బీఫామ్ అందించింది. కాగా, వేములవాడ బీజేపీ అభ్యర్థిగా చెన్నమనేని వికాస్‌రావుకు చివరి క్షణంలో బీజేపీ అధిష్టానం బీఫామ్ అందించింది. ఇప్పటికే తుల ఉమ నామినేషన్ దాఖలు చేయగా, వికాస్‌రావు తరపున ఆయన అనుచరులు నామినేషన్ వేశారు.

# అవినీతి డబ్బుతో కేసీఆర్ గెలవాలనుకుంటున్నారు: సిద్ధరామయ్య



కామారెడ్డి: తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని కర్ణాటక సీఎం సిద్ధరామయ్య ధీమా వ్యక్తం చేశారు. కామారెడ్డిలో కాంగ్రెస్ బీసీ డిక్లరేషన్ సభలో పాల్గొన్న ఆయన సీఎం కేసీఆర్‌పై విమర్శలు గుప్పించారు. కేసీఆర్ అవినీతి డబ్బుతో ప్రజలను కొనేందుకు చూస్తున్నారు. కేసీఆర్‌ను రేవంత్‌రెడ్డి ఓడించడం ఖాయం. తెలంగాణ ప్రజలు బీఆర్ఎస్‌ను సాగనంపాలని ఇప్పటికే నిర్ణయించుకున్నారు" అని సిద్ధరామయ్య పేర్కొన్నారు. కామారెడ్డి సభలో సిద్ధరామయ్య బీసీ డిక్లరేషన్ ప్రకటించారు. బీసీ-డీలో ఉన్న ముదిరాజ్ కులస్తులను బీసీ-ఏలో చేరుస్తామని, జనాభా ప్రాతిపదికన బీసీ రిజర్వేషన్లు కల్పిస్తామని తెలిపారు. ఐదేళ్లలో బీసీల అభ్యున్నతి కోసం రూ.5 లక్షల కోట్లు ఖర్చు చేస్తాం. బీసీ సబ్‌ప్లాన్ ఏర్పాటు చేస్తాం. బీసీ కార్పొరేషన్ ద్వారా రూ.10 లక్షల ఆర్థిక సాయం. స్థానిక సంస్థల్లో 23 శాతం, రిజర్వేషన్‌ను 42 శాతం పెంచుతాం. 50 ఏళ్లు దాటిన నేత కార్మికులకు పెన్షన్ అందిస్తాం" అని సిద్ధరామయ్య వెల్లడించారు.

# పార్టీ అభ్యర్థితో నామినేషన్ వేయించేందుకు కారు డ్రైవర్‌గా మారిన కవిత



నిజామాబాద్ : తమ పార్టీ అభ్యర్థితో నామినేషన్ వేయించేందు ఎమ్మెల్సీ కవిత కారు డ్రైవర్‌గా మారారు. రెండవ సెట్ నామినేషన్ వేసేందుకు ఎమ్మెల్సీ కవితతో కలిసి అంబాసిడర్ కారులో ఎమ్మెల్యే గణేష్ గుప్తా ర్యాలీగా బయలు దేరారు. కవిత స్వయంగా కారును నడిపారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. గణేష్ గుప్తా చేసిన అభివృద్ధి, బీఆర్ఎస్ పథకాల వల్ల గెలుపు ఖాయమన్నారు. మూడవసారి ముఖ్యమంత్రి అయ్యే రికార్డ్ కేసీఆర్‌కి దక్కుతుందని కవిత జోస్యం చెప్పారు. ప్రజల ఆదరణ ప్రేమ వల్ల గెలుపు ఖాయమన్నారు. నిజామాబాద్ నగరం ఆనాడు ఎట్లా ఉండేది?.. ఈ రోజు ఎలా అయిందనే ఆలోచన చేయాలన్నారు. ఇక్కడ కల్పించిన శాంతి భద్రత వాతావరణం వల్ల అంతర్జాతీయ కంపెనీలు ఇక్కడికి వచ్చాయన్నారు. 54 ఏళ్లు అవకాశం ఇచ్చిన కాంగ్రెస్ ఎనాడూ నిజామాబాద్‌కు చేసిందేమీ లేదన్నారు. ఆరుసార్లు బీజేపీకి అవకాశం ఇచ్చిన నిజామాబాద్‌కు చేసింది ఏమీ లేదని.. కాబట్టి ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని కవిత విజ్ఞప్తి చేశారు.

# గంగుల కమలాకర్ సంచలన వ్యాఖ్యలు



కరీంనగర్: తెలంగాణను ఇతరుల చేతుల్లో పెట్టవద్దని, పొరపాటున వేరేవారికి అధికారం ఇస్తే రాష్ట్రం ఆగమాగమవుతుందని మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. కరీంనగర్ నియోజకవర్గంలోని కొత్తపల్లి మండలంలో శుక్రవారం ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ సంపద మీద ఆంధ్రా నేతల కన్ను పడిందని, కేసీఆర్ మళ్లీ రాకపోతే సంపదంతా వారు తీసుకువెళతారని ఆందోళన వ్యక్తం చేశారు. వెలుగులు విరజిమ్ముతున్న తెలంగాణను మళ్లీ గుడ్డి దీపంగా మార్చవద్దన్నారు. బీఆర్ఎస్‌కు ఓటు వేసి.. కేసీఆర్‌కు పట్టం కట్టాలని గంగుల కమలాకర్ కోరారు. తెలంగాణ రాకముందు రాష్ట్రంలో కరెంట్, నీళ్లు లేవని, ఫించన్ వచ్చేదికాదని గంగుల కమలాకర్ విమర్శించారు. ప్రజలు చాలా ఇబ్బందులు పడ్డారని.. అందుకనే తెలంగాణ రావాలని కొట్లాడమని.. రాష్ట్రం వచ్చాక మన కరెంట్, నీళ్లు, నిధులు వస్తున్నాయని అన్నారు. బీజేపీ, కాంగ్రెస్, పార్టీలు మాట్లాడుకుని హైదరాబాద్‌ను ఆంధ్రాలో కలిపే ప్రయత్నం చేస్తున్నారని.. తెలంగాణ ప్రజలు ఒక్కసారి ఆలోచించాలని అన్నారు. అసలు కేసీఆర్ లేకపోతే తెలంగాణ వచ్చేదా? అని అన్నారు. కాంగ్రెస్, బీజేపీ వస్తే మళ్లీ ఆంధ్రా పెత్తనం వస్తాదని.. తెచ్చుకున్న తెలంగాణను కాపాడుకుందామని అన్నారు. తెలంగాణలో మన పిల్లల భవిష్యత్ బాగుండాలంటే కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రిగా ఉండాలని గంగుల కమలాకర్ వ్యాఖ్యానించారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com